ప్రజల కోసం.. ప్రకృతి కోసం.. సామాన్యుల గొంతుగా.. సామాజిక సమరంగా..

# ధర్మఘంట

TELTEL/2012/47103

జాతీయ తెలుగు దిన పత్రిక

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 292 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | ఆదివారం 18 జనవరి 2026 | పేజీలు : 12 | వెల : 3

Circulated by: Nalgonda, Hyderabad, Warangal, Ranga Reddy, Medak, Khammam, Adilabad, Nizamabad, Mahabub Nagar, Karimnagar


## అదరగొట్టిన యూనియన్ బ్యాంక్ ఫలితాలు

ప్రభుత్వ రంగంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆకర్ష ణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటిం చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 డిసెంబర్‌తో ముగిసిన తృతీయ త్రైమాసికం (క్యూ3)లో రూ.5,017 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలోని రూ.4,604 కోట్ల లాభాలతో పోల్చితే 9 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. గడిచిన త్రైమాసికంలో సంస్థ నికర వడ్డీ ఆదాయం

## విదేశీ వాణిజ్యంలో చైనా రికార్డ్

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గతేడాది చైనా వాణి జ్యంపై అనేక ఆంక్షలు పెట్టడం తో పాటుగా భారీగా టారిఫ్‌ల ను పెంచినప్పటికీ రికార్డ్ విదేశీ వాణిజ్యాన్ని నమోదు చేసింది. 2025లో చైనా వస్తువుల విదేశీ వాణిజ్యం ఏడాది ప్రాతిపదికన 3.8 శాతం పెరిగి 45.47 ట్రిలియన్ యువాన్లకు (6.51 ట్రిలియన్ డాలర్ల) చేరుకుంది. ఇది సరికొత్త రికార్డును సృష్టించడమే కాకుండా, బలమైన వాణిజ్యానికి నిదర్శనమని చైనా జనరల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ కస్టమ్స్ వెల్లడించింది.



### తెలంగాణలో రోహిత్ వేముల

## చట్టాన్ని తీసుకొస్తాం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు
- సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి రోహిత్ చట్టాన్ని తీసుకువచ్చేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుంది
- రోహిత్ వేముల మరణం తర్వాత యూనివర్సిటీలో 50 మంది విద్యార్థులు, ఇద్దరు టీచర్లపైన నాన్ బెయిలబుల్ కేసులు నమోదయ్యాయి
- రోహిత్ వేముల మరణం తర్వాత యూనివర్సిటీలో 50 మంది విద్యార్థులు, ఇద్దరు టీచర్లపైన నాన్ బెయిలబుల్ కేసులు నమోదయ్యాయి.

హైదరాబాద్

రాష్ట్రంలో వీలైనంత త్వరగా రోహిత్ వేముల చట్టాన్ని తీసుకువస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శనివారం ప్రజాభవన్‌లో జస్టిస్ ఫర్ రోహిత్ వేముల క్యాంపెయిన్ కమిటీ సభ్యులతో డిప్యూటీ సీఎం సమావేశం అయ్యారు. రాష్ట్రంలో రోహిత్ వేముల చట్టం తీసుకురావాలంటూ రాహుల్ గాంధీ సైతం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారని గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి రోహిత్ చట్టాన్ని తీసుకువచ్చేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని - మిగతా3లో

# విద్యతోనే ప్రగతి



- లక్ష్యం ఉన్నతంగా ఉండాలి
- అందుకు కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలి
- భాషను, జ్ఞానాన్ని పెంచుకోవడానికి చిత్తశుద్ధితో పనిచేయాలి
- దశాబ్దాల క్రితం కాంగ్రెస్ హయాంలో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులే నేటికీ జీవనాధారంగా నిలుస్తున్నాయి
- భూగరిష్ఠ పరిమితి చట్టం తీసుకురావడం ద్వారా కాంగ్రెస్ దొరల వద్ద ఉన్న లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచింది

మహబూబ్ నగర్

మహబూబ్ నగర్ జిల్లా విద్యాహబ్‌గా మారుతోందని, పేదరి కం నుండి బయటపడటానికి విద్య ఒక్కటే సరైన మార్గమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. మహబూబ్ నగర్ జిల్లాలో ట్రిపుల్ ఐటీకి శంకుస్థాపన చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. 25 ఏళ్లు కష్టపడి చదివితే 75 ఏళ్ల వరకు గౌరవంగా జీవించవచ్చని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్లలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, చిట్టబోయినపల్లి ట్రిపుల్ ఐటీ నిర్మాణానికి ముఖ్యమంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తొలి ప్రధానమంత్రి నెహ్రూ సాగునీటి ప్రాజెక్టులు, విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం కూడా వాటికే ప్రాధాన్యతనిస్తుందని స్పష్టం చేశారు. దశాబ్దాల క్రితం కాంగ్రెస్ హయాంలో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులే నేటికీ జీవనాధారంగా నిలుస్తున్నాయని అన్నారు. భూగరిష్ఠ పరిమితి చట్టం తీసుకురా వడం ద్వారా కాంగ్రెస్ దొరల వద్ద ఉన్న లక్షలాది - మిగతా3లో



## బీహార్‌లో గెలిచాం.. బెంగాల్‌కు సమయం ఆసన్నమైంది

- ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో మమత ప్రభుత్వం విఫలమైందని విమర్శ
- బెంగాల్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్న నరేంద్ర మోదీ
- కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులను మమతా బెనర్జీ ప్రభుత్వం కొల్లగొడుతోంది



## పురుషులకు ఉచిత సిటీ బస్సు ప్రయాణం...

- ఎన్నికల హామీలను ప్రకటించిన అన్నాడీఎంకే
- ఐదు ఎన్నికల హామీలను ప్రకటించిన పళనిస్వామి
- కుటుంబంలో మహిళా యజమానికి నెలకు రూ. 2 వేలు
- పేదలకు ఇళ్లు కేటాయిస్తామని హామీ



## పెద్దల సభలో ఆ బిల్లు 33 ఏళ్లుగా పెండింగ్..

- ఓ బిల్లు 1992 నుంచి అంటే దాదాపు 33 ఏళ్లుగా పెండింగులో ఉంది.
- ఎగువసభ బులెటిన్ ప్రకారం.. జనాభా నియంత్రణ, చిన్న కుటుంబాలను ప్రోత్సహించేందుకు సంబంధించిన బిల్లు ఇది
- ఎన్నికల్లో పోటీచేసే వారికి ఇద్దరు పిల్లల నిబంధనను పొందుపరిచారు
- ఇద్దరు కన్నా ఎక్కువ పిల్లలు ఉంటే ఎంపీని లేదా ఎమ్మెల్యేని అనర్హులుగా ప్రకటించాలని ఆ బిల్లులో ప్రతిపాదించారు

# మున్సిపల్ ఎన్నికలకు రిజర్వేషన్లు ఖరారు



- మహిళలకు 50 శాతం
- ఖరారైన కార్పొరేషన్ల మేయర్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్‌ల రిజర్వేషన్లు
- జీహెచ్ఎంసీ కార్పొరేషన్ రిజర్వేషన్ జనరల్ మహిళకు కేటాయింపు
- కార్పొరేషన్లలో రిజర్వేషన్లు ఒకటి ఎస్సీ, ఒకటి ఎస్టీ, 3 బీసీలు
- 121 మున్సిపాలిటీల్లో 5 ఎస్టీ, 17 ఎస్సీ, 38 బీసీలు

హైదరాబాద్

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలకు రిజర్వే షన్లు ఖరారయ్యాయి. మున్సిపల్ చైర్మన్ పదవులకు రిజర్వేషన్లను ప్రభుత్వం శనివారం (జనవరి 17వ తేదీ) ఖరారు చేసింది. ఎస్టీలకు 5, ఎస్సీలకు 17, బీసీలకు 38, జనరల్ కేటగిరికి 61 స్థానాలు కేటాయించినట్టు ప్రభుత్వం వెల్లడించింది.

**ఎస్టీ కేటగిరీ**

1. కొల్లూరు: ఎస్టీ (జనరల్)
2. భూత్పూర్: ఎస్టీ (జనరల్)
3. మహబూబాబాద్: ఎస్టీ (జనరల్)
4. కేశసముద్రం: ఎస్టీ (మహిళ)
5. ఎల్లంపేట్ : ఎస్టీ (మహిళ)

**ఎస్సీ కేటగిరీ**

1. స్టేషన్‌ఘన్‌పూర్: ఎస్సీ (జనరల్)
2. చొప్పదండి: ఎస్సీ (మహిళ)
3. జమ్మికుంట: ఎస్సీ (జనరల్)
4. హుజురాబాద్: ఎస్సీ (మహిళ)
5. ఎదులాపురం: - మిగతా3లో



### యుద్ధం ముగియలేదు...

## ఇప్పుడే ప్రారంభమైంది

- ఈ గెలుపు ద్వారా తమను నిర్వీర్యం చేశామని బీజేపీ నేతలు భావిస్తున్నారన్న థాకరే
- బీజేపీ కుట్రలను త్వరలో బయటపెడతామని వ్యాఖ్య
- ముంబైలో శివసేన నుంచి మేయర్‌ను నియమించాలనేది తమ కల అన్న థాకరే
- ముంబై ఓటమి తర్వాత ఠాక్రేల స్పందన..

# ఘనంగా బిజెపి విజయ్ సంకల్ప సమ్మేళనం

- పార్టీ శ్రేణులకు పార్టీ రథసారధి ఎన్.రాంచందర్ రావు దిశానిర్దేశం
- కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత మనపై ఉంది
- తెలంగాణ ప్రజలు ఆలోచించాలి
- రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బిజెపిని అత్యధిక స్థానాల్లో గెలిపించి కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలి
- రానున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో సుమారు 52 లక్షల మందికి పైగా ఓటర్లు ఉన్నారు



హైదరాబాద్

హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ క్లాసిక్ గార్డెన్‌లో బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అధ్యక్షతన భారతీయ జనతా పార్టీ మున్సిపల్ కార్పొరేషన్ మున్సిపాలిటీ ఎన్నికల విజయ్ సంకల్ప సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సమ్మేళనానికి కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి , కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ గారు, బిజెపి శాసనసభా పక్ష నేత శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి , బిజెపి శాసన మండలి పక్ష నేత ఏవీఎన్ రెడ్డి , ఎంపీలు ఈటల రాజేందర్ , - మిగతా3లో

ధర్మఘంట

# సంపాదకీయం

## ఓటరును శక్తిమంతం చేస్తున్న ఎడిఆర్

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత ఏడున్నర దశాబ్దాలు గడిచాయి. పాతతరం నేతలు దాదాపుగా కనుమరుగైపోయారు. కేవలం వారి జీవిత గాథలు, వారు పాటించిన విలువలు మనకు జ్ఞాపకాలుగా మాత్రమే మిగిలాయి. కొత్త తరం నేతలు తమ పూర్వీకుల వాసన లేకుండా, విలువల జోలికి పోకుండా రాబోయే తరాల కోసం సంపాదించుకుంటూ రాజకీయాలను జాగ్రత్తగా తమకు అనుకూలంగా నడుపుకొస్తున్నారు. 1990కి పూర్వం రాజకీయాలు ఒక తీరున నడిస్తే తర్వాత కాలంలో మద్యం వ్యాపారులు, కాంట్రాక్టర్లు, భూ ఇసుక మాఫియా నేతలు, నేరచరిత్ర గలవాళ్లే ప్రజాప్రతినిధులుగా ఎక్కువమంది ఎన్నికవుతూ ప్రజాస్వామ్యాన్ని పరిహసిస్తున్నారు. ఎడిఆర్ అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫారమ్స్ అనే సంస్థ గత 25 ఏళ్లుగా రాజకీయ నాయకులపై, రాజకీయ పార్టీలపై రకరకాల కోణాల్లో సర్వే చేస్తూ నివేదికలు విడుదల చేస్తున్నది. గత పదేళ్లలో అంటే 2014 నుండి 2024 వరకు జరిగిన లోక్‌సభ, శాసనసభ ఎన్నికలలో పోటీ చేసిన ఎన్నికైన అభ్యర్థుల ఆదాయం, రాజకీయ పార్టీల ఆదాయం, ఎన్నికలలో జాతీయ, ప్రాంతీయ పార్టీలు ఏ విధంగా ఖర్చు చేశాయి, కేసులు ఎదుర్కొంటున్న పురుష మహిళా ప్రతినిధులు, ఎన్నికైన వారి విద్యార్హతలు ఈ రకంగా నేతల పార్టీల బాగోతాన్ని బహిర్గతం చేసింది. భారత ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే దిశగా నలుగురు దిగ్గజాలు చేపట్టిన అధ్యయనం దేశంలో సగటు పౌరుడిని ఆలోచింపజేస్తున్నది. ప్రజాస్వామ్యానికి పౌరుడే యజమాని అనేది ఈ సంస్థ విశ్వాసం, నినాదం. 2004 మొదలుకొని 2025 వరకు జరిగిన వివిధ ఎన్నికలలో రాజకీయ పార్టీలు, నేతలకు సంబంధించిన వివరాలన్నింటినీ బహిర్గత పరుచుతున్న ఎడిఆర్ ఇటీవల 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్రాలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన సమాచారం మొత్తాన్ని తన నివేదికలో వెల్లడించింది. 2024లో ఎన్నికైన 102 మంది లోక్‌సభ సభ్యులు, ఇంకా ఈ మధ్య ఎన్నికలలో గెలిచిన 400 మంది ఎంఎల్ఏల పైన సంస్థ తన శాంపిల్ సర్వే నిర్వహించింది. ఈ ప్రజాప్రతినిధులు తమ ఎన్నికల ఇచ్చిన సమాచారాన్ని ఉపయోగించుకుని దాన్ని క్రోడీకరించి సగటు పౌరుడికి తెలవని, తేలికగా తెలుసుకోలేని సమాచారాన్ని ఈ నివేదికలో పొందుపరిచింది. ముఖ్యంగా వారి ఆస్తులు 108% పెరగడం చాలా ఆశ్చర్యకరం. కాగా మన దేశంలో ఇంకా 30% మంది అంటే 40 కోట్ల మంది దారిద్ర్యరేఖ దిగువన తమ జీవనం సాగించడం చాలా ఆందోళనకరం. 2014 నుండి దేశ ప్రధానిగా నరేంద్ర మోడీ నాయకత్వంలోని ప్రభుత్వం తాను అనేక సంస్కరణలు తెచ్చానని, అందరి జీవన ప్రమాణాలు పెరిగాయని అందుకే జన్‌ధన్ బ్యాంక్ అకౌంట్లు తెరిపించినట్లు చెప్పుకున్నా ప్రయోజనం శూన్యం. ప్రజల ప్రమాణాలు రోజురోజుకు క్షీణించుతున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నా ప్రభుత్వ ప్రచారం మాత్రం భిన్నంగా ఉంది. దేశంలో అత్యధికంగా ఆస్తులు పెరిగినట్లు ప్రకటించిన మొదటి ఇద్దరు సభ్యులు కాగా, మూడవ స్థానం వైకాపా సభ్యులు ఆక్రమించడం విశేషం. వారి ఆస్తులు 162, 130, 124 కోట్లు పెరిగినట్లు నివేదిక తెలుపుతున్నది. ఆస్తులు బాగా పెంచుకున్న మొదటి పది మంది సభ్యుల్లో ఐదుగురు బిజెపి సభ్యులే కాగా, సర్వే తెలిపిన 102 మందిలో 65 మంది కూడా ఆ పార్టీ వారే కావడం కూడా బిజెపి ధనికులకే పార్టీ టిక్కెట్లు ఇస్తుందన్న విషయాన్ని నిరూపిస్తున్నది. బిజెపి సభ్యుల ఆస్తులు 108%పెరగగా, కాంగ్రెస్ సభ్యులు 135%, తృణమూల్ సభ్యులు 86% పెంచుకున్నారు. నేషనల్ ఎలక్షన్ వాచ్ సంస్థతో ఎడిఆర్ సంయుక్తంగా జరిపిన విశ్లేషణలో దేశంలోని 5203 మంది ఎంఎల్ఏలు, ఎంఎల్‌సిలు, లోక్‌సభ, రాజ్యసభ సభ్యుల్లో 1106 మంది అంటే 21% సభ్యులకు వంశపారంపర్య రాజకీయాలు ఉన్నట్లుగా తెలిసింది అంటే ప్రతి ఐదులో ఒక సభ్యుడు వారసత్వ అర్హతతో రాజకీయాలు నడుపుతున్నాడన్నమాట. వీరిలో 32% కాంగ్రెస్ కాగా, 17% బిజెపి సభ్యులు కావడం గమనార్హం. ప్రాంతీయ పార్టీలు సైతం జాతీయ పార్టీల బాటలోనే నడుస్తుండడం బాధాకరం.ఇక చట్టసభలకు ఎన్నికయ్యే గౌరవ సభ్యులు అనేకమంది నేరచరిత్ర కలవారుగా వారు తమ అఫిడవిట్లలోనే చూపించు కున్నారు. 20 శాతం పోటీ చేసిన సభ్యులపై క్రిమినల్ కేసులు ఉండగా, 14% మంది తీవ్రమైన నేర సంబంధిత కేసుల్లో నమోదైన వారున్నారు. లోక్‌సభకు పోటీ చేశారు 98 మంది కోర్టులచే శిక్షపొందిన వారు కాగా, 40 మంది హత్య కేసుల్లో నిందితులు మహిళా అభ్యర్థుల సైతం ఇలాంటి కేసుల్లో ఉండడం బాధాకరం. కాగా బిజెపి నుండి 43%, కాంగ్రెస్ పార్టీ నుండి 44% అభ్యర్థులు తమపై కేసులున్నట్లు ప్రకటించినట్లుగా నివేదిక తెలుపుతున్నది. 2024 లోక్‌సభకు పోటీచేసిన అత్యంత ధనవంతులలో ఒకరు ఆంధ్రప్రదేశ్, ఒకరు తెలంగాణ, మరొకరు గోవాకు చెందినవారు. 46 మంది జీరో ఆస్తులు ప్రకటించడం గమనార్హం. 767 మంది లక్షకు తక్కువగా ఆస్తులు ఉన్నట్లుగా తమ అఫిడవిట్లలో పేర్కొన్నారు. అదే విధంగా పోటీ చేసిన వారిలో 42 శాతం మంది ఐదు నుండి 12 తరగతుల మధ్యన చదవగా, 51% మంది పట్టభద్రులు ఆపైన చదివినట్లుగా పేర్కొన్నారు. 292 మంది డిప్లొమా హోల్డర్లు. 217 మంది కనీస అక్షరాస్యులు కాగా, 121 మంది నిరక్షరాస్యులు.2024 లోక్‌సభకు రకరకాల జాతీయ, ప్రాంతీయ పార్టీల అభ్యర్థుల వయసు, ఆస్తులు, విద్యార్హతలు, లింగం, నేరచరిత్ర, వంశపారంపర్యత, వారి ఓట్ షేర్ లాంటి అనేక సున్నితమైన అంశాలను ఎలక్షన్ కమిషన్ వెబ్‌సైట్ నుండి సేకరించి ఎడిఆర్, ఎన్ఇడబ్ల్యూ సంస్థల విశ్లేషణాత్మకమైన నివేదిక ప్రజలకు అందుబాటులో ఉంచారు. తదుపరి జరిగిన ఢిల్లీ, బీహార్ ఎన్నికల అభ్యర్థుల వివరాలపై కూడా సమాచారంతో పాటుగా ప్రతి అధ్యాయం చివరన వీరి సలహాలు, సూచనలు కూడా పొందుపరిచారు. పార్టీలవారీగా కూడా ప్రతి అంశం విషయంలో ప్రత్యేక సమాచారం అందజేయడం విశేషం. ఐదు అధ్యాయాలు దాదాపు 1000 పేజీలతో కూడిన నివేదిక సగటు భారతీయ ఓటర్లను ఆలోచింపజేస్తుంది. నివేదిక ఇంగ్లీషు, హిందీ భాషల్లో కూడా లభ్యమవుతుంది. ఓటు వేయడం కాదు, సరైన అభ్యర్థికి ఓటు వేయాలి అనే స్పృహ కలిగిస్తుంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు కూడా నేరచరిత్ర, కేసులు, బిలియనీర్లు లాంటి అంశాల్లో తాము కూడా తక్కువ కాదు అని నిరూపించుకున్నారు. పబ్లిక్ డొమైన్‌లో లభ్యమవుతున్న ఈ నివేదిక గత ఎన్నికలలో ఎన్నికైన సభ్యుల వివరాలతో పోలికను కూడా చూపడం అసాధారణమైన విషయం. త్రిలోచన్ శాస్త్రి, అజిత్ రనాడే, జగదీప్ చొక్కార్ వీరు ముగ్గురు మేజర్ జనరల్ అనిల్ వర్మ నాయకత్వంలో పనిచేస్తూ ఎన్నికల సంస్కరణలకు తమ వంతు సూచనలు, సలహాలు అందజేస్తున్నారు.1999లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అహ్మదాబాద్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న వీరు స్థాపించిన ఎడిఆర్ పౌరులను, ఓటర్లను సాధికారులను చేసే దూరదృష్టి, స్వేచ్ఛాయు తమైన, నీతివంతమైన ఎన్నికలు, సంస్కరణలు రాజకీయ పార్టీలను బాధ్యులు చేసే విధంగా అవినీతి రహిత, నేర రహిత రాజకీయాలే ధ్యేయంగా పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం, పారదర్శకత కోసం తన వంతు పాత్ర నిర్వహించుచున్నది. పార్టీలను, నేతలను జవాబుదారులుగా చేస్తున్నది. పోటీ చేసే అభ్యర్థులు తప్పనిసరిగా అప్పుడు సమర్పించేలా చేయడం ఆదాయ పన్ను రిటర్న్ ప్రజలకు అందుబాటులో ఉంచడం, రాజకీయ పార్టీలు సమాచార హక్కు కింద పనిచేయడం, బ్యాలెట్ పేపర్‌లో 'నోటా' ఉండేలా చేయడం, రాజకీయ పార్టీల ఎన్నికల ఖర్చుల పరిశీలించడం, సిఇసి ఇతర సభ్యులను ప్రధానమంత్రి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రతిపక్ష నాయకుల కమిటీ నిర్ణయించాలని, ఎలక్టోరల్ బాండ్స్ నియంత్రణ జరగాలని, వివి ప్యాట్ల లెక్కింపు జరగాలనేవి వీటిలో ముఖ్యమైనవి. ఈ విజయాల ద్వారా అసోసియేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్ సంస్థ అవినీతి రాజకీయ పార్టీలు, నేరపూరిత నేతల గుండెల్లో మాత్రం రైళ్లు పరుగెత్తిస్తున్నది. భారత రాజకీయాలు ప్రక్షాళన చేసే ఎడిఆర్ ప్రయత్నానికి ప్రజాస్వామ్యవాదులు తమ మద్దతు తెలుపుతారని ఆశిద్దాం. ఈ నివేదికల ద్వారా సగటు భారతీయ ఓటరు మరింత చైతన్యవంతమవుతాడని, అదే విధంగా

# పేదల పక్షాన నిలిచిన ప్రజాసేవ యోధుడు కొప్పుల రాజు ఐఏఎస్ (రిటైర్డ్)

ధర్మఘంట, జనవరి 16, హైదరాబాద్







"సామాజిక న్యాయం లేకుండా రాజకీయ ప్రజాస్వామ్యం నిలవదు" అని డా. బీఆర్ అంబేద్కర్ చెప్పిన మాటలను తన జీవిత కార్యాచరణగా మార్చుకున్న అరుదైన ప్రజాసేవకుడు కొప్పుల రాజు ఐఏఎస్ (రిటైర్డ్). దళితులు, గిరిజనులు, గ్రామీణ పేదలు, మహిళలు, అసంఘటిత కార్మికుల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకురావడమే లక్ష్యంగా తన జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తిగా ఆయనకు దేశవ్యాప్తంగా విశేష గుర్తింపు ఉంది. పాలనను అధికార ప్రదర్శనగా కాకుండా, సామాజిక బాధ్యతగా భావించిన కొప్పుల రాజు రాజ్యాంగ విలువలను పుస్తకాలకే పరిమితం చేయకుండా, భూమి స్థాయిలో అమలు చేసిన పరిపాలనా యోధుడిగా నిలిచారు. 1956 జూన్ 10న జన్మించిన కొప్పుల రాజు, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎంఎస్సీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నుంచి జీవ శాస్త్రాల్లో ఎంఫిల్ పూర్తి చేసి, తొలి ప్రయత్నంలోనే 1981 బ్యాచ్ ఐఏఎస్‌గా ఎంపికయ్యారు. చిన్ననాటి నుంచే డా. బీఆర్ అంబేద్కర్, జ్యోతిబా పూలే ఆలోచనల ప్రభావంతో సమానత్వం, సామాజిక న్యాయం తన జీవిత ధ్యేయంగా మార్చుకున్నారు.

నెల్లూరు కలెక్టర్‌గా ప్రజా పాలనకు కొత్త నిర్వచనం

**"అధికారం సేవకోసం ఉపయోగించ బడకపోతే, అది అణచివేతగా మారుతుంది" - డా. బీఆర్ అంబేద్కర్**

1988 నుంచి 1992 వరకు నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన కాలం – కేవలం ఒక అధికారిక పదవీకాలం కాదు, ప్రజా చైతన్యానికి నాంది పలికిన దశగా నిలిచింది. అధికారిగా మాత్రమే కాకుండా, కుటుంబ సభ్యుడిలా ప్రజల సమస్యలకు స్పందించిన కొప్పుల రాజు, ప్రజల మదిలో "ప్రజా కలెక్టర్" గా నిలిచారు.

**సంపూర్ణ అక్షరాస్యత ఉద్యమం,**

దూబగుంటలో ప్రారంభమైన సారా వ్యతిరేక ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా ఒక దావానం లా అనేక ప్రజా ఉద్యమాలుగా విస్తరించి, అప్పటి పాలకుల విధానాలనే ప్రశ్నార్థకంగా నిలిపాయి. ఇవన్నీ ప్రజల నుంచి పుట్టిన ఉద్యమాలుగా మారడం ఆయన ప్రజాకేంద్ర పాలనకు నిదర్శనం.

**పేదరిక నిర్మూలన - మహిళా శక్తీకరణలో అంబేద్కర్ దృష్టి, "స్త్రీ పురోగతి లేకుండా సమాజ పురోగతి అసాధ్యం" - డా. బీఆర్ అంబేద్కర్**

గ్రామీణ పేదరికానికి శాశ్వత పరిష్కారం మహిళా సాధికారతేనన్న అంబేద్కర్ ఆలోచనను కార్యరూపంలో పెట్టిన వ్యక్తి కొప్పుల రాజు. మహిళల స్వయం సహాయక సంఘాల ద్వారా లక్షలాది గ్రామీణ మహిళలకు ఆర్థిక స్వావలంబన, సామాజిక గౌరవం లభించింది. ఒక సాధారణ గ్రామీణ మహిళ స్థానిక రాజకీయ నాయకురాలిగా ఎదగడం – ఆయన విధానాల విజయానికి ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచింది. ఈ మార్పులకుగాను 1998లో ఐక్యరాజ్యసమితి నుంచి భారత్‌కు అంతర్జాతీయ గుర్తింపు లభించగా, ఆ విజయానికి వెనుక ఉన్న కీలక శక్తిగా కొప్పుల రాజు సేవలు ప్రశంసించబడ్డాయి.

**భూహక్కులునీటిపారుదల - రైతు ప్రాణాల రక్షణ, "ఆకలితో ఉన్నవాడికి స్వేచ్ఛ అర్థం కాదు" - డా. బీఆర్ అంబేద్కర్**

పేదల భూహక్కులపై అధ్యయనం చేసిన కోనేరు రంగారావు కమిటీ సభ్యుడిగా, సుమారు వంద సిఫార్సులతో కూడిన నివేదిక రూపకల్పనలో కొప్పుల రాజు కీలక పాత్ర పోషించారు. పేదలకు కేటాయించిన భూములకు సాగునీరు అందించే ఇందిరా జలప్రభ పథకాన్ని రూపకల్పన చేసి, అనేక రైతు కుటుంబాలను ఆత్మహత్యల అంచు నుంచి రక్షించారు.

**భూమి, నీరు, ఉపాధి - ఈ మూడూ పేదల జీవన హక్కులేనన్న అంబేద్కర్ భావనకు ఇది ఆచరణాత్మక రూపం.**

జాతీయ స్థాయిలో ప్రజానుకూల చట్టాలకు మేధస్సు – "హక్కులు అడగాల్సిన అవసరం లేకుండా అమలవ్వాలి" – డా. బీఆర్ అంబేద్కర్

యూపీఏ ప్రభుత్వ కాలంలో జాతీయ సలహా మండలి సభ్యుడిగా పనిచేస్తూ, సమాచార హక్కు చట్టం, విద్యా హక్కు చట్టం, అటవీ హక్కుల చట్టం, గ్రామీణ ఉపాధి హక్కు చట్టం, ఆహార భద్రత చట్టం, భూసేకరణ చట్టం వంటి చారిత్రాత్మక ప్రజానుకూల చట్టాల రూపకల్పనలో కొప్పుల రాజు కీలక పాత్ర పోషించారు.

**స్వయం సహాయక సంఘాల విప్లవం - మహిళల చేతుల్లో శక్తి**

ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ పేదరిక నిర్మూలన కోసం ఏర్పాటైన సంస్థ ద్వారా దాదాపు ఎనిమిది లక్షల స్వయం సహాయక సంఘాలు, వేలాది గ్రామ సంఘాలు, మండల సమాఖ్యలు బలోపేతమయ్యాయి. మహిళా సంఘాలకు తక్కువ వడ్డీ, ఆపై సున్నా వడ్డీ విధానాల అమలుతో మహిళల ఆర్థిక బానిసత్వం చెరిపివేయబడింది. ఉపాధిని హక్కుగా మార్చిన పరిపాలన

**"పని చేయాలనుకునే ప్రతి ఒక్కరికీ పని కల్పించాల్సిన బాధ్యత రాష్ట్రానిదే" - డా. బీఆర్ అంబేద్కర్ భావసారం**

గ్రామీణాభివృద్ధి శాఖలో కీలక బాధ్యతలు నిర్వహించిన సమయంలో, ఉపాధి పథకాన్ని హక్కుల ఆధారిత వ్యవస్థగా అమలు చేసి ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలిపారు. కరోనా వంటి సంక్షోభ కాలంలో కోట్లాది వలస కూలీలకు జీవనాధారంగా మారిన ఈ వ్యవస్థ కారణంగా ప్రజలు ఆయనను "ప్రాణదాత" గా గుర్తించారు.

**ఎంజీ నరేగా లో కొప్పుల రాజు పాత్ర - ఉపాధిని పథకం నుంచి హక్కుగా మార్చిన నాయకత్వంలి**

ఎంజీ నరేగా ఒక పథకం కాదు – రాజ్యాంగ హక్కు అనే దృష్టి ఎంజీ నరేగా రూపకల్పన, అమలు దశల్లో కొప్పుల రాజు పాత్రను అర్థం చేసుకోవాలంటే ముందుగా ఒక విషయం స్పష్టంగా చెప్పాలి. ఆయన దృష్టిలో ఎంజీ నరేగా ఒక ప్రభుత్వ పథకం కాదు. అది గ్రామీణ పేదల జీవన హక్కు. డా. బీఆర్ అంబేద్కర్ చెప్పిన "పేదరికం ప్రజాస్వామ్యానికి అతిపెద్ద శత్రువు" అన్న ఆలోచనకు ఎంజీ నరేగా ఒక ఆచరణాత్మక సమాధానంగా ఆయన చూశారు.

**జాతీయ స్థాయిలో చట్ట రూపకల్పనలో పాత్ర**


యూపీఏ ప్రభుత్వ కాలంలో దేశంలోని అత్యున్నత సామాజిక విధానాల రూపకల్పన వేదిక అయిన జాతీయ సలహా మండలిలో సభ్యుడిగా కొప్పుల రాజు పనిచేశారు. ఈ దశలో ఆయన చేసిన ప్రధాన కృషి ఫలితమే ఉపాధి హామీని చట్టబద్ధ హక్కుగా గుర్తింపజేయడం. "పని అడిగితే పని ఇవ్వాలి" అనే సూత్రాన్ని చట్టంలో పొందుపరచడం. ఉపాధి కల్పించలేకపోతే నిరుద్యోగ భృతి అనే భావనను బలపరచడం. కూలీలకు సమయానికి వేతనం చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేయడం, ఇవి అన్నీ ఎంజీ నరేగా ను దయాపూర్వక పథకం నుంచి హక్కుల ఆధారిత చట్టంగా మార్చాయి. ఆంధ్రప్రదేశ్‌లో అమలును దేశానికి ఆదర్శంగా మార్చిన పరిపాలన. గ్రామీణాభివృద్ధి శాఖలో కీలక బాధ్యతలు నిర్వహించిన సమయంలో, కొప్పుల రాజు ఎంజీ నరేగా ను కాగితాలకే పరిమితం కాకుండా గ్రామ స్థాయిలో జీవింపజేశారు. ఆయన అమలు చేసిన ముఖ్య సూత్రాలు: ప్రతి గ్రామంలో పని లభ్యత ఉండాలి. కూలీలకు పని ప్రదేశం వారి నివాసానికి దగ్గరగా ఉండాలి. వేతనాలు ఆలస్యం కాకుండా చెల్లించాలి. సామాజిక తనిఖీలు తప్పనిసరిగా జరగాలి. గ్రామసభలకు కీలక పాత్ర ఇవ్వాలి. ఈ దృష్టితోనే ఆంధ్రప్రదేశ్‌ను ఎంజీ నరేగా అమలులో దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలిపారు.

ఎంజీ నరేగా = ఉపాధి + గౌరవం కొప్పుల రాజు దృష్టిలో ఎంజీ నరేగా లక్ష్యం కేవలం పని ఇవ్వడం కాదు. అది గ్రామీణ పేదలకు ఆత్మగౌరవం. వలస కూలీలకు స్థానిక ఉపాధి మహిళలకు స్వతంత్ర ఆదాయం. దళితులు, గిరిజనులకు రాజ్యాంగ హక్కుల అనుభూతి. అందుకే ఆయన ఎంజీ నరేగాను "పేదలకు ఇచ్చిన అతిపెద్ద రాజ్యాంగ భరోసా"గా వ్యాఖ్యానించారు. సంక్షోభ కాలాల్లో ప్రాణ రక్షణ వ్యవస్థ: కరోనా వంటి తీవ్రమైన సంక్షోభ కాలాల్లో, ఎంజీ నరేగా దేశంలోని కోట్లాది గ్రామీణ కుటుంబాలకు జీవనాధారంగా నిలిచింది. ఆ సమయంలో: వలసలు తగ్గాయి. ఆకలి మరణాలకు అడ్డుపడ్డాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ నిలబడ్డది. ఎంజీ నరేగా వెనుక అంబేద్కర్ ఆలోచన డా. బీఆర్ అంబేద్కర్ చెప్పిన "హక్కులు కాగితాల్లో కాదు, జీవితాల్లో కనిపించాలి" అన్న మాటకు ఎంజీ నరేగా ఒక ప్రత్యక్ష ఉదాహరణ. ఈ హక్కు ప్రజల జీవితాల్లో నిజంగా కనిపించేలా చేసిన నాయకత్వమే కొప్పుల రాజు పాత్ర. ఎంజీ నరేగా చట్ట రూపకల్పనలో మేధస్సుఅమలులో పరిపాలనా దృష్టి పేదల పక్షాన నిలిచిన రాజ్యాంగ స్పృహ, ఉపాధిని హక్కుగా మార్చిన సంకల్పం. ఇవి అన్నీ కలిసినప్పుడే ఎంజీ నరేగా లో కొప్పుల రాజు పాత్ర చరిత్రాత్మకంగా నిలిచింది.

సేవే జీవితం – పదవులకన్నా విలువలు గొప్పవి ప్రభుత్వ సేవల పరిమితులను దాటి, సమాజ సేవకు పూర్తిగా అంకితం కావాలన్న సంకల్పంతో ఐఏఎస్ పదవిని వదిలి ప్రజా జీవితంలోకి అడుగుపెట్టారు విద్యార్థులకు వ్యక్తిగతంగా ఆర్థిక సహాయం చేయడం, తన పేరుతో కాలనీలు ఏర్పడటం – ఇవి అధికారంతో వచ్చిన గౌరవాలు కాదు, ప్రజల ప్రేమతో వచ్చిన గుర్తింపులు. ప్రస్తుతం ఝార్ఖండ్ రాష్ట్ర పీసీసీ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న కొప్పుల రాజు పాలన, ప్రజాసేవ, సామాజిక మార్పు అనే మూడు దిశల్లో అంబేద్కర్ ఆలోచనలకు జీవం పోసిన వ్యక్తిగా నిలుస్తున్నారు.

# పారిస్ ఒప్పందాన్ని విస్మరిస్తే ప్రళయం భూమికే ప్రమాదం




ఈ రోజుల్లో ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు వాతావరణ మార్పు. పెరుగుతున్న వేడి, అకస్మాత్తుగా వచ్చే వరదలు, కరువులు, సముద్ర మట్టం పెరుగుదల ఇవన్నీ ఇక భవిష్యత్తు భయాలు కాదు, మన కళ్లముందే జరుగుతున్న వాస్తవాలు. ఈ ప్రమాదాల నుంచి భూమిని, మానవజాతిని కాపాడేందుకు ప్రపంచ దేశాలు కలిసి చేసిన అత్యంత కీలక ఒప్పందమే పారిస్ ఒప్పందం. 2015లో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ఆమోదించిన ఈ ఒప్పందం, ప్రపంచ సగటు ఉష్ణోగ్రతల పెరుగుదలను 2 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువకు, సాధ్యమైనంత వరకు 1.5 డిగ్రీలకే పరిమితం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యం సాధించకపోతే, భవిష్యత్తులో భయంకరమైన ప్రకృతి విపత్తులు అనివార్యమని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ ఒప్పందంలో 194 దేశాలు భాగస్వాములయ్యాయి. ప్రతి దేశం తన వంతు బాధ్యతగా కాలుష్యాన్ని తగ్గించేందుకు, పునరుత్పాదక ఇంధనాన్ని పెంచేందుకు, అడవులను కాపాడేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది. ఇది కేవలం ఒక అంతర్జాతీయ పత్రం కాదు ఇది భవిష్యత్ తరాల కోసం మనం ఇచ్చిన హామీ. 2025లో బ్రెజిల్‌లో జరిగిన కాప్30 వాతావరణ సదస్సులో ఒక ఆందోళనకరమైన నిజం వెలుగులోకి వచ్చింది. ఇప్పటి వరకు దేశాలు చేస్తున్న ప్రయత్నాలు పారిస్ ఒప్పంద లక్ష్యాలను చేరుకునేందుకు సరిపోవడం లేదని స్వయంగా దేశాలే అంగీకరించాయి. ప్రపంచ కాలుష్య ఉద్గారాలు ఇంకా పెరుగుతూనే ఉన్నాయి. దీని అర్థం మనం ఇంకా సమయాన్ని వృథా చేస్తున్నామన్న మాట. ఈ పరిస్థితిలో అభివృద్ధి చెందిన దేశాలకు ఒక పెద్ద నైతిక బాధ్యత ఉంది. శతాబ్దాలుగా ఎక్కువగా కాలుష్యం చేసిన దేశాలు, నేడు దాని ప్రభావాలను ఎదుర్కొంటున్న పేద మరియు అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఆర్థిక, సాంకేతిక సహాయం అందించాల్సిందే. ఇది దయ కాదు న్యాయం. పారిస్ ఒప్పందం ప్రత్యేకత ఏమిటంటే, ఇది ప్రతి దేశాన్ని తన లక్ష్యాలను తరచుగా సమీక్షించి మరింత బలంగా చేయాల్సిన బాధ్యతలో ఉంచుతుం ది. మాటలకే పరిమితం కాకుండా, చర్యలకు దారితీసే విధానమే దీని బలం. ఈ రోజు తీసుకునే నిర్ణయాలే రేపటి భూమి భవితవ్యాన్ని నిర్ణయి స్తాయి. మనం ఇప్పుడు చర్యలు తీసుకోకపోతే, రాబోయే తరాలు మన్నించవు. కాబట్టి ప్రపంచ నాయకులు, ప్రభుత్వాలు మాత్రమే కాదు ప్రతి పౌరుడూ వాతావరణ పరిరక్షణలో భాగస్వామిగా మారాలి. పారిస్ ఒప్పందాన్ని కాగితాలకే పరిమితం చేస్తే అది ప్రళయానికి ఆహ్వానం. దాన్ని ఆచరణలో పెట్టడమే భూమికి రక్షణ కవచం.



ప్రభుదాస్ గండమళ్ళ
ఎకనామిక్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా
ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ మరియు ప్రపంచ
బ్యాంకు సివిల్ సొసైటీ పాలసీ ఫోరమ్
సభ్యుడు, వాషింగ్టన్ డి.సి, అమెరికా.
9441464767 ; 9390381267

ధర్మఘంట

# మొదటిసారి ముంబైలో బీజేపీ పీఠం



**ముంబై :** మూడు దశాబ్దాల తర్వాత ముంబై రాజకీయాల్లో పెను మార్పు వచ్చింది. దేశంలోని అత్యంత ధనిక మున్సిపల్ కార్పొరేషన్ అయిన బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ఇప్పుడు బీజేపీ పాలనలో ఉంది. మహా యుతి కూటమి మెజారిటీ మార్కును దాటింది. ముంబైలో తొలిసారిగా మేయర్ పదవిని చేపట్టే స్థితికి బీజేపీ చేరుకుంది. మరోవైపు, ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కూడా తన పనితీరుతో గౌరవాన్ని కాపాడుకున్నారు. మరోవైపు, ఠాక్రే సోదరులకు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది, అయితే అసదుద్దీన్ ఓవైసీ పార్టీ ఎఐఎమ్ఐఎమ్ అందరినీ ఆశ్చర్యపరుస్తూ దూసుకుపోయింది. 227 మంది సభ్యులున్న ః ఓఅ సభలో మెజారిటీ సాధించడానికి 114 సీట్లు అవసరం. శుక్రవారం నాడు మహా యుతి ఈ సంఖ్యను దాటగలిగింది. బీజేపీ 89 సీట్లు గెలుచుకోగా, ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన 29 సీట్లు గెలుచుకుంది. ఈ విధంగా, కూటమి స్వల్ప ఆధిక్యాన్ని కలిగి ఉంది, అయితే పెద్ద నిర్ణయాలు తీసుకోవడానికి బీజేపీ షిండే వర్గంపై ఆధారపడవలసి ఉంటుంది.

**బీజేపీకి ముంబై మేయర్ పదవి**

బీజేపీ ఎమ్మెల్యే, అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నర్వేకర్ మాట్లాడుతూ ముంబై మేయర్ బీజేపీకి చెందినవారేనని స్పష్టం చేశారు. దీనిపై స్పందించిన ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, పదవి కంటే ముంబై ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడం తనకు ముఖ్యమని అన్నారు. అయితే, షిండే వర్గం ముఖ్యమైన పదవులను, ముఖ్యంగా స్టాండింగ్ కమిటీని కోరుకునే అవకాశం ఉంది. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన రాజ్ ఠాక్రే నేతృత్వంలోని ఓఔూ కలిసి 71 సీట్లు గెలుచుకున్నాయి. ఉద్ధవ్ వర్గం 65 సీట్లు, ఓఔూ 6 సీట్లు గెలుచుకున్నాయి. దాదర్, పరేల్, లాల్‌బాగ్, వర్లీ, శివ్డీ వంటి ముంబైలోని సాంప్రదాయ మరాఠీ ప్రాంతాల్లో ఠాక్రే కుటుంబం పట్టు నిలుపుకుంది. వర్లీలో షిండే వర్గం అభ్యర్థి ఓడిపోయారు. అయితే, థానే, నవీ ముంబై వంటి ప్రాంతాల్లో ఈ కూటమి ప్రభావం చూపించలేకపోయింది. ఎన్నికల ఫలితాల తర్వాత ఏక్‌నాథ్ షిండే బీజేపీకి బలమైన మిత్రుడిగా ఎదిగారు. ఆయన నేతృత్వంలోని శివసేన 29 సీట్లు గెలుచుకోగా, ఠాక్రే వర్గం కంటే తక్కువ సీట్లు వచ్చాయి, కానీ అధికారం తాళం చెవి మాత్రం వారి చేతుల్లోనే ఉన్నట్లు కనిపిస్తోంది. ఇది అజిత్ పవార్ రాజకీయ ప్రాముఖ్యతపై కూడా ప్రశ్నలు లేవనెత్తింది. ఈ ఎన్నికల్లో అసదుద్దీన్ ఓవైసీ పార్టీ ఓఎఓ అత్యంత ఆశ్చర్యకరమైన పనితీరు కనబరిచింది. పార్టీ తన సీట్లను 2 నుంచి 8కి పెంచుకుంది. మైనారిటీలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఓఎఓ, సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్‌కు భారీ నష్టం కలిగించాయి. ఓవైసీ చేసిన వ్యాఖ్యల ప్రభావం మైనారిటీ ఓట్లపై పడిందని భావిస్తున్నారు. ఈసారి కాంగ్రెస్ మహా వికాస్ అఘాడి నుంచి విడిపోయి ఎన్నికల్లో పోటీ చేసింది. పార్టీ 24 సీట్లు గెలుచుకుంది, ఇది 2017తో పోలిస్తే తక్కువ. కూటమితో సంబంధం లేకుండా ఉండటం ద్వారా ఉత్తర భారతీయ, ముస్లిం ఓట్లను కాపాడుకున్నామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. అయితే, ఎఐఎమ్ఐఎమ్ ఆధిక్యం కాంగ్రెస్‌కు కూడా నష్టం కలిగించింది.

**'ట్రిపుల్ ఇంజిన్ ప్రభుత్వం' ప్రభావం**

విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఓటర్లు కేంద్రం, రాష్ట్రం, నగరంలో ఒకే పార్టీ ప్రభుత్వం ఉండాలన్న బీజేపీ నినాదానికి మద్దతు ఇచ్చారు. బీజేపీ హిందుత్వ, అభివృద్ధి ఎజెండా ఠాక్రే వర్గం చేస్తున్న మరాఠీ అస్మితా రాజకీయాలపై ప్రభావం చూపింది. బీజేపీకి వివిధ వర్గాల మద్దతు లభించింది.

**యుద్ధం ఇప్పుడే ప్రారంభం**

మహారాష్ట్రలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయంతో తమను నిర్వీర్యం చేశామని భావిస్తున్న బీజేపీ నేతలకు అది ఎప్పటికీ సాధ్యం కాదని శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ థాకరే స్పష్టం చేశారు. యుద్ధం ఇప్పుడే మొదలైందని, ఇది ముగింపు కాదని ఆయన ఉద్ఘాటించారు. బీజేపీ కుట్రలను త్వరలోనే బయటపెడతామని అన్నారు. ముంబైలో శివసేన (యూబీటీ) నుంచి మేయర్‌ను నియమించాలనేది తన కల అని, అదే నెరవేరాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నానని ఆకాంక్షించారు. స్థానిక ఎన్నికల్లో అవకతవకలు జరగడం వల్లే బీజేపీ గెలుపొందిందని ఉద్ధవ్ థాకరే ఆరోపించారు. కుట్రపూరితంగా, అక్రమంగా విజయం సాధించిందని దుయ్యబట్టారు. ముంబైని పూర్తిగా తాకట్టు పెట్టాలని ఆ పార్టీ ప్రయత్నిస్తోందని ఆయన ధ్వజమెత్తారు. ఎన్నికల్లో తమ పార్టీ 64 స్థానాలను కైవసం చేసుకుందని గుర్తు చేశారు. 227 స్థానాలున్న బీఎంసీలో బీజేపీ 89 స్థానాలు, శివసేన (షిండే) 27 స్థానాలు, ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) 64 స్థానాల్లో విజయం సాధించాయి.

# పట్టుసాధించిన ఎంఐఎం



**ముంబై:** మహారాష్ట్ర మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఎంఐ ఎం పార్టీ సత్తా చాటింది. ముంబైతోపాటు మరాఠ్వాడా లోని మున్సిపల్ కార్పొరేషన్‌లలో ఎంఐఎం పార్టీ తన ప్రభావం చూపింది. రాష్ట్రంలోని 29 మున్సిపల్ కార్పొరేషన్‌ల కు జరిగిన ఎన్నికల్లో మొత్తం 125 స్థానాలను దక్కించుకుని తన పట్టును పెంచుకుంది. రాష్ట్రంలోని ముస్లిం ఓటర్లు ఎంఐ ఎంకు పెద్దఎత్తున మద్దతు పలికినట్టు ఫలితాలను బట్టి తెలుస్తోంది. ముస్లిం ఓటర్లు కాంగ్రెస్, ఎన్సీపీలను తిరస్కరించి ఎంఐఎంవైపు మొగ్గుచూపారని తాజా ఎన్నికల ఫలితాలతో స్పష్టమైంది.

**ఛత్రపతి సంభాజీనగర్‌లో హవా**

ఛత్రపతి సంభాజీనగర్ (ఔరంగాబాద్) మున్సిపల్ కార్పొరేషన్‌లో గతంలోకంటే అధికంగా 33 స్థానాలు దక్కించుకుని రెండవ అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఇక్కడ కాంగ్రెస్, ఇరు ఎన్సీపీలు, ఇరు శివసేనల కంటే అధిక స్థానాలు దక్కించుకోవడం విశేషం. ముఖ్యంగా ఎంఐఎం ఎంపీ సయ్యద్ ఇంతియాజ్ జలీల్ నేతృత్వంలో జరిగిన ఈ ఎన్నికల్లో మరోసారి ఆయన తన సత్తాను చాటుకున్నారు. ఎన్నికల ప్రచారం సమయంలో ఆయనపై దాడి జరిగింది. దీంతో ఇంతియాజ్ జలీల్ ఈ ఎన్నికలకు మరింత ప్రతిష్ఠాత్మంగా తీసుకుని ప్రచారం చేసి 33 స్థానాలను దక్కించుకున్నారు.

**అమరావతి, నాందేడ్‌లలో..**


మాలేగావ్, నాందేడ్, అమరావతి, ధులే, ముంబై, షోలాపూర్, నాగపూర్, థానే(ముంబ్రా) మున్సిపల్ కార్పొరేషన్‌లలో కూడా ఎంఐఎం తన ప్రభావం చూపింది. ముఖ్యంగా మాలేగావ్‌లో 20 స్థానాలు దక్కించుకోగా నాందేడ్‌లో 15, అమరావతిలో 12, ధులేలో 10 చోట్ల విజయం సాధించింది. ముంబైలో 8, షోలాపూర్‌లో 8, నాగపూర్‌లో 6, థానేలో 5 స్థానాల్లో గెలిచింది. అకోలా (3), జాల్నా (2), అహ్మద్‌నగర్ (2) లలో ఉనికిని చాటుకుకుంది. చంద్రాపూర్‌లో మొట్టమొదటి సారిగా ఒక్కస్థానం దక్కించుకుని బోణి కొట్టింది.

**మహారాష్ట్ర ప్రజలకు ఒవైసీ ధన్యవాదాలు**

మహారాష్ట్ర మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో తమ పార్టీకి చెందిన 125 మంది కార్పొరేటర్లు విజయం సాధించారని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు. తమ పార్టీకి ఓటు వేసిన మహారాష్ట్ర ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తమ పార్టీ కార్పొరేటర్లు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తారని అన్నారు. "మా కార్పొరేటర్లందరూ ప్రజల మధ్యే ఉండి, మీ వార్డులలో అభివృద్ధి పనులు చేపట్టాలని నేను గట్టిగా కోరుతున్నాన"ని ఎక్స్‌లో పేర్కొన్నారు.

# రోడ్లను కమ్మేసిన పొగమంచు..
# ప్రమాదాల్లో ఏడుగురి మృతి

ఉత్తరప్రదేశ్‌ని పొగమంచు అతలాకుతలం చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా పొగమంచు తీవ్రంగా ఉండడంతో రోడ్డుపై ఏమి కనిపించక వాహనాలు ఎక్కడికక్కడ ఢీకొన్నాయి. దీంతో దాదాపు 7మంది ప్రాణాలు కోల్పోగా పెద్దఎత్తున ప్రజలు గాయపడ్డట్లు తెలుస్తోంది. ఉత్తర భారతాన్ని పొగమంచు కమ్మేసింది. శీతాకాలం కావడంతో దట్టమైన పొగమంచు రోడ్లపై అలుముకుంది. దీంతో ఉత్తరప్రదేశ్‌లోని 15 జిల్లాల్లో 40కి పైగా రోడ్డు ప్రమాదాలు జరిగినట్లు అధికారులు తెలిపారు. వాహనాలు ఢీకోనడంతో వేరువేరు ప్రమాద ఘటనల్లో ఏడుగురు మృతిచెందగా 50 మందికి పైగా గాయాలైనట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో 100కు పైగా రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా జమ్మూకశ్మీర్‌లో అత్యంత కఠినమైన చలికాలం చిల్లైకలాన్ కొనసాగుతుంది. దీంతో కశ్మీర్ అంతటా ఉష్ణోగ్రతలు మైనస్ డిగ్రీల్లోకి వెళ్లాయి. అత్యధికంగా షోపియాన్ ప్రాంతంలో -5.6 డిగ్రీలు, శ్రీనగర్ -4 డిగ్రీలు, గుల్మార్గ్ -4.2 డిగ్రీలు, సోనామార్గ్ -2.9, పహల్గామ్ -2.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అక్కడి అధికారులు పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లో చలికాలం అత్యంత ఎక్కువగా ఉండే కాలాన్ని చిల్లైకలాన్ అంటారు. ఇది డిసెంబర్ 21న ప్రారంభమై జనవరి 30 వరకూ ఉంటుంది. ఈ సమయంలో ఉష్ణోగ్రతలు మైనస్ డిగ్రీలలోకి వెళతాయి.



## బీహార్‌లో గెలిచాం..
## బెంగాల్‌కు సమయం ఆసన్నమైంది



బీహార్‌లో ఎన్డీయే విజయం సాధించిందని, ఇక పశ్చిమ బెంగాల్‌కు సమయం ఆసన్నమైందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. బెంగాల్ పర్యటనలో భాగంగా మాల్దాలో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో మమతా బెనర్జీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులను మమతా బెనర్జీ ప్రభుత్వం కొల్లగొడుతోందని మోదీ ఆరోపించారు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి హింస, బుజ్జగింపు రాజకీయాలు కావాలని ఆయన విమర్శించారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆయన నొక్కి చెప్పారు. రాష్ట్రానికి అసలైన సవాల్ చొరబాటుదారులేనని మోదీ పేర్కొన్నారు. చొరబాట్లను అరికట్టడంలో తృణమూల్ ప్రభుత్వం విఫలమైందని ఆయన దుయ్యబట్టారు. మాల్దా, ముర్షిదాబాద్ వంటి ప్రాంతాల్లో అల్లర్లు చెలరేగడానికి చొరబాట్లే కారణమని ఆయన ఆరోపించారు. బెంగాల్ రాష్ట్రానికి వరద సహాయ నిధులను కేంద్రం 40 సార్లు అందించినా, ఆ నిధులు అసలైన లబ్ధిదారులకు చేరలేదని ప్రధానమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. బెంగాల్ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చే బీజేపీ ప్రభుత్వం ఇక్కడ అధికారంలోకి రావాలని ఆకాంక్షిస్తున్నారని ఆయన అన్నారు.

## పెద్దల సభలో ఆ బిల్లు 33 ఏళ్లుగా పెండింగ్..

రాజ్యసభలో ప్రస్తుతం 19 బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తాజా నివేదిక ఒకటి వెల్లడించింది. ఇందులో ఓ బిల్లు 1992 నుంచి అంటే దాదాపు 33 ఏళ్లుగా పెండింగులో ఉంది. ఎగువసభ బులెటిన్ ప్రకారం.. జనాభా నియంత్రణ, చిన్న కుటుంబాలను ప్రోత్సహించేందుకు సంబంధించిన బిల్లు ఇది. ఎన్నికల్లో పోటీచేసే వారికి ఇద్దరు పిల్లల నిబంధనను పొందుపరిచారు. ఇద్దరు కన్నా ఎక్కువ పిల్లలు ఉంటే ఎంపీని లేదా ఎమ్మెల్యేని అనర్హులుగా ప్రకటించాలని ఆ బిల్లులో ప్రతిపాదించారు. 1997 నాటి ఢిల్లీ అద్దెల (సవరణ) బిల్లు కూడా సుదీర్ఘకాలంగా పెండింగులోనే ఉంది. ఈ బిల్లుపై పలు భాగస్వామ్య పక్షాల నుంచి వ్యతిరేకత రావడంతో ముందుకు కదల్లేదు. నాణ్యమైన విత్తనాల అమ్మకం, వీటి ఎగుమతి, దిగుమతులకు సంబంధిన సీడ్స్ బిల్లు 2004 నుంచి పెండింగులోనే ఉంది. అంతర్రాష్ట్ర వలస కార్మికులకు సంబంధించిన ఓ బిల్లు 2011 నుంచి ఆమోదానికి నోచుకోలేదు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కార్మికశాఖ మంత్రిగా ఉన్నప్పుడు దీనిని ప్రవేశపెట్టారు. వీటితోపాటు భవన నిర్మాణ కార్మికుల బిల్లు, ఉపాధి కల్పన కార్యాలయాల బిల్లు సహా పలు బిల్లులు సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. లోక్‌సభ రద్దైనప్పుడు పెండింగ్ బిల్లుల గడువు తీరిపోతుంది. వాటిని మళ్లీ ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. కానీ రాజ్యసభ శాశ్వత సభ కాబట్టి ఎప్పటికీ రద్దు కాదు. బిల్లులు సజీవంగా ఉంటాయి.

## పురుషులకు ఉచిత సిటీ బస్సు ప్రయాణం



తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సమరానికి అన్నాడీఎంకే ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించింది. పార్టీ వ్యవస్థాపకుడు ఎంజీ రామచంద్రన్ 109వ జయంతి సందర్భంగా నివాళులు అర్పించిన పార్టీ ప్రధాన కార్యదర్శి పళనిస్వామి... ఐదు ప్రధాన హామీలను ప్రకటించారు. వీటిలో పురుషులకు ఉచిత సిటీ బస్సు ప్రయాణం, ప్రతి కుటుంబ మహిళకు నెలకు రూ. 2,000 జమ చేసే 'మగళీర్ కులవిళక్కు' పథకం, గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు మరియు పట్టణాల్లో అపార్ట్ మెంట్ల పంపిణీ, ఎస్సీ జంటలకు ప్రత్యేక ఇళ్ల స్థలాల కేటాయింపు, అలాగే 5 లక్షల మహిళలకు ద్విచక్ర వాహనాల కొరకు రూ. 25,000 సబ్సిడీగా 'అమ్మ టూ వీలర్ స్కీమ్' ఉన్నాయి. గత ఎన్నికల సమయంలో తాము ఇచ్చిన హామీలను డీఎంకే కాపీ కొట్టిందని పళనిస్వామి విమర్శించారు. గతంలో తమ ప్రభుత్వం ఉన్నప్పుడు ఆర్థిక వ్యవస్థను సమర్థవంతంగా నడిపినట్లు చెప్పారు. కరోనా సమయంలో కూడా ప్రజలకు అన్ని పథకాలను సక్రమంగా అందించామని తెలిపారు.

## యుద్ధం ముగియలేదు... ఇప్పుడే ప్రారంభమైంది



మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికలు ఫలితాలు వచ్చాయి. అధికార మహాయుతి కూటమి పురపాలక సంస్థ ఎన్నికలలో ప్రభంజనం సృష్టించింది. 25 ఏళ్లకు పైగా ముంబైని శాసించిన ఠాక్రే కుటుంబానికి ఈ సారి ముంబై పీఠం కోల్పోవాల్సి వచ్చింది. అయితే దీనిపై శివసేన (ఠాక్రే) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే స్పందించారు. పదవిలో లేకపోయినా మరాఠా ప్రజలకు శివసేన ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. దివంగత నేత బాలసాహెబ్ ఠాక్రే స్థాపించిన శివసేన పార్టీ ఒకప్పుడు మహారాష్ట్ర రాజకీయాలను శాసించింది. మరాఠా సంస్కృతి, భాష స్థానికతే ప్రధాన ఎజెండాగా ఆ పార్టీ రాజకీయాలు జరిపింది. అయితే ఎన్నోసార్లు కూటమి ప్రభుత్వంలో ప్రముఖ పాత్ర వహించిన శివసేన ముంబై మున్సిపల్ ఎన్నికల్లో మాత్రం తిరుగులేని అధిపత్యాన్ని కనబరిచేది. గత 25 ఏళ్లుగా ముంబై మేయర్ పీఠం శివసేన( ఠాక్రే) వర్గానిదే అంటే ఆ ప్రాంతంలో ఠాక్రేలు ఎంత ప్రభావం చూపగలరో చెప్పవచ్చు. అయితే నిన్న( శుక్రవారం) జరిగిన ముంబై మున్సిపల్ ఎన్నికల్లో మహాయుతి కూటమి స్పష్టమైన అధిపత్యం కనబరిచి ముంబై పీఠం కైవసం చేసుకుంది. ఈ నేపథ్యంలో శివసేన ఠాక్రే సోదరులు ఓటమి తర్వాత తొలిసారిగా స్పందించారు. దివంగత నేత బాలాసాహెబ్ ఠాక్రేతో ఫోటోతో కూడిన లేఖను ఉద్ధవ్ ఠాక్రే పోస్ట్ చేశారు." చేసే పోరాటం ముగియలేదు. మరాఠీలకు వారు కోరుకున్న విధంగా గౌరవం లభించేంత వరకూ ఇది ముగియదు" అని అన్నారు. ఎంఎన్ఎస్ చీఫ్ రాజ్ ఠాక్రే స్పందిస్తూ "ప్రస్తుతం అధికారంలో ఉన్న శక్తులు మరాఠా ప్రజలను వేదించడానికి లభించే ఒక్క అవకాశాన్ని కూడా వదలరు. కనుక మనమంతా అప్రమత్తంగా ఉండాలి. ఎన్నికలు వచ్చిపోతుంటాయి. కానీ మనం మరాఠా ప్రజలకోసం ఉన్న సంగతి మర్చిపోకూడదు. మరాఠా ప్రజలకు వ్యతిరేకంగా ఏదైనా జరిగితే తమ పార్టీ కార్పొరేటర్లు వారిని మోకాళ్ల మీద నిలబడేలా చేస్తారు" అని లేఖ విడుదల చేశారు. కాగా మహారాష్ట్రలో 29 కార్పొరేషన్లకు జరిగిన ఎన్నికల్లో 25 చోట్ల మహాయుతి కూటమి విజయాన్ని సాధించింది. అక్కడ మెత్తం 227 కౌన్సిల్ స్థానాలుండగా మ్యాజిక్ ఫిగర్ 114 అయితే బీజైపీకి 89 స్థానాలు రాగా శివసేన (శిండే) 29 వార్డులు సాధించింది.

ధర్మఘంట

# మున్సిపల్ ఎన్నికలకు రిజర్వేషన్లు ఖరారు

-మొదటిపేజీ తరువాయి

ఎస్సీ (మహిళ)
6. డోర్నకల్: ఎస్సీ (జనరల్)
7. లక్సింపేట్: ఎస్సీ (జనరల్)
8. మూడుచింతలపల్లి: ఎస్సీ (జనరల్)
9. నందికొండ: ఎస్సీ (జనరల్)
10. మొయినాబాద్: ఎస్సీ (జనరల్)
11. గడ్డపోతారం: ఎస్సీ (మహిళ)
12. కోహిర్: ఎస్సీ (జనరల్)
13. ఇంద్రేశం: ఎస్సీ (మహిళ)
14. చేర్యాల: ఎస్సీ (మహిళ)
15. హుస్నాబాద్: ఎస్సీ (జనరల్)
16. వికారాబాద్: ఎస్సీ (మహిళ)
17. మోత్కూరు: ఎస్సీ (మహిళ)

**బీసీ కేటగిరి**

1. ఇల్లెందు: బీసీ (మహిళ)
2. జగిత్యాల: బీసీ (మహిళ)
3. జనగాం: బీసీ (జనరల్)
4. భూపాలపల్లి: బీసీ (జనరల్)
5. లీజ: బీసీ (జనరల్)
6. వడ్డేపల్లి: బీసీ(జనరల్)
7. అలంపూర్: బీసీ (జనరల్)
8. బిచ్కుంద: బీసీ (జనరల్)
9. కామారెడ్డి: బీసీ (మహిళ)
10. బాన్సువాడ: బీసీ (మహిళ)
11. ఆసిఫాబాద్: బీసీ(జనరల్)
12. కాగజ్‌నగర్: బీసీ (మహిళ)
13. దేవరకద్ర: బీసీ (మహిళ)
14. చెన్నూరు: బీసీ (మహిళ)
15. మెదక్: బీసీ (మహిళ)
16. ములుగు: బీసీ (మహిళ)
17: కొల్లాపూర్: బీసీ (మహిళ)
18. అచ్చంపేట: బీసీ (మహిళ)
19. నాగర్‌కర్నూల్: బీసీ (జనరల్)
20. దేవరకొండ: బీసీ (మహిళ)
21. మద్దూరు: బీసీ (జనరల్)
22. పెద్దపల్లి : బీసీ (జనరల్)
23. మంథని: బీసీ (జనరల్)
24. వేములవాడ: బీసీ (జనరల్)
25. షాద్‌నగర్: బీసీ (జనరల్)
26. జిన్నారం: బీసీ (జనరల్)
27. జహీరాబాద్: బీసీ (జనరల్)
28. గుమ్మడిదల: బీసీ (జనరల్)
29. సిద్దిపేట: బీసీ (జనరల్)
30. గజ్వేల్: బీసీ (మహిళ)
31. దుబ్బాక: బీసీ (మహిళ)
32. హుజూర్‌నగర్: బీసీ (జనరల్)
33. తాండూరు: బీసీ (జనరల్)
34. పరిగి: బీసీ (మహిళ)
35. కొత్తకోట: బీసీ (మహిళ)
36. ఆత్మకూరు: బీసీ (మహిళ)
37. నర్సంపేట: బీసీ (మహిళ)
38. ఆలేరు: బీసీ (మహిళ)

**అన్‌రిజర్వుడ్**

1. ఆదిలాబాద్: మహిళ (జనరల్)
2. అశ్వారావుపేట: మహిళ (జనరల్)
3. పర్కాల్: అన్‌రిజర్వుడ్
4. కోరుట్ల: మహిళ (జనరల్)
5. రాయికల్: అన్‌రిజర్వుడ్
6. మెట్‌పల్లి: అన్‌రిజర్వుడ్
7. ధర్మపురి: మహిళ (జనరల్)
8. గద్వాల: మహిళ (జనరల్)
9. ఎల్లారెడ్డి: అన్‌రిజర్వుడ్
10. సత్తుపల్లి: మహిళ (జనరల్)
11. వైరా: మహిళ (జనరల్)
12. మధిర: మహిళ (జనరల్)
13. జడ్చర్ల: అన్‌రిజర్వుడ్
14. తొర్రూర్: అన్‌రిజర్వుడ్
15. మరిపెడ: మహిళ (జనరల్)
16. ఖ్యాతన్‌పల్లి: మహిళ (జనరల్)
17. బెల్లంపల్లి: మహిళ (జనరల్)
18. రామాయంపేట: మహిళ (జనరల్)
19. నర్సాపూర్: మహిళ (జనరల్)
20. తుప్రాన్: మహిళ (జనరల్)
21. అలియాబాద్: మహిళ (జనరల్)
22. కల్వకుర్తి: మహిళ (జనరల్)
23. చందూరు: అన్‌రిజర్వుడ్
24. నకిరేకల్: అన్‌రిజర్వుడ్
25. హాలియా: అన్‌రిజర్వుడ్
26. మిర్యాలగూడ: మహిళ (జనరల్)
27. చిట్యాల: మహిళ (జనరల్)
28. నారాయణపేట: మహిళ (జనరల్)
29. కోస్గి: అన్‌రిజర్వుడ్
30. మక్తల్: అన్‌రిజర్వుడ్
31. ఖానాపూర్: అన్‌రిజర్వుడ్
32. భైంసా: అన్‌రిజర్వుడ్
33. నిర్మల్: మహిళ (జనరల్)
34. భీంగల్: మహిళ (జనరల్)
35. ఆర్మూర్: మహిళ (జనరల్)
36. బోధన్: అన్‌రిజర్వుడ్
37. సుల్తానాబాద్: అన్‌రిజర్వుడ్
38. సిరిసిల్ల: మహిళ (జనరల్)
39. శంకరపల్లి: అన్‌రిజర్వుడ్
40. చేవెళ్ల: అన్‌రిజర్వుడ్
41. ఇబ్రహీంపట్నం: అన్‌రిజర్వుడ్
42: ఆమన్‌గల్: అన్‌రిజర్వుడ్
43. కొత్తూర్: అన్‌రిజర్వుడ్
44. సదాశివపేట: మహిళ (జనరల్)
45. నారాయణఖేడ్: అన్‌రిజర్వుడ్
46. ఆందోల్–జోగిపేట: అన్‌రిజర్వుడ్
47. సంగారెడ్డి: మహిళ (జనరల్)
48. ఇస్నాపూర్: మహిళ (జనరల్)
49. సూర్యాపేట: అన్‌రిజర్వుడ్
50. తిరుమలగిరి: అన్‌రిజర్వుడ్
51. కోదాడ: మహిళ (జనరల్)
52. నేరేడుచర్ల: అన్‌రిజర్వుడ్
53. కొడంగల్: అన్‌రిజర్వుడ్
54. వనపర్తి: మహిళ (జనరల్)
55. అమరచింత: అన్‌రిజర్వుడ్
56. పెబ్బేరు: అన్‌రిజర్వుడ్
57. వర్ధన్నపేట: అన్‌రిజర్వుడ్
58. పోచంపల్లి: అన్‌రిజర్వుడ్
59. యాదగిరిగుట్ట: మహిళ (జనరల్)
60. భువనగిరి: మహిళ (జనరల్)
61: చౌటుప్పల్: మహిళ (జనరల్)

# మూసీ ప్రక్షాళనకు టీడీఆర్



**హైదరాబాద్ :** హైదరాబాద్ పర్యావరణ పరిరక్షణలో ఒక కొత్త అధ్యాయానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నగరం చుట్టూ ఉన్న చెరువులు, కుంటలు, నాలాలు, నదుల పరిరక్షణే ధ్యేయంగా రేవంత్ రెడ్డి సర్కారు అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు తీసుకొచ్చిన రూల్స్ వల్ల చెరువుల సంరక్షణతోపాటు ప్రతిష్టాత్మకంగా భావించే మూసీ నది అభివృద్ధి ప్రాజెక్టులో కదలిక రానుంది. టీడీఆర్‌లో మార్పులు చేర్పులు కేవలం ఆక్రమణ తొలగింపు మాత్రమే కాకుండా భూమిని కోల్పోయే పట్టాదారులకు ఊరట కల్పించేలా ఉన్నాయి. తెలంగాణ పురపాలక శాఖ విడుదల చేసిన జీవో నెంబర్ 16 ద్వారా భవన నిర్మాణ నిబంధనలు -2012లో కీలక సవరణలు చేసింది. సుప్రీంకోర్టు, ఎన్‌జీటీ ఆదేశాలతో జలాశయాల పరిరక్షణకు ఈ నిర్ణయం తీసుకుంది. చెరువుల ఎఫ్టీఎల్, నదుల ఎంఎఫ్ఎల్, బఫర్ జోన్‌లలో ఉన్న పట్టా భూములను స్వాధీనం చేసుకునే క్రమంలో భూ యజమాను లకు భారీగా నగదు పరిహారానికి ప్రత్యామ్నాయంగా టీడీఆర్‌ను ఇవ్వబోతోంది. ఈ సవరణలు కేవలం నోటిఫైడ్ ప్రాజెక్టులకు, అంటే హైడ్రా, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ వంటి సంస్థలు చేపట్టే పనులకు మాత్రమే వర్తిస్తాయి. ఇది తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని 300 డివిజన్ల వరకు అంటే ఔటర్ రింగ్ రోడ్డు వరకు అమలులోకి రానుంది. గతంలో ఉన్న టీడీఆర్ నిబంధనలను ప్రభుత్వం మరింత వెసులుబాటు కల్పించింది. స్వచ్ఛందంగా భూమిని అప్పగించే వారికి ప్రోత్సాహకాలు పెంచింది. ఇప్పుడు విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం పరిహారం మార్చింది. చెరువుల పూర్తి స్థాయి ఈబఒ, ఓఈఒ పరిధిలో ఉన్న భూములకు, ఆ యజమాని వదులుకున్న నిర్మిత విస్తీర్ణానికి ఏకంగా 200 శాతం టీడీఆర్ మంజూరు చేస్తారు. చెరువులు లేదా నదుల బఫర్ జోన్‌లలో ఉన్న భూములను అప్పగిస్తే 300 శాతం టీడీఆర్ లభిస్తుంది. జవనరుల అభివృద్ధి, రహదారి విస్తరణ లేదా బఫర్ జోన్ వెలుపలి భూములను ప్రభుత్వం సేకరించాల్సి వస్తే ఏకంగా 400 శాతం టీడీఆర్ ఇవ్వనున్నారు. ప్రైవేటు భూముల్లో నాలా విస్తరణ చేపడితే, రోడ్డు విస్తరణకు ఇచ్చే విధంగా 400 శాతం టీడీఆర్ వర్తింపజేస్తారు. దీని వల్ల నిర్వాసితులు ప్రభుత్వం నుంచి నగదు కోసం ఎదురు చూడాల్సిన పని లేదు. టీడీఆర్ సర్టిఫికెట్ల ద్వారా మార్కెట్‌లో మంచి లాభం పొందే ఛాన్స్ ఉంది. గత ప్రభుత్వ హయాంలో దాదాపు 10వేల కోట్లకుపైగా విలువైన టీడీఆర్ సర్టిఫికెట్లు జారీ అయ్యాయి. దీని వల్ల మార్కెట్‌లో వాటి సరఫరా పెరిగింది. దీంతో డిమాండ్ పడిపోయింది. దీని వల్ల భూ యజమానులు టీడీఆర్ తీసుకోవడానికి అంగీకరించడం లేదు. కేవలం నగదు రూపంలోనే పరిహారం అడుగుతున్నారు. అందుకే రూల్స్ మార్చిన ప్రభుత్వం ఈ ఇబ్బందిని అధిగమించాలని చూస్తోంది. అందుకే బిల్డర్స్‌కు కొన్ని రూల్స్ పెట్టింది. హైదరాబాద్‌లో పది అంతస్తులకు మించిన భవనాలు నిర్మిస్తే టీడీఆర్ వినియోగించుకోవాలి. అంటే 11 అంతస్తు నుంచి నిర్మించే ప్రతి ఫ్లోర్‌కు చదరపు అడుగు విస్తీర్ణంలో పది శాతానకకి సమానమైన టీడీఆర్ కచ్చితంగా కొనుగోలు చేయాలి. ఈ రూల్ వల్ల మార్కెట్‌లో టీడీఆర్‌కు ఒక్కసారిగా డిమాండ్ పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తుంది. టీడీఆర్‌లు చెల్లుబాటు అవుతాయని ప్రజలకు మేలు జరుగుతుందని అంచనా వేస్తున్నారు. టీడీఆర్ జారీ ప్రక్రియలో ఎటువంటి అక్రమాలు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వ కఠినమైన రూల్స్ పెట్టింది. టీడీఆర్ ఇచ్చే ముందు ఇరిగేషన్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ స్థాయి అధికారుల నుంచి తప్పనిసరిగా క్లియరెన్స్ తీసుకోవాలి. భూ యజమాని అందుబాటులో లేకపోయినా లేదా టైటిల్ వివాదాలు ఉన్నా ఆ టీడీఆర్‌ను టీడీఆర్ బ్యాంకులో జమ చేస్తారు. వివాదం పరిష్కారమైన తర్వాత అసలు ఓనర్‌కు అప్పగిస్తారు. ఒక ఎకరం కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న భూములకు టీడీఆర్ ఇవ్వాలంటే ముందస్తుగా రాష్ట్ర ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి. భూమిని ఉచితంగా ప్రభుత్వానికి అప్పగించే సంస్థలకు మరిన్ని ఆఫర్లు ప్రకటించింది ప్రభుత్వం. వారు తమ ప్రాజెక్టులో సెట్ బ్యాక్‌ల సడలింపు ఉంటుంది. అదనపు అంతస్తుల నిర్మాణం, అదనపు నిర్మిత విస్తీర్ణంలో వెసులుబాటు పొందవచ్చు. ఏ నిబంధన అయినా సరే ఫైర్, ఎయిర్‌పోర్టు అథారిటీ రూల్స్‌కు అనుగుణంగానే ఉంటుంది.

# వ్యూహాత్మక మౌనమే పరిష్కారమా

**హైదరాబాద్ :** ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తప్పులు జరగడం సహజం, ప్రజలు క్షమించడానికి సమయం పడుతుంది. తర్వాతి ఎన్నికల్లో ప్రజలే భవిష్యత్‌ను నిర్ణయిస్తారు. కానీ పదేళ్ల అధికారంతో తెలంగాణ చాంపియన్‌లుగా ప్రచారం చేసుకున్న బీఆర్ఎస్‌ను 2023 ఎన్నికల్లో ప్రజలు ఓడించారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉంది. రెండేళ్ల పాలన పూర్తి చేసుకుంది. ప్రభుత్వంపై పెద్దగా వ్యతిరేకత లేదు. హామీలు అమలు చేయకపోయినా విపక్షాల నుంచి తప్ప ప్రజల నుంచి విమర్శలు రావడం లేదు. ఇక బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అయితే రేవంత్ సర్కార్‌ను నిత్యం టార్గెట్ చేస్తున్నారు. దీంతో విశ్లేషకులు నేతలకు ఓపిక ఉండాలని సూచిస్తున్నారుకేటీఆర్ ప్రతీ మాట సామాన్యుడి మనసులో కౌంటర్‌గా మారుతోంది. ఇది తన మాటల విలువను తగ్గిస్తూ, పార్టీకి నష్టం కలిగిస్తోంది. రేవంత్‌పై ఘాటు వ్యాఖ్యలు చేస్తూ కేటీఆర్ స్వయం పార్టీ బలోపేతానికి అడ్డంకిగా మారుతు న్నారు. గత అధికార కాలంలోని తప్పులు




గుర్తుంచుకోకుండా విమర్శిస్తుండడంతో ప్రజలు పెద్దగా కనెక్ట్ కావడం లేదు.తాజా పార్టీ మార్పులపై కేటీఆర్ వ్యాఖ్యలు గతాన్ని గుర్తు చేస్తున్నాయి. బీఆర్ఎస్ అధికారంలో ఉంటూ ప్రతిపక్షాలను అణచివేసి, తెలంగాణ పోరాటకారులను దూరం చేసి, కొత్తలకు పదవులు పంచారు. ఇప్పుడు కాలె యాదయ్య, పోచారం శ్రీనివాస్ రెడ్డి వంటి ఎమ్మెల్యేలపై ఆరోపణలు చేస్తున్నారు. స్పీకర్ ఆధారాలు లేవని ప్రకటించినా, కేటీఆర్ సోషల్ మీడియాలో రాజ్యాంగ విలువలను ప్రశ్నిస్తున్నారు. అప్పటి ఫిరాయింపులు 'బంగారు తెలంగాణ' పేరుతో జరిగాయని ప్రజలు మరువలేదు కేటీఆర్.ప్రస్తత పరిణామాల్లో మౌనం చాలా మంచిది. ప్రజలకు ఆలోచనకు సమయం ఇవ్వాలి. గత తప్పులకు పశ్చాత్తాపం చెంది, భవిష్యత్తులో అవి జరగకుండా హామీ ఇవ్వాలి. పడిగట్టు మాటలు, నాన్ స్టాప్ విమర్శలు ప్రజల మద్దతు ఆకర్షించవు. కేటీఆర్ దీన్ని గుర్తించి వ్యూహం మార్చితే పార్టీకి లాభం.అధికారంలో ఉంటూ అందరినీ 'గులాబీ కారు'లో ఎక్కించిన గతం ప్రజల మనసుల్లో ఉంది. ఇప్పుడు విమర్శలు చేసినా, స్వీయ పరిశీలన లేకపోవడం వల్ల ప్రజలు దూరమవుతున్నారు. తగిన సమయం కోసం వేచి ఉండి.. ప్రజల్లో వ్యతిరేకత వచ్చిన తర్వాత స్పందిస్తే ప్రజల మద్దతు లభిస్తుంది.

## విద్యతోనే ప్రగతి

-మొదటిపేజీ తరువాయి

ఎకరాల భూమిని పేదలకు పంచిందని గుర్తు చేశారు. విద్యతోనే సమాజంలో గౌరవం లభిస్తుందని గుర్తించాలని సూచించారు. నిబద్ధత లేని చదువు వల్ల ప్రయోజనం ఉండదని అన్నారు. బూర్గుల రామకృష్ణారావు తర్వాత 75 ఏళ్లకు ఈ జిల్లాకు ముఖ్యమంత్రి అయ్యే అవకాశం తనకు దక్కిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జిల్లాకు సాగునీటి ప్రాజెక్టులతో పాటు అత్యున్నత విద్యాసంస్థలను తీసుకువస్తున్నట్లు ప్రకటించారు. అచ్చంపేట నియోజకవర్గంలోని ఒక మారుమూల పల్లె నుంచి వచ్చిన తాను, కనీసం మంత్రి కూడా కాకుండానే అందరి సహకారంతో 17 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్నానని.. పట్టుదల, కష్టపడే తత్వం ఉంటే ఎవరైనా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఆయన విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.రాష్ట్రంలో పేదలకు పంచడానికి ఇప్పుడు భూమి లేని పరిస్థితి ఉందని, అందుకే భూమి కంటే విలువైన విద్యను పేద బిడ్డలకు అందించడమే తన ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అని సీఎం స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మిస్తున్నామని, సివిల్స్‌కు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని వెల్లడించారు. ఏడాది కాలంలోనే ట్రిపుల్ ఐటీ భవనాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని హామీ ఇస్తూ.. కేవలం చదువు మాత్రమే కాకుండా భాషను మెరుగుపరుచుకోవాలని, నిబద్ధత లేని చదువు జీవితానికి ఉపయోగపడదని విద్యార్థులకు హితబోధ చేశారు. ఎంత ఎదిగినా తల్లిదండ్రులను గౌరవించడం మర్చిపోవద్దని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా విద్యార్థులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ.. తన బాల్యం, చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. సమాజంలో గౌరవం పెరగాలన్నా, సమస్యలకు పరిష్కారం దొరకాలన్నా చదువు మీదనే భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది అని వారితో ముచ్చటించారు. ఒక మారుమూల గ్రామం నుండి వచ్చిన వ్యక్తి ముఖ్యమంత్రి కావడం తమకు ఎంతో స్ఫూర్తినిస్తోందని విద్యార్థులు అనగా, మీరు కూడా లక్ష్యాలను నిర్దేశించుకుని శ్రమిస్తే అత్యున్నత పదవులను అధిరోహిస్తారని వారిలో ధైర్యాన్ని నింపారు. మహబూబ్ నగర్ జిల్లాలో ట్రిపుల్ ఐటీ ఏర్పాటు అనేది ఈ ప్రాంత విద్యా ముఖచిత్రాన్ని మార్చే గొప్ప నిర్ణయమని విశ్లేషకులు భావిస్తున్నారు. పాలమూరు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు విద్యా సంస్థలను జిల్లాకు తీసుకురావడంలో రేవంత్ రెడ్డి విజయవంతమయ్యారని సభకు హాజరైన జనం హర్షం వ్యక్తం చేశారు. విద్యా మన సమస్యలకు పరిష్కారం చూపుతుందన్న సీఎం మాటలు విద్యార్థుల్లో కొత్త ఆలోచనలను రేకెత్తించాయి.

## తెలంగాణలో రోహిత్ వేముల చట్టాన్ని తీసుకొస్తాం

-మొదటిపేజీ తరువాయి

కమిటీకి తెలియజేశారు. కర్ణాటక రాష్ట్రంలో రోహిత్ వేముల చట్టం కోసం క్యాంపెయిన్ కమిటీ రూపొందించిన ముసాయిదాను కమిటీ సభ్యులు డిప్యూటీ సీఎంకు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు కొన్ని విజ్ఞప్తులు చేశారు. రోహిత్ వేముల కేసును పారదర్శకంగా విచారణ జరిపించాలని, న్యాయం చేయాలని కోరారు. రోహిత్ వేముల మరణం తర్వాత యూనివర్సిటీలో 50 మంది విద్యార్థులు, ఇద్దరు టీచర్లపైన నాన్ బెయిలబుల్ కేసులు నమోదయ్యాయి. వీటి నుంచి వారికి విముక్తి కల్పించాలని కోరారు. కర్ణాటక రాష్ట్రం తరహాలోనే తెలంగాణలోనూ రోహిత్ వేముల చట్టాన్ని తీసుకురావాలని కోరారు. సమావేశంలో కర్ణాటక ప్రతినిధుల తరపున హులికుంటే మూర్తి, డా. ఆశ్నా సింగ్, వి.మృదుల, రాహుల్ పాల్గొన్నారు. హైదరాబాద్ 'జస్టిస్ ఫర్ రోహిత్ వేముల' ఉద్యమం తరఫున రాధికా వేముల, రాజా వేముల, ప్రొఫెసర్ భాంగ్య భుక్య, ప్రొఫెసర్ సౌమ్యా దేచమ్మ, ప్రొఫెసర్ తిరుమల్, ప్రొఫెసర్ రత్నం, వి. రఘునాథ్, డా దోంత ప్రశాంత్, తిరుపతి, వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బిజెపి విజయ్ సంకల్ప సమ్మేళనం

-మొదటిపేజీ తరువాయి

కొండా విశ్వేశ్వర్ రెడ్డి , నగేష్ , శాసనసభ్యులు పాయల్ శంకర్ , వెంకటరమణా రెడ్డి , రామారావు పాటిల్ , సూర్యనారాయణ గుప్తా , ఎమ్మెల్సీలు అంజిరెడ్డి , మల్క కొమురయ్య , బిజెపి రాష్ట్ర ఇంచార్జ్ అభయ్ పాటిల్ గారు, బిజెపి రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డా. ఎన్. గౌతమ్ రావు , వేముల అశోక్ , శ్రీ తూళ్ల వీరేందర్ గౌడ్ , బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయశ్రీ , మాధవి , సీనియర్ నాయకులు గరికపాటి మోహన్ రావు , బిజెపి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఎన్.వి.సుభాష్ , పార్టీ రాష్ట్ర కార్యదర్శులు, బిజెపి మోర్చా నాయకులు, తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..ఈ సందర్భంగా రానున్న మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణులకు పార్టీ రథసారథి ఎన్.రాంచందర్ రావు దిశానిర్దేశం చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత మనపై ఉంది. తెలంగాణ ప్రజలు ఆలోచించాలి. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బిజెపిని అత్యధిక స్థానాల్లో గెలిపించి కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలి. రానున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో సుమారు 52 లక్షల మందికి పైగా ఓటర్లు ఉన్నారు. రాష్ట్ర జనాభాలో ఒక వంతు హైదరాబాద్‌లో, మరొక వంతు గ్రామీణ ప్రాంతాల్లో, మూడో వంతు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో నివసిస్తున్నారు.మన భవిష్యత్తు బాగుండాలంటే డబుల్ ఇంజిన్ సర్కారు రావాలి. పట్టణాలు అభివృద్ధి చెందాలంటే, పేదలకు ఇండ్లు రావాలంటే, ఆరోగ్య భద్రత కావాలంటే– అది కేవలం నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకొచ్చే పథకాల ద్వారానే సాధ్యం. వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుంటోంది. ఆయుష్మాన్ భారత్ పథకాన్ని తెలంగాణలో ఎందుకు అమలు చేయడం లేదు? ఫసల్ బీమా యోజనను ఎందుకు అమలు చేయడం లేదు? కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలి.ఇటీవల కేరళలోని త్రివేంద్రం రాజధానిలో కమ్యూనిస్టు అడ్డాలో కాషాయ జెండాను ఎగురవేశాం. వందలాది బిజెపి కార్యకర్తల త్యాగాల ఫలితంగా అక్కడ కాషాయ జెండా ఎగిరింది.అదేవిధంగా మహారాష్ట్ర మునిసిపల్ ఎన్నికల్లో బిజెపి ఘన విజయం సాధించింది. 29 మున్సిపల్ కార్పొరేషన్లలో 25 కార్పొరేషన్లను బిజెపి కైవసం చేసుకుంది. అలాగే తెలంగాణలోనూ రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బిజెపికి ప్రజలు ఆదరణ చూపాలని కోరుతున్నాను.మేము సేవ కోసమే వచ్చాం. ప్రజల పక్షాన నిలుస్తాం. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడతాం. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడతాం. అందుకే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో బిజెపిని గెలిపించాలని కోరుతున్నానన్నారు.


## దివ్యాంగులకు అండగా ప్రభుత్వం

**దివ్యాంగులు మనోధైర్యంతో ముందుకు సాగాలి**

**కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు**

**కోరుట్ల :** దివ్యాంగులకు అండగా ప్రభుత్వం నిలుస్తుందని,దివ్యాంగులు ఎవరు కోల్పోవద్దని మనోధైర్యంతో ముందుకు సాగాలనికాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు.శనివారం పట్టణంలోని జువ్వాడి భవన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు, పలువురు దివ్యాంగులకు ఉపకరణాలను పంపిణీ చేశారు.దివ్యాంగులకు అవసరమైన స్కూటీలు, బ్యాటరీ వాకర్స్ ,బ్యాటరీ సైకిల్స్, ల్యాప్ టాప్ 5జి ఫోన్ వంటి ఉపకరణాలను కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు.ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జగిత్యాల జిల్లాకు చెందిన ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లు దివ్యాంగుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, దివ్యాంగులు ఆత్మగౌరవంతో జీవించాలనేదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అన్నారు. ఉచిత ఉపకారణాలు స్కూటీ లు, బ్యాటరీ వాకర్స్ ,బ్యాటరీ సైకిల్ పంపిణీ వారి జీవితాల్లో మార్పు తీసుకొస్తుందన్నారు.దివ్యాంగులు సమాజంలో అన్ని రంగాల్లో ఎదగాలని కోరుకుంటున్నానన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రభుత్వ పథకాలు క్షేత్ర స్థాయిలో సక్రమంగా అమలుతున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి త్వరలోనే లబ్ధి చేకూరేలా మరిన్ని ఉపకరణాలను త్వరలోనే పంపిణీ చేస్తామని తెలిపారు.. దివ్యాంగుల అవసరాలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను రూపొందిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని కోరుట్లకు 13, మెట్ పల్లి 9, మల్లాపూర్ 15, ఇబ్రహీంపట్నం 4 ఉపకరణాలు రాగా అందులో 22 స్కూటీలు, 7 బ్యాటరీ సైకిల్, 8 వీల్ చైర్ ,3 ల్యాప్ టాప్, ఒక 5జి ఫోన్ వచ్చినట్లు కృష్ణారావు తెలియజేశారు.

# బట్టల్లో యూరిన్ పడిపోతుందా!



మూత్ర ఆపుకొనలేని స్థితి అనేది చాలా మందిని వేధించే సమస్య. ఓవర్‌యాక్టివ్ బ్లాడర్, స్ట్రెస్ యూరినరీ ఇంకంటినెన్స్, ఓవర్‌ఫ్లో ఇంకంటినెన్స్ వంటి వివిధ రకాలు ఉన్నాయి. డయాబెటిస్, మెనోపాజ్, బలహీనమైన కండరాలు వంటివి ప్రధాన కారణాలు. సరైన నిర్ధారణ, చికిత్సల ద్వారా ఈ సమస్యను నియంత్రించవచ్చు. మూత్ర ఆపుకొనలేని స్థితి (యూరినరీ ఇంకంటినెన్స్) అనేది చాలా మంది వృద్ధులను, ముఖ్యంగా మహిళలను, వేధించే ఒక సాధారణ ఆరోగ్య సమస్య. దీని వల్ల వ్యక్తిగత జీవితంపై తీవ్ర ప్రభావం పడుతుంది, సామాజిక కార్యకలాపాలకు దూరం కావాల్సి రావచ్చు. యూరిన్ లీకేజ్, దుర్వాసన, మూత్రం రంగులో మార్పు వంటి లక్షణాలతో బాధపడుతున్న ఒక 50 ఏళ్ల వ్యక్తి ప్రశ్నకు సమాధానంగా, వైద్యులు ఈ సమస్య గురించి కారణాలు, చికిత్సా పద్ధతులను వివరించారు.

మూత్రం ఆపుకొనలేని స్థితి ప్రధాన రకాలు: 1. ఓవర్‌యాక్టివ్ బ్లాడర్: ఈ స్థితిలో బ్లాడర్ పరిమాణం చిన్నదై, తరచుగా మూత్ర విసర్జన చేయాలనే బలమైన కోరిక కలుగుతుంది. బ్లాడర్‌కు వెళ్లే లోపల కూడా మూత్రం లీక్ కావచ్చు. దీర్ఘకాలిక మధుమేహం (5-6 సంవత్సరాలకు పైగా) ఉన్నవారిలో బ్లాడర్ కండరాలు ప్రభావితమై ఈ సమస్య రావొచ్చు. అలాగే, పోస్ట్ మెనోపాజల్ తర్వాత హార్మోన్ల మార్పుల వల్ల బ్లాడర్ కండరాలు బలహీనపడి, ఇరిటబిలిటీ పెరిగి, బ్లాడర్ సామర్థ్యం తగ్గిపోవడం కూడా ఒక కారణం. దీనివల్ల తరచుగా, హఠాత్తుగా మూత్ర విసర్జన చేయాల్సి వస్తుంది.

2. స్ట్రెస్ యూరినరీ ఇంకంటినెన్స్: దగ్గినా, తుమ్మినా, నవ్వినా, లేదా ఏదైనా శారీరక శ్రమ చేసినా మూత్రం లీక్ అవ్వడం దీని లక్షణం. హార్మోన్ల క్షీణత, వయసు పెరగడం, లేదా ప్రసవాల కారణంగా గర్భసంచి చుట్టూ ఉన్న పెల్విక్ కండరాలు (పెల్విక్ ఫ్లోర్ మజిల్స్) బలహీనపడటం వల్ల ఇది సంభవిస్తుంది. కడుపుపై ఒత్తిడి పెరిగినప్పుడు ఈ బలహీన కండరాలు మూత్రాశయాన్ని సరిగా నిలువరించలేవు.

3. మిశ్రమ ఇంకంటినెన్స్: ఇది ఓవర్‌యాక్టివ్ బ్లాడర్, స్ట్రెస్ యూరినరీ ఇంకంటినెన్స్ లక్షణాల కలయిక. అంటే, దగ్గినా, తుమ్మినా మూత్రం లీక్ అవ్వడం, అలాగే మూత్రం వచ్చినప్పుడు ఆపుకోలేకపోవడం వంటి రెండు సమస్యలు ఒకేసారి ఉండవచ్చు.

4. ఓవర్‌ఫ్లో ఇంకంటినెన్స్: ఈ రకంలో, బ్లాడర్ సరిగ్గా ఖాళీ అవ్వదు. దీనివల్ల మూత్రాశయం నిండిపోయి, మూత్రం నిరంతరం చుక్కలు చుక్కలుగా లీక్ అవుతుంది. దీర్ఘకాలిక మధుమేహం ఉన్నవారిలో బ్లాడర్ పంపింగ్ సామర్థ్యం తగ్గిపోవడం, మూత్రం మిగిలిపోవడం వల్ల బ్లాడర్ పూర్తి అయ్యే సంవేదన తెలియక, అది నిండిపోయి ఓవర్‌ఫ్లో అవుతుంది.ఓవర్‌యాక్టివ్ బ్లాడర్ నిర్ధారణ: యూరోడైనమిక్ స్టడీ అనే పరీక్ష ద్వారా బ్లాడర్ ప్రెషర్‌లను, లీకేజ్ ఎప్పుడు జరుగుతుందో అంచనా వేస్తారు. దీనిలో బ్లాడర్‌లోకి చిన్న ట్యూబ్ ద్వారా నీటిని పంపి పరిశీలిస్తారు. ఓవర్‌ఫ్లో ఇంకంటినెన్స్ చికిత్స: కొన్ని రోజులు యూరిన్ పైపు (కేథెటర్) అమర్చడం, ఆపై సిఐసి (క్లీన్ ఇంటర్‌మిటెంట్ కేథెటరైజేషన్) అంటే ప్రతి నాలుగు గంటలకు ఒకసారి పైపును స్వయంగా పెట్టుకుని తీయడం వంటి శిక్షణ ఇస్తారు. బ్లాడర్ పంపింగ్‌ను మెరుగుపరచడానికి మందులు కూడా ఇస్తారు. ఈ పద్ధతుల ద్వారా లీకేజ్‌ను గణనీయంగా తగ్గించవచ్చు. స్ట్రెస్ ఇంకంటినెన్స్ చికిత్స: కీగెల్ ఎక్సర్‌సైజులు (పెల్విక్ ఫ్లోర్ ఎక్సర్‌సైజులు) కండరాలను బలోపేతం చేయడానికి సహాయపడతాయి. అయితే, కొన్నిసార్లు ఈ వ్యాయామాలు సరిగా స్పందించకపోవచ్చు లేదా లీకేజ్ ఎక్కువగా ఉన్నప్పుడు "స్లింగ్ సర్జరీలు" అనే శస్త్రచికిత్సలు అవసరం కావచ్చు. ఈ ఆపరేషన్ల ద్వారా మూత్రం లీకేజ్‌ను పూర్తిగా నివారించవచ్చు. ఈ సమస్యతో బాధపడేవారు తక్షణమే వైద్య నిపుణులను సంప్రదించి, సరైన నిర్ధారణ, చికిత్స పొందడం ద్వారా సాధారణ జీవితాన్ని గడపవచ్చు.


# అరటి పండ్లు ఈ టైంలో తింటే ఎన్నో లాభాలు

ఏడాది పొడవునా లభించే పండ్లలో అరటిపండు ఒకటి. అరటిపండ్లను పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఇష్టంగా తింటారు. అయితే అరటిపండ్లను ఎల్లప్పుడు సరైన పద్ధతిలోనే తినాలి. తద్వారా వీటిల్లోని పోషకాలను పూర్తిగా పొందొచ్చు.ఏడాది పొడవునా లభించే పండ్లలో అరటిపండు ఒకటి. అరటిపండ్లను పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఇష్టంగా తింటారు. అయితే అరటిపండ్లను ఎల్లప్పుడు సరైన పద్ధతిలోనే తినాలి. తద్వారా వీటిల్లోని పోషకాలను పూర్తిగా పొందొచ్చు. ఉదయం నిద్రలేచిన తర్వాత అరటిపండ్లు తినడం వల్ల శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. ఇందులో ఉండే విటమిన్ బి6, పొటాషియం రక్త ప్రసరణను మెరుగుపరచడంలో సహాయపడతాయి. మలబద్ధకంతో బాధపడేవారికి ఉదయం అరటిపండ్లు తినడం చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. జిమ్‌కు వెళ్లే ముందు లేదా వ్యాయామం చేసే ముందు 1 లేదా 2 అరటిపండ్లు తినడం మంచిది. అరటిపండ్లలోని కార్బోహైడ్రేట్లు వ్యాయామానికి అవసరమైన శక్తిని అందిస్తాయి. అలాగే పొటాషియం కండరాల తిమ్మిరిని నివారిస్తుంది. ఇది కండరాలను కూడా బలపరుస్తుంది. భోజనం తర్వాత అరటిపండ్లు తినడం వల్ల జీర్ణక్రియ వేగవంతం అవుతుంది. అరటిపండ్లలోని ఫైబర్ ఆహారం జీర్ణం కావడానికి దోహదపడుతుంది. ఇది పేగు ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది. శరీరం నుంచి విషాన్ని బయటకు పంపడంలో కూడా సహాయపడుతుంది. సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్య ఆకలిగా అనిపించినప్పుడు జంక్ ఫుడ్ కు బదులుగా అరటిపండ్లు తినడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఇది స్నాక్స్ తినే అలవాటును వదిలించుకోవడానికి సహాయపడుతుంది. ఇది శరీరానికి అవసరమైన పోషణను కూడా అందిస్తుంది.




## రాత్రి భోజనం ఆలస్యంగా తీసుకుంటే..

# డయాబెటిస్ వస్తుందా?



చాలా మంది రాత్రి వేళ ఆలస్యంగా భోజనం తీసుకోవడాన్ని సాధారణ అలవాటుగా భావిస్తారు. కానీ ప్రభావం వెంటనే గుర్తించబడకపోయినా అది క్రమంగా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా రాత్రి ఆలస్యంగా తినడం వల్ల శరీర సమతుల్యత దెబ్బతింటుంది. రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. నేటి ఒత్తిడితో కూడిన జీవనశైలి ఆరోగ్యంలో అనేక మార్పులకు దారితీసింది. పని, మొబైల్ ఫోన్ల అధిక వినియోగం,మారుతున్న జీవనశైలి కారణంగా ఆహారపు అలవాట్లు చెదిరిపోతున్నాయి. అందువల్ల చాలామంది ఆలస్యంగా తినడం అలవాటు చేసుకున్నారు. దానిని సాధారణ అలవాటుగా భావిస్తారు. కానీ ప్రభావం వెంటనే గుర్తించబడకపోయినా అది క్రమంగా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా రాత్రి ఆలస్యంగా తినడం వల్ల శరీర సమతుల్యత దెబ్బతింటుంది. రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. కాబట్టి రాత్రి ఆలస్యంగా తినడం వల్ల రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు పెరుగుతాయా? రాత్రిపూట ఆలస్యంగా తినడం, రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడం మధ్య బలమైన సంబంధం ఉందని నిపుణులు చెబుతారు. భోజన సమయం చక్కెర స్థాయిలను ప్రభావితం చేస్తుందని అనేక అధ్యయనాలు సైతం నిరూపించాయి. అందుకే ఈ అలవాటు విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆర్ఎంఎల్ హాస్పిటల్‌లోని మెడిసిన్ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ సుభాష్ గిరి ప్రకారం.. ఒక వ్యక్తి ఆలస్యంగా భోజనం చేసినప్పుడు, శరీరం దానిని ప్రాసెస్ చేయడం కష్టమవుతుంది. పగటిపూట కంటే రాత్రిపూట శరీరం నెమ్మదిగా పనిచేస్తుంది. అలాంటి సందర్భంలో తినే ఆహారం వెంటనే శక్తిగా మారదు. అందువల్ల, రక్తంలో గ్లూకోజ్ స్థాయి పెరగవచ్చు. ముఖ్యంగా తీపిగా ఉండే భోజనం తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి వేగంగా పెరుగుతుంది. అధిక చక్కెర స్థాయిలు కేవలం మధుమేహ వ్యాధిగ్రస్తులకు మాత్రమే సమస్య కాదు. ఆరోగ్యకరమైన వ్యక్తికి కూడా, రాత్రి ఆలస్యంగా తినే అలవాటు భవిష్యత్తులో సమస్యలకు దారితీస్తుంది. ఎక్కువ రోజులు ఈ అలవాటు కొనసాగించడం వల్ల శరీర చక్కెర నియంత్రణ వ్యవస్థ బలహీనపడుతుంది. క్రమంగా, ఇది ఇన్సులిన్‌ను ప్రభావితం చేస్తుంది. రక్తంలో చక్కెర స్థాయి సాధారణం కంటే ఎక్కువగా పెరగడం ప్రారంభమవుతుంది. ఈ అలవాటు మధుమేహం క్రమంగా ప్రమాదాన్ని పెంచుతుంది. కాబట్టి ప్రతి ఒక్కరూ సకాలంలో సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

## స్టెంట్ వేసిన తర్వాత కూడా



# గుండెపోటు వస్తుందా?

నేటి ప్రపంచంలో, గుండె జబ్బులు, దాని చికిత్స గురించి ఇంటర్నెట్‌లో చాలా సమాచారం అందుబాటులో ఉంది. దీంతో రోగులు, వారి కుటుంబాలు తరచుగా గందరగోళానికి గురవుతారు. ముఖ్యంగా కార్డియాక్ స్టెంట్లకు సంబంధించి, ప్రశ్న పదేపదే తలెత్తుతుంది. స్టెంట్ వేసిన తర్వాత కూడా గుండెపోటు వస్తుందా? స్టెంట్ వేసిన తర్వాత కూడా గుండెపోటు వచ్చే అవకాశం పూర్తిగా తొలగించినట్లు కాదని వైద్యులు స్పష్టంగా చెబుతున్నారు. నేటి ప్రపంచంలో, గుండె జబ్బులు, దాని చికిత్స గురించి ఇంటర్నెట్‌లో చాలా సమాచారం అందుబాటులో ఉంది. దీంతో రోగులు, వారి కుటుంబాలు తరచుగా గందరగోళానికి గురవుతారు. ముఖ్యంగా కార్డియాక్ స్టెంట్లకు సంబంధించి, ప్రశ్న పదేపదే తలెత్తుతుంది. స్టెంట్ వేసిన తర్వాత కూడా గుండెపోటు వస్తుందా? స్టెంట్ వేసిన తర్వాత కూడా గుండెపోటు వచ్చే అవకాశం పూర్తిగా తొలగించినట్లు కాదని వైద్యులు స్పష్టంగా చెబుతున్నారు. గుండెకు రక్తాన్ని తీసుకువెళ్ళే ధమనులలో కొలెస్ట్రాల్ నిక్షేపాలు దారిని ఇరుకుగా చేసినప్పుడు స్టెంట్ అమరుస్తారు. ఇది సాధారణ రక్త ప్రవాహాన్ని పునరుద్ధరించడానికి, మూసుకుపోయిన సిరలోకి చొప్పించబడే లోహపు మెష్. గుండెపోటు తర్వాత లేదా తీవ్రమైన అడ్డంకులు ఉన్న సందర్భాల్లో సిరను తెరిచి ఉంచడానికి సహాయపడుతుంది. గుండెకు తగినంత రక్త ప్రసరణను నిర్ధారించడానికి సాధారణంగా స్టెంట్ అమరుస్తారు. స్టెంట్ ఒక నిర్దిష్ట సిరను తెరుస్తుంది. కానీ అది గుండెలోని అన్ని ధమనులను రక్షించదు. రోగి అనారోగ్యకరమైన జీవనశైలిని కొనసాగిస్తే, వేయించిన, అధిక కొవ్వు పదార్థాలు తింటే, ధూమపానం చేస్తే లేదా శారీరకంగా క్రియారహితంగా ఉంటే, ఇతర గుండె ధమనులలో అడ్డంకులు ఏర్పడవచ్చు. అందుకే స్టెంట్ వేసినప్పటికీ మళ్ళీ గుండెపోటు రావచ్చు. స్టెంట్ సహజ సిరకు ప్రత్యామ్నాయం కాదు. ఆ సమయంలో ప్రాణాలను కాపాడటానికి సహాయపడే తాత్కాలిక మద్దతు మాత్రమే. శరీరంలోకి పదేపదే స్టెంట్లను చొప్పించడం సురక్షితమైనదిగా.. శాశ్వత పరిష్కారంగా పరిగణించదంటున్నారు వైద్య నిపుణులు. మళ్ళీ గుండెపోటు వస్తే, రోగి పరిస్థితి మరింత తీవ్రంగా మారవచ్చంటున్నారు. చికిత్స కూడా కష్టతరం కావచ్చు అని కార్డియాలజిస్ట్ వైద్య నిపుణులు వివరిస్తున్నారు. స్టెంట్ అమర్చిన తర్వాత, రోగి మునుపటి కంటే ఎక్కువగా దుర్బలంగా ఉంటాడు. రెండవ గుండెపోటుతో ప్రమాద తీవ్ర పెరుగుతుంది. చాలా సందర్భాలలో, యాంజియోప్లాస్టీ , స్టెంట్ చొప్పించడం అవసరం రావచ్చు. కొన్ని సందర్భాల్లో, శరీరం స్టెంట్‌ను అంగీకరించకపోతే, ప్రక్రియ సమయంలో ఏదైనా సమస్య ఉంటే, పరిస్థితి ప్రాణాంతకం కూడా కావచ్చు. అందుకే స్టెంట్ అమర్చిన తర్వాత నిర్లక్ష్యంగా ఉండకూడదని వైద్యులు పదేపదే హెచ్చరిస్తున్నారు. సమతుల్య ఆహారం, క్రమం

# ఆయన శ్రీరాముడు...

**మహబూబ్ నగర్ :** రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిపై గత కొన్ని రోజులుగా జరుగుతున్న ప్రచారంపై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన అత్యంత భావోద్వేగంగా మాట్లాడుతూ, కోమటిరెడ్డిని 'శ్రీరాముడి'తో పోల్చారు. ఒక దేవుడి లాంటి వ్యక్తిపై ఇలాంటి నీచమైన ప్రచారాలు చేయడం చూస్తుంటే రక్తం మరుగుతోందని, ఈ బాధతో తాను గత మూడు రోజులుగా తిండి కూడా తినలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా సాగుతున్న ఈ కుట్రల వెనుక ఎవరున్నారో త్వరలోనే తేలుతుందని ఆయన హెచ్చరించారు.మంత్రిపై వస్తున్న ఆరోపణలను సాంకేతికంగాను, వ్యక్తిగతంగాను అనిరుధ్ రెడ్డి తిప్పికొట్టారు. మంత్రికి గత కొంతకాలంగా ఉన్న గొంతు సమస్య వల్ల ఆయన మాటలో వచ్చే మార్పులను ఆసరాగా చేసుకుని, కొందరు పనిగట్టుకుని అపనిందలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. మంత్రి కోమటిరెడ్?డ దాపరికం తెలియదు, కనీసం ఆయన మొబైల్‌కు లాక్ కూడా ఉండదు. అంతటి నిప్పు లాంటి మనిషిపై బురద చల్లడం దారుణం అని పేర్కొన్నారు. తాను కోమటిరెడ్డికి వీరాభిమానినని, ఆయన బావిలో దూకమన్నా దూకడానికి సిద్ధంగా ఉన్నానని, ఆయన కోసం ప్రాణాలైనా ఇస్తానంటూ తన విధేయతను చాటుకున్నారు.ప్రస్తుతం ఈ వ్యవహారంపై అధికారికంగా విచారణ జరుగుతోందని, త్వరలోనే అసలు నిజాలు బయటకు వస్తాయని అనిరుధ్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. రాజకీయంగా ఎదుర్కోలేకనే ప్రతిపక్షాలు లేదా గిట్టని వారు ఇలాంటి చిల్లర వేషాలు వేస్తున్నారని, ఇలాంటి కుతంత్రాలకు కాంగ్రెస్ శ్రేణులు భయపడవని స్పష్టం చేశారు. మంత్రికి పార్టీ మొత్తం అండగా ఉంటుందని, విచారణలో ఆయన నిర్దోషిగా తేలుతారని ధీమా వ్యక్తం చేశారు. ఒక మేరునగ ధీరుడిపై జరుగుతున్న ఈ దాడిని ప్రజలు కూడా గమనిస్తున్నారని, తప్పుడు ప్రచారం చేసే వారికి కాలమే సమాధానం చెబుతుందని అనిరుధ్ రెడ్డి హెచ్చరించారు.



**కోమటిరెడ్డిపై ఏం ప్రచారం జరుగుతోందంటే?**

మంత్రి , మరో మహిళా ఐఏఎస్ అధికారితో సన్నిహితంగా ఉంటున్నారని ఓ వార్తా చానల్ లో వార్తా కథనం ప్రసారం అయింది. ఆ మంత్రి కోమటిరెడ్డేనని ప్రచారం జరిగింది. దీంతో కోమటిరెడ్డి మీడి ముందుకు వచ్చి.. తన ఆరోగ్యంపై కావాలనే కొందరు కుట్రపూరితంగా దుష్ప్రచారం చేస్తున్నారని, ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తిపై ఇలాంటి అసత్య ఆరోపణలు చేయడం సరికాదని ఆయన మండి పడ్డారు. ఈ విషయంలో నిజానిజాలు నిలకడ మీద తెలుస్తాయని, తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీయాలని చూసే వారికి ప్రజలే బుద్ధి చెబుతారని ఆయన స్పష్టం చేశారు. తన కుమారుడు చనిపోయినప్పుడే తానుసగం చనిపోయానని.. ఇప్పుడు ఇలాంటి ప్రచారాలు చేసే బదులు విషమిచ్చి చంపేయాలన్నారు. ఆయన సీరియస్ కావడంతో ప్రభుత్వం ఈ అంశంలో విచారణకు సిట్ ను నియమించింది. ముగ్గురు జర్నలిస్టుల్ని అరెస్టుచేయడంతోపాటు పెద్ద ఎత్తున యూట్యూబ్ చానళ్లకు నోటీసులు ఇవ్వడంతో ఈ అంశం దుమారం రేపుతోంది. అందుకే కోమటిరెడ్డికి మద్దతుగా అనిరుధ్ రెడ్డి స్పందించారు.

# రోహిత్ వేముల చట్టం తీసుకురావాలి

**హైదరాబాద్ :** తెలంగాణకు చెందిన రీసెర్చ్ స్కాలర్ రోహిత్ వేముల వర్ధంతి వేళ కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ సంచలన ట్వీట్ చేశారు. ఆయన మృతి చెంది పదేళ్లు అవుతున్న విషయాన్ని గుర్తు చేస్తూ ఇలాంటి వాటి నివారణకు కచ్చితంగా రోహిత్ వేముల పేరుతో చట్టం రావాలని ఆకాంక్షించారు. ఇన్ని చట్టాలు, ఇంత అభివృద్ధి సాధిస్తున్నా నేటికీ వారి పట్ల వివక్ష ఇంకా పోలేదని రాహుల్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి చోట ఇదే పరిస్థితి కనిపిస్తోందని ఎక్స్ వేదికగా చెప్పుకొచ్చారు. రాహుల్ గాంధీ ఎక్స్‌లో ఏం పోస్టు చేశారంటే..." ఈ రోజు రోహిత్ వేముల మరణించి 10 సంవత్సరాలు పూర్తయింది. కానీ రోహిత్ సంధించిన "ఈ దేశంలో కలలు కనే హక్కు అందరికీ సమానమేనా?" అనే ప్రశ్న ఇప్పటికీ మన గుండెల్లో ప్రతిధ్వనిస్తోంది. అని అన్నారు. సమాజంలో ఎదురైన వివక్షే రోహిత్ లాంటి వ్యక్తుల పాలిట విషంగా మారుతుందన్నారు రాహుల్. మంచి చదువులు చదివి దేశాన్ని ఉద్ధరించాలనే ఆ వ్యక్తి ఆలోచనను చిదిమేసిందని మండిపడ్డారు. "రోహిత్ చదువుకోవాలనుకున్నాడు. విజ్ఞాన శాస్త్రం, సమాజం, మానవత్వాన్ని అర్థం చేసుకుని ఈ దేశాన్ని ప్రగతి పథంలో తీసుకెళ్లాలని అనుకున్నాడు. కానీ దళితుడైనందున ఈ వ్యవస్థ ఆ వ్యక్తిని ముందుకు సాగనివ్వలేదు. వ్యవస్థాగత వివక్ష, సామాజిక బహిష్కరణ, రోజువారీ అవమానాలు, కులగర్వంతో కూడిన



భాష, అమానవీయ ప్రవర్తన ? ఈ విషమే ఒక ఆశాజనకమైన యువకుడి ఆత్మగౌరవాన్ని హరించి, అతన్ని ఒంటరిని చేసి, ఆత్మహత్యకు పురికొల్పింది."రోహిత్ చనిపోయిన పరిస్థితులు ఎలా ఉన్నాయో, ఇప్పుడు కూడా అదే పరిస్థితి కొనసాగుతుందని రాహుల్ అభివర్ణించారు. ఇప్పటికే కులమే అన్నింటిలో అతి పెద్ద ప్రవేశ పత్రమని అభిప్రాయపడ్డారు. " మరి ఈ రోజు? దళిత యువత పరిస్థితి ఏమైనా మారిందా? క్యాంపస్‌లో అదే చిన్నచూపు, హాస్టల్‌లో అదే ఒంటరితనం, తరగతి గదిలో అదే హేళన, ఆపై అదే హింస – కొన్నిసార్లు అదే మరణం. ఎందుకంటే ఈ దేశంలో కులమే ఇప్పటికీ అతిపెద్ద ప్రవేశ పత్రం." అని ఘాటుగా బదులిచ్చారు. కులం పేరుతో జరిగే అరాచకాలు ఆగాలని రాహుల్ గాంధీ ఆకాంక్షించారు. "అందుకే రోహిత్ వేముల చేసిన పని కేవలం ఒక నినాదం కాదు, అది ఒక అవసరం. తద్వారా విద్యా సంస్థలలో కుల వివక్ష ఒక నేరంగా మారాలి, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి, ఏ విద్యార్థినైనా అతని కులం పేరుతో వేధించే, అణచివేసే బహిష్కరించే స్వేచ్ఛ అంతం కావాలి." అని ఎక్స్ వేదికగా పిలుపునిచ్చారు. ఈ పోరాటాలు కేవలం రాజకీయాల కోసం కాదని, ప్రతి అవకాశం కోసం జరగాలని రాహుల్ అభిప్రాయపడ్డారు. "ఈ పోరాటం కేవలం పార్లమెంటు కోసం కాదు. ఈ పోరాటం క్యాంపస్‌ది, యువతది, మనందరిది. దళిత యువత – మీ గొంతు వినిపించండి, సంఘటితం అవ్వండి, ఒకరికొకరు తోడుగా నిలబడండి. డిమాండ్ చేయండి: రోహిత్ వేముల చట్టాన్ని వెంటనే అమలు చేయండి. వివక్ష వ్యతిరేక చట్టం ఇప్పటికీ అవసరం. "అని నినదించారుకాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కులవివక్షతో జరిగే దాడుల నివారణకు చట్టం తీసుకురాబోతున్నట్టు రాహుల్ ప్రకటించారు. తెలంగాణ, కర్ణాటకలో ఈ ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. "కర్ణాటక. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు ఈ చట్టాన్ని వీలైనంత త్వరగా అమలు చేసే ప్రక్రియలో ఉన్నాయి. మాకు న్యాయమైన, మానవత్వంతో కూడిన, సమానమైన భారతదేశం కావాలి – అక్కడ ఏ దళిత విద్యార్థి కూడా తన కలలకు తన ప్రాణాలను మూల్యంగా చెల్లించాల్సిన అవసరం ఉండకూడదు. రోహిత్, నీ పోరాటం మా బాధ్యత." అని తెలిపారు.

# అధికారం చేతిలో ఉందని అడ్డగోలుగా విభజనలు చేస్తున్నారు

**రిజర్వేషన్లలో కూడా అనేక అవకతవకలు చేశారు**

**మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్**

**హైదరాబాద్ :** అధికారం చేతిలో ఉందని అడ్డగోలుగా విభజనలు చేస్తున్నారు..రిజర్వేషన్లలో కూడా అనేక అవకతవకలు చేశారు మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ విమర్శించారు. గత ప్రభుత్వం ఇదే పనిచేసింది ఈ ప్రభుత్వం కూడా అదే పని చేస్తుంది.శనివారం మీడియా తో మాట్లాడుతూ జనాభా మార్చడం, బౌండరీలు మార్చడంతో గెలవాలని ప్రయత్నం చేయడం వృధా ప్రయాస అని,సికింద్రాబాద్ పేరును ఎవరు తక్కువ చేయకూడదు అలా అని మల్లజిగిరిని కూడా తక్కువ చేయవద్దన్నారు.మల్కాజ్గిరి పార్లమెంటు దేశంలోనే అతిపెద్ద నియోజకవర్గం. ఇప్పుడు మల్కాజ్గిరి కార్పొరేషన్ లో ఉన్న కార్పొరేటర్లందరూ మల్కాజ్గిరి జిల్లాకు చెందినవారే. దీనిని సికింద్రాబాద్లో కలపాలి అనడం సరికాదు. సికింద్రాబాద్ చరిత్ర, గ్లామర్, గొప్పదనానికి నేను



వ్యతిరేకం కాదు. కానీ మల్కాజిగిరి పేరు మార్చమనడం సరికాదు. మార్చాలి అనే వారు అనాడు అధికారంలో ఉన్నారు.. అప్పుడు ఎందుకు సికింద్రాబాద్ పేరు జిల్లాకు పెట్టమని అడగలేదు ? ఆనాడు ఎందుకు చేయలేదు అని అడుగుతున్న. ఈ ద్వంద ప్రమాణాలు సరికాదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చే రెండేళ్లయిన మున్సిపాలిటీలలో గ్రామపంచాయతీలలో పాత బకాయిలను చెల్లించలేకపోయింది. మా దగ్గర ఒక్క రూపాయి లేదు బ్యాంకు దగ్గరకు అప్పు కు వెళ్దామంటే దొంగల లెక్క చూస్తున్నారని స్వయంగా ముఖ్యమంత్రిగా నే చెప్పారు. నన్ను కోసిన రూపాయి లేదు అంటున్నారు. కేవలం కేంద్ర ప్రభుత్వ నిధుల కోసమే ఎన్నికలను నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్కు ఓటు వేసినా ఇవ్వడానికి డబ్బులు లేవు. ఇప్పుడు పట్టణాల్లో వాతావరణం బీజేపీకి అనుకూలంగా ఉంది. బిఆర్ఎస్ అక్కడ లేదు, ఇక్కడా లేదు.. వారిది కత్తి కాదు నెత్తి కాదు. వారికి ఓటు వేసినా ఒరిగేది లేదు. మున్సిపాలిటీలు బాగుపడాలంటే భారతీయ జనతా పార్టీ గెలవాలని భావన ప్రజల్లో ఉంది. ఎవరెన్ని మాటలు చెప్పిన రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయం సాధిస్తుందని నమ్మకం౦ంది.

## ఉప ముఖ్యమంత్రి ధర్మపురి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి అడ్లూరి

**ధర్మపురి :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ధర్మపురి పర్యటన నేపథ్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, అధికారులు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి శనివారం రోజున పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు,ధర్మపురి మండలానికి రానున్నారని తెలిపారు. ఆయన పర్యటనలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ధర్మపురి ప్రాంతంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న అంశాన్ని ముఖ్యమంత్రి



రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా రూ.200 కోట్లతో యంగ్ ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం, గోదావరి నది కలుషితం కాకుండా 17 కోట్లు రూపాయలతో సివరేజ్ ప్లాంట్ ఏర్పాటు శంకుస్థాపన చేయడం జరుగుతుందని తెలిపారు.టీఎఫ్ఐడీ ద్వారా రూ.15 కోట్ల ద్వారా ధర్మపురి పట్టణంలో అనేక పనులు చేశామని, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లు మార్పు, కొత్త స్తంభాల ఏర్పాట్లకు రూ.4 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు.అదేవిధంగా ధర్మపురి పట్టణంలోని అన్ని కుల సంఘ భవనాల నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఇప్పటికే అనేక అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారని తెలిపారు.

## పలు చోట్ల చైన్ స్నాచర్ల హల్ చల్

**హైదరాబాద్ :** హైదరాబాదు నగరంలో ఒక్కసారిగా స్నాచార్లు రెచ్చిపోయారు మల్కాజ్గిరి కమిషనరేట్ పరిధిలోని హయత్ నగర్, నాగోల్ మరియు చైతన్యపురి పోలీస్ స్టేషన్ల పరిధిలో వరుస స్నాచింగ్లకు పాల్పడ్డారు దుండగులు, హయత్ నగర్ అంజనాద్రి నగర్ లో గుడికి వెళ్లి వస్తున్న విజయ అనే మహిళ మెడలో నుండి 3.5 తులాల పుస్తెలతాడు లెక్కెళ్లారు, నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మనెమ్మ అనే మహిళా మెడలో నుంచి 2.5 తులాల బంగారు పుస్తెలతాడు చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో మరో మహిళా మెడలో నుంచి బంగారు చైన్ లాకెళ్లి పరారయ్యారు దుండగులు, బైక్ పై వచ్చిన దుండగులుద్దరూ స్నాచింగ్స్ కు పాల్పడుతూ పరారయ్యారు. ఘటనకు సంబంధించిన వీడియోలు సీసీ కెమెరాలు రికార్డు అవ్వగా వాటి ఆధారంగా పోలీసులు నిందితులను పట్టుకోవడానికి బృందాలుగా విడిపోయి గాలిస్తున్నారు...

## గ్రూప్-03లో ఉద్యోగం సాధించిన గంగాపురి యువకుడు శ్యాం కుమార్ రెడ్డి

**-సీనియర్ అకౌంటెంట్‌గా నియామక ఉత్తర్వుల స్వీకరణ**

**-పెద్దపల్లి డిటిఓలో పోస్టింగ్**

**-అభినందించిన పలువురు**

**మంథని :** మంథని మున్సిపాలిటీ పరిధిలోని గంగాపురి గ్రామానికి చెందిన అట్టి శ్యాం కుమార్ రెడ్డి ఇటీవల నిర్వహించిన గ్రూప్-03 పరీక్షల్లో 800ల ర్యాంకు సాధించి ఈ డబ్ల్యూ ఎస్ కోటాలో సీనియర్ అకౌంటెంట్‌గాప్రభుత్వ ఉద్యోగాన్ని పొందాడు. మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన శ్యాం కుమార్ రెడ్డి కష్టపడి చదివి ఈ స్థాయికి చేరుకోవడం పలువురికి ఆదర్శంగా నిలిచాడు. గ్రామీణ ప్రాంతంలో పరిమిత వనరుల మధ్య విద్యాభ్యాసం కొనసాగించిన ఆయన, అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటూనే లక్ష్యాన్ని వదలకుండా నిరంతరం శ్రమించారు. రాత్రింబవళ్లు కష్టపడి చదివిన ఫలితంగానే ఈ గ్రూప్?03 పరీక్షలో విజయం సాధించానని శ్యాం కుమార్ రెడ్డి తెలిపారు. తల్లిదండ్రుల దీవెనలు, కుటుంబ సభ్యుల సహకారం, గ్రామ ప్రజల ఆశీస్సులే తన విజయానికి ప్రధాన కారణం శ్యాం కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యంగా చదువుపై తనకు ఉన్న నమ్మకం, పట్టుదలే తనను ముందుకు నడిపించాయని శ్యాం కుమార్ తెలిపారు. గ్రూప్-03 పరీక్షల్లో 800ల ర్యాంకు సాధించి సాధించిన అనంతరం పెద్దపల్లి ట్రెజరీ కార్యాలయంలో సీనియర్ అకౌంటెంట్‌గా నియామక ఉత్తర్వులు అందుకుని సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు కుమార్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగం రావడం తన జీవితంలో మర్చిపోలేని ఘట్టమని, ఈ అవకాశం లభించడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని చెప్పారు. తన ప్రయాణంలో ఎదురైన కష్టాలు, చేసిన త్యాగాలు అన్నీ ఈ ఒక్క విజయంతో సార్థకమయ్యాయని ఆయన అన్నారు. యువత లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి శ్రమిస్తే తప్పకుండా విజయం సాధించగలరని శ్యాం కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా గంగాపురి గ్రామ ప్రజలు, మిత్రులు, శ్రేయోభిలాషులు శ్యాం కుమార్ రెడ్డిని అభినందిస్తూ, ఆయన మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంత యువతకు ఆయన విజయం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు.

## హాట్ బెలూన్ ప్రదర్శనలో అపశృతి

**హైదరాబాద్ :** హాట్ బెలూన్ ప్రదర్శనలో ప్రమాదం తప్పింది. బెలూన్లో సాంకేతిక సమస్య ఎదురయ్యింది. దాంతో బెలూన్ ను హైదరాబాద్ – ఇబ్రహీంబాగ్ చెరువు దగ్గర అత్యవసర ల్యాండింగ్ చేసారు. సాంకేతిక లోపంతో గాలి తగ్గడంతో బురదలో దిగినోయింది బెలూన్. అందులో ఉన్న ముగ్గురు ప్రయాణికులు సురక్షితంగా బయటపడటంతో ప్రమాదం తప్పింది.

## ఆర్ధరాత్రి కారు బీభత్సం.. యువకుడికి తీవ్ర గాయలు

**హైదరాబాద్ :** హైదరాబాద్లో మరో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చంపాపేట గ్రీన్ పార్క్ కాలనీ కామన్ వద్ద ఓ కారు ఓవర్ స్పీడ్తో బీభత్సం సృష్టించింది. సంక్రాంతి పండుగ సందర్భంగా స్నేహితులను కలిసిన అనంతరం అర్థరాత్రి 12.30 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వెళ్తున్న సునీల్ కుమార్ (28) పై వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఢీకొట్టిన వెంటనే ఆగకుండా సుమారు 50 నుంచి 100 మీటర్ల వరకు యువకుడిని ఈడ్చుకెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. ద్విచక్ర వాహనాన్ని ఈడ్చుకెళ్తున్న కారు దృశ్యాలు సీసీ కెమెరాలో స్పష్టంగా నమోదయ్యాయి. ఈ ఫుటేజ్ ఇప్పుడు పోలీసుల దర్యాప్తుకు కీలకంగా మారింది. ఈ ప్రమాదంలో సునీల్ కుమార్కు తీవ్ర గాయాలు కావడం జరిగింది. స్థానికులు వెంటనే స్పందించి ఆయనను సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తున్న వైద్యులు బాధితుడి పరిస్థితి విషమంగా ఉందని వెల్లడించారు. సమాచారం అందుకున్న సైదాబాద్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేశారు.

## జగ్గారెడ్డిగా నేను మాట ఇస్తున్నా...

**సంగారెడ్డి లో ఇల్లు లేని ప్రతీ పేదవాడికి 80 గజాల స్థలం ఇస్తా**

**సంగారెడ్డి మున్సిపాలిటీ లో ఇంటి స్థలం లేనివారితో ముఖా ముఖి సమావేశం**

**సంగారెడ్డి :** జగ్గారెడ్డి గా నేను మాట ఇస్తున్నా... సంగారెడ్డి లో ఇల్లు లేని ప్రతీ పేదవాడికి 80 గజాల స్థలం ఇస్తాననిలో టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి హామీ ఇచ్చారు. సంగారెడ్డి మున్సిపాలిటీ లో 2012-2013 లో ఇళ్ల పట్టా పొందిన వారితో పాటు ఇంటి స్థలం లేనివారితో సంగారెడ్డి గంజ్ మైదాన్ లో టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మల ముఖా ముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గ రెడ్డి మాట్లాడుతూ కిరాయి ఇళ్లలో ఉండేవాళ్ల కష్టాలు నాకే ఎక్కువగా తెలుసు- 22 సంవత్సరాలు కిరాయి ఇంటిలోనే ఉన్న.. అందుకే మీకు సొంత ఇంటి జాగ ఉండాలని ప్రయత్నం చేస్తున్న - ఉమ్మడి రాష్ట్రంలో 2013 సంవత్సరంలోనే అప్పటి సీఎం కిరణ్ కుమార్ రెడ్డి తో మాట్లాడి సంగారెడ్డిలోని 5500 పేద ప్రజలకు 80 గజాల చొప్పున ఇంటి స్థలాలు ఇప్పించాను- ఆ రోజు మీకు అలియాబాద్, తోగర్ పల్లిలో నేను ఇప్పించిన స్థలాలను బి.ఆర్.ఎస్ పదేళ్ల పాలనలో వేరే పనులకు తీసుకున్నారు- మీలో ఒక్కరైనా మీకు ఇచ్చిన స్థలాల గురించి పదేళ్లలో ఎందుకు ప్రశ్నించలేదు- అందుకే మళ్ళీ మీకు 80 గజాల స్థలం ఇవ్వడానికి సంగారెడ్డి, కంది మండలాల్లో 200 ఎకరాల స్థల సేకరణ చేయడానికి కలెక్టర్ తో కూడా మాట్లాడాను- ఈ జనవరి నెల నుండే ప్రాసెస్ స్టార్ట్ చేస్తున్న.. వచ్చే నవంబర్ వరకు ఒక కొలిక్కి తీసుకొస్తాను.. భూసేకరణ కాగానే మళ్ళీ మీతో మీటింగ్ పెడతా-సర్టిఫికెట్లు లేనొల్లు సైతం మున్సిపల్ కమిషనర్ కు దరఖాస్తు చేసుకొండి?- వెయ్యి నోటు కోసం.. క్వార్టర్ సీసా కోసం మీ జీవితాలను ఆగం చేసుకున్నారు.. మళ్ళీ ఆగం కాకండి - ప్రతీ నెల 5 వేల రూపాయలు ఇంటి కిరాయి చెల్లిస్తే.. ఏడాదికి 60 వేలు.. పదేళ్లకు 6 లక్షలు నష్టపోయారు .. - ఆరోజే మీరు ఆలోచించి నిర్ణయం తీసుకుంటే ఈ 6 లక్షల రూపాయలు మీకు మిగిలేవి కదా- నన్ను ఒడగొట్టారని నేను ఏనాడు బాధపడలేదు.. ఒక రకంగా మంచి పనే చేశారు..- నేను ఓడిపోవడం వల్ల నా భార్య నిర్మల కార్పొరేషన్ చైర్మన్ అయ్యింది- నాలుగున్నరేళ్లు నేను పైసలు పంచుతా.. నా దగ్గర డబ్బులు ఉంటాయి..- కానీ ఎన్నికలప్పుడే పైసలు ఉండవు.. నాకు అదే శాపం- వాళ్ళ లాగా నేను కూడా ఓటుకు వెయ్యి ఇయ్యామంటే ఇస్తా.. కానీ నాది అలా ఆలోచించే స్వభావం కాదు....పదేళ్లు అధికారం లేదు. ఇప్పుడు అధికారం లో ఉన్నా, నా మాట చెల్లుతది, సీఎం రేవంత్ రెడ్డి నేను చెబితే వింటడు.... జగ్గారెడ్డి గా నేను మాట ఇస్తున్నా... సంగారెడ్డి లో ఇల్లు లేని ప్రతీ పేదవాడికి 80 గజాల స్థలం ఇస్తానన్నారు.

## మంత్రి వివేక్ ఒంటెద్దు పోకడలను నిరసిస్తూ కాంగ్రెస్‌కు జడ్పీ మాజీ వైస్ చైర్మన్ రాజీనామా

**మంచిర్యాల :** మున్సిపల్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకి షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు ఉమ్మడి జిల్లా జడ్పీ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. మంత్రి వివేక్ వెంకటస్వామి పార్టీలో ఒంటెద్దు పోకడలు, ఏకపక్ష నిర్ణయాలు, నియంత పరిపాలన తీవ్రంగా కలిచి వేసిందని పేర్కొంటూ కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు. త్వరలో తాను అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్లు రాజిరెడ్డి ప్రకటించారు.ఈ సందర్భంగా రాజీనామాకు గల కారణాలను లేఖ ద్వారా వివరించారు.

# బిజినెస్

## డిఫెన్స్ కంపెనీల్లో విదేశీ పెట్టుబడులకు నిబంధనలు సడలించే యోచనలో కేంద్రం



దేశీయ డిఫెన్స్ కంపెనీల్లో విదేశీ సంస్థ పెట్టుబడులకు సంబంధించి నిబంధనలను మరింత సులభతరం చేయాలని కేంద్రం భావిస్తోంది. గతేడాది పాకిస్తాన్‌తో జరిగిన ఘర్షణ నేపథ్యంలో దేశీయ తయారీని ప్రోత్సహించే చర్యల్లో భాగంగా ప్రభుత్వం ఇందుకు సానుకూలంగా ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వ అనుమతి అవసరం లేని ఆటోమేటిక్ రూట్ కింద ఇప్పటికే లైసెన్సులు ఉన్న రక్షణ సంస్థలలో విదేశీ కంపెనీలు 49 శాతం వరకు పెట్టుబడి పెట్టడానికి అవకాశాలు ఉన్నాయి. దీన్ని 74 శాతానికి పెంచాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీనివల్ల విదేశీ కంపెనీలు సులభంగా మన రక్షణ రంగ సంస్థల్లో మెజారిటీ వాటాను సొంతం చేసుకోవచ్చు. ప్రస్తుతం, కొత్త రక్షణ లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు మాత్రమే విదేశీ కంపెనీలు స్వయంగా 74 శాతం వరకు స్వంతం చేసుకోవడానికి అనుమతి ఉంది. కొత్త నిబంధన ఇప్పటికే లైసెన్సులు ఉన్న కంపెనీలకు వర్తిస్తుంది. ఈ మార్పు ద్వారా స్నేహపూర్వక దేశాల నుంచి రక్షణ కంపెనీలను భారత్‌లో మరింత భారీగా పెట్టుబడి పెట్టడానికి ఆకర్షించే లక్ష్యంతో చేస్తోంది. రాబోయే కొన్ని నెలల్లో కొత్త నిబంధనలు అమలులోకి రావచ్చు. కాగా, గత 25 ఏళ్లలో భారత రక్షణ రంగంలోకి మొత్తం విదేశీ పెట్టుబడుల వాటా 26.5 మిలియన్ డాలర్లు(మన కరెన్సీలో రూ. 240 కోట్ల) వరకు మాత్రమే ఉన్నాయి.

## అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ నుంచి పోటీ.. డెలివరీ ఫీజు తొలగించిన బ్లింకిట్




క్విక్ కామర్స్ రంగంలో రోజురోజుకూ పోటీ తీవ్రమవుతోంది. ముఖ్యంగా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి సంస్థల నుంచి స్టార్టప్ సంస్థలకు గట్టి పోటీ ఎదురవుతోంది. ఈ రెండు దిగ్గజ సంస్థలు మార్కెట్‌లోకి వేగంగా దూసుకొస్తుండటంతో ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న కంపెనీలు అప్రమత్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే క్విక్ కామర్స్‌లో మార్కెట్‌లీడర్‌గా ఉన్న బ్లింకిట్ గురుగ్రామ్, బెంగళూరు, ముంబయి వంటి ఎంపిక చేసిన మార్కెట్లలో డెలివరీ ఫీజును తొలగించింది. బలంగా వేళ్లూనుకున్న మార్కెట్లలో కొత్తగా వచ్చే ప్లేయర్లకు సవాల్ విసిరేందుకు ఈ మార్గాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. క్విక్ కామర్స్ విభాగంలో జెప్టో, స్విగ్గీ ఇప్పటికే కనీస కార్ట్‌వాల్యూతో పాటు, వివిధ రకాల ఫీజులను తొలగించాయి. హ్యాండ్లింగ్ ఫీజు, సర్‌ఛార్జ్ వంటి ఫీజులను జెప్టో గతేడాది తొలగించింది. కనీస ఆర్డర్ విలువను కూడా రూ.99గా నిర్ణయించింది. ఆ మొత్తం దాటితే ఫ్రీ డెలివరీ అందిస్తోంది. స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ సైతం ఇదేబాటలో పయనిస్తోంది. బ్లింకిట్ మాత్రం ఈ ఛార్జీల విషయంలో వెనక్కి తగ్గలేదు. ఫ్లిప్‌కార్ట్ మినిట్స్, అమెజాన్ నౌ పేరిట.. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ సంస్థలు ఈ రేసులోకి ఎంట్రీ ఇవ్వడంతో బ్లింకిట్ అప్రమత్తమైంది. వాటినుంచి పోటీ తట్టుకోవడానికి డెలివరీ ఫీజు తొలగించి ఖాతాదారులను నిలుపుకొనే ప్రయత్నాలను మొదలుపెట్టింది. సగటున రెండు డార్క్ స్టోర్ల ఏర్పాటే లక్ష్యంగా ముందుకెళుతున్నట్లు అమెజాన్ ప్రకటించింది. ఫ్లిప్‌కార్ట్ కూడా దూకుడుగా ముందుకెళుతోంది.

# పీఎఫ్ డబ్బులు తీసుకునే కష్టాలకు చెక్.. యూపీఐ పిన్ ఎంటర్ చేస్తే డబ్బులు




దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 8 కోట్ల మంది ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఇఖఈూ) సభ్యులకు కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పేందుకు రెడీ అయింది. పీఎఫ్ ఖాతాల నుంచి డబ్బులు ఉపసంహరించుకునే ప్రక్రియను మరింత వేగవంతం, సులభతరం చేయాలనే లక్ష్యంతో యూపీఐ ఆధారిత విత్‌డ్రా విధానాన్ని ప్రవేశప కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ కొత్త విధానం 2026 ఏప్రిల్ నాటికి అమల్లోకి రానుంది. ప్రస్తుతం ఈపీఎఫ్ ఖాతా నుంచి డబ్బులు తీసుకోవాలంటే క్లెయిమ్ ఫారమ్‌లు సమర్పించడం, ఆధార్-బ్యాంకు లింకింగ్, ధృవీకరణ వంటి అనేక దశలను పూర్తి చేయాల్సి వస్తోంది. ఈ ప్రక్రియకు సాధారణంగా కొన్ని రోజులు, కొన్ని సందర్భాల్లో వారాలు కూడా పడుతోంది. అయితే యూపీఐ ఆధారిత వ్యవస్థ అమల్లోకి వస్తే ఈ మొత్తం ప్రక్రియ చాలా సులభంగా మారనుంది. సభ్యులు తమ పీఎఫ్ ఖాతాకు అనుసంధానమైన బ్యాంకు ఖాతాకు యూపీఐ పిన్ ఉపయోగించి నేరుగా డబ్బులు బదిలీ చేసుకునే అవకాశం ఉంటుంది. ఈ కొత్త విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి ఈపీఎఫ్‌వో ప్రస్తుతం తన ఐటీ మౌలిక సదుపాయాల్లో కీలక మార్పులు చేస్తోంది. అవసరమైన సాఫ్ట్‌వేర్ అప్‌డేట్స్, భద్రతా ప్రమాణాల అమలు, బ్యాంకులు-యూపీఐ నెట్‌వర్క్‌తో సమన్వయం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. దీని వల్ల పీఎఫ్ క్లెయిమ్‌ల ప్రాసెసింగ్ సమయం గణనీయంగా తగ్గే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే ఈపీఎఫ్‌వో ఆటో-సెటిల్‌మెంట్ విధానాన్ని ప్రవేశపెట్టి సభ్యులకు మరింత సౌలభ్యం కల్పిస్తోంది. అనారోగ్యం, విద్య, వివాహం, గృహ నిర్మాణం వంటి అవసరాల కోసం చేసే పాక్షిక ఉపసంహరణ క్లెయిమ్‌లను మూడురోజుల్లోనే పరిష్కరిస్తున్నారు. ఈ విధానంలో గరిష్ట పరిమితిని గతంలో ఉన్న రూ.1 లక్ష నుంచి రూ.5 లక్షలకు పెంచడం ద్వారా సభ్యులకు మరింత ఆర్థిక స్వేచ్ఛను కల్పించారు. అలాగే.. పీఎఫ్ పాక్షిక ఉపసంహరణ నిబంధనలను కూడా ఈపీఎఫ్‌వో సరళీకరించింది. గతంలో ఉన్న 13 సంక్లిష్ట నియమాలను తొలగించి, వాటిని మూడు సులభమైన కేటగిరీలుగా విభజించింది. దీని వల్ల సభ్యులు తాము అర్హత కలిగిన మొత్తాన్ని సులభంగా అర్థం చేసుకుని విత్‌డ్రా చేసుకునే అవకాశం ఏర్పడింది. కొత్త నిబంధనల ప్రకారం.. సభ్యులు తమ ఇఖఈూ ఖాతాలో ఉన్న అర్హత బ్యాలెన్స్‌లో 100 శాతం వరకు ఉపసంహరించుకునే అవకాశం ఉంటుంది. అయితే, దీర్ఘకాలిక ఆర్థిక భద్రత దృష్ట్యా కనీసం 25 శాతం మొత్తాన్ని ఖాతాలో కొనసాగించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఎందుకంటే పీఎఫ్ ఖాతాపై ప్రస్తుతం 8.25 శాతం వడ్డీ రేటు వర్తిస్తుండటంతో పాటు చక్రవడ్డీ ప్రయోజనాలు కూడా అందుతాయి. యూపీఐ ఆధారిత సేవలు అందుబాటులోకి వస్తే ఈపీఎఫ్‌వో సేవలు బ్యాంకింగ్ స్థాయికి చేరుకుంటాయని అధికారులు భావిస్తున్నారు. ప్రతి సంవత్సరం వచ్చే 5 కోట్లకు పైగా పీఎఫ్ క్లెయిమ్‌ల ప్రాసెసింగ్ భారం కూడా గణనీయంగా తగ్గుతుందని అంచనా వేస్తున్నారు.

## మరింత వేగంగా ఫిర్యాదుల పరిష్కారం: ఆర్‌బిఐ




బ్యాంకింగ్ సేవల్లో ఎదురయ్యే సమస్యలు, ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను మరింత సమర్థంగా, వేగంగా మార్చేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. బ్యాంకులతో పాటు, ఇతర నియంత్రిత సంస్థల ఖాతాదారుల ప్రయోజనాలు కాపాడటమే లక్ష్యంగా 'రిజర్వ్ బ్యాంక్-సమగ్ర అంబుడ్స్‌మన్ పథకం -2026'ను తీసుకురానుంది. ఇందు కోసం 'రిజర్వ్ బ్యాంక్- అంబుడ్స్‌మన్ స్కీం 2025'కు కొన్ని సవరణలతో ముసాయిదాను శుక్రవారం విడుదల చేసి, ప్రజల అభిప్రాయాలు కోరింది. ఇవి కూడా వచ్చాక, క్రోడీకరించి, నిబంధనలు ఖరారు చేస్తుంది. కొత్త పథకం 2026 జులై 1 నుంచి అమల్లోకి రానుంది. ఫిర్యాదిదారులకు తక్కువ ఖర్చుతో, వేగవంతమైన పరిష్కారాన్ని అందించడమే దీని ప్రధాన లక్ష్యమని ఆర్‌బీఐ పేర్కొంది. విచారణలు క్లుప్తంగా ఉంటాయని, ఇవి సాధారణ సాక్ష్యాధారాల నిబంధనలకు లోబడి ఉండవని స్పష్టం చేసింది. ఈ బాధ్యతలను నిర్వహించేందుకు ఆర్‌బీఐ తన అధికారుల నుంచి ఒకరు లేదా అంతకంటే ఎక్కువమందిని ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్, ఆర్‌బీఐ డిప్యూటీ అంబుడ్స్‌మన్‌లుగా నియమిస్తుంది. సాధారణంగా వీరి నియామక కాలపరిమితి ఒకేసారి మూడేళ్ల వరకు ఉంటుంది. ఫిర్యాదుల స్వీకరణ, పరిశీలన కోసం ఆర్‌బీఐ ఒకటి లేదా పలు చోట్ల సీఆర్‌పీసీ (సెంట్రలైజ్డ్ రిసీప్ట్ అండ్ ప్రాసెసింగ్ సెంటర్)లు ఏర్పాటు చేయనుంది. వినియోగదారులు తమ ఫిర్యాదులను ఆన్‌లైన్ ద్వారా సులభంగా సమర్పించే వీలుంటుంది. నూతన విధానంలో వివాదానికి సంబంధించిన మొత్తంపై గరిష్ఠ పరిమితి విధించలేదు. అంబుడ్స్‌మన్ లేదా డిప్యూటీ అంబుడ్స్‌మన్ ఆ వివాదాలపై రాజీ కుదర్చడం లేదా తగిన తీర్పు (అవార్డు) ఇవ్వడం ద్వారా సమస్యను పరిష్కరిస్తారు. ఖాతాదారులకు కలిగిన నష్టానికి సంబంధించి, గరిష్ఠంగా రూ.30 లక్షల వరకు పరిహారం చెల్లించాలని ఆదేశించే అధికారం అంబుడ్స్‌మన్‌కు ఉంటుంది. దీనికి అదనంగా మరో రూ.3 లక్షల వరకు పరిహారం అందించే వీలుందని ఆర్‌బీఐ వెల్లడించింది.

# లానింగ్, లిచ్‌ఫీల్డ్ మెరుపులు.. ముంబై ముందు భారీ టార్గెట్




మహిళల ప్రీమియర్ లీగ్ -2026లో భాగంగా నవీ ముంబై వేదికగా ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో యూపీవారియర్స్ బ్యాటర్లు మెరిశారు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన యూపీ వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది. ముఖ్యంగా యూపీ కెప్టెన్ మెగ్ లానింగ్ విధ్వంసం సృష్టించింది. ఈ ఆసీస్ లెజెండ్ ముంబై బౌలర్లను ఉతికారేసింది. కేవలం 45 బంతులు మాత్రమే ఎదుర్కొన్న లానింగ్ 11 ఫోర్లు, 2 సిక్స్‌లతో 70 పరుగులు చేసింది. ఆమెతో పాటు ఫీభీ లిచ్‌ఫీల్డ్ మెరుపులు మెరిపించింది. 37 బంతుల్లో7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 61 పరుగులు చేసింది. ఆఖరిలో హర్లీన్ డియోల్(25), ట్రయాన్(21) రాణించారు. ముంబై బౌలర్లలో అమీలియా కేర్ మూడు వికెట్లు పడగొట్టగా.. ట్ స్కివర్ బ్రంట్ రెండు, హేలీ మాథ్యూస్, అమన్‌జ్యోత్ కౌర్ తలా వికెట్ సాధించారు.

**తుది జట్లు**

యూపీ వారియర్జ్: కిరణ్ నవ్‌గిరే, మెగ్ లానింగ్ (కెప్టెన్), ఫోబ్ లిచ్‌ఫీల్డ్, హర్లీన్ డియోల్, శ్వేతా సెహ్రావత్ (వికెట్ కీపర్), క్లో ట్రయాన్, దీప్తి శర్మ, సోఫీ ఎక్లెస్టోన్, ఆశా శోభనా జాయ్, శిఖా పాండే, క్రాంతి గౌడ్

ముంబై ఇండియన్స్: హేలీ మాథ్యూస్, గుణాలన్ కమలిని(వికెట్ కీపర్), అమేలియా కెర్, నాట్ స్కివర్-బ్రంట్, హర్మన్‌ప్రీత్ కౌర్(కెప్టెన్), అమంజోత్ కౌర్, నికోలా కారీ, సజీవన్ సజన, సంస్కృతి గుప్తా, నల్లా క్రాంతి రెడ్డి, త్రివేణి వశిష్ట

## యూపీతో మ్యాచ్.. ముంబై తరపున తెలుగు అమ్మాయి అరంగేట్రం




మహిళల ప్రీమియర్ లీగ్-2026లో హైవోల్టేజ్ మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. ఈ టోర్నీలో భాగంగా నవీ ముంబై వేదికగా ముంబై ఇండియన్స్, యూపీ వారియర్స్ జట్లు తలపడుతున్నాయి. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ముంబై కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ అమ్మాయి నల్లా క్రాంతి రెడ్డి ముంబై ఇండియన్స్ తరపున అరంగేట్రం చేసింది. అదేవిధంగా స్టార్ పేసర్ ఇస్మాయిల్‌కు ముంబై విశ్రాంతి ఇచ్చింది. ఆమె స్థానంలో హేలీ మాథ్యూస్ తుది జట్టులోకి వచ్చింది. యూపీ మాత్రం ఎటువంటి మార్పులు చేయలేదు. కాగా యూపీ వారియర్స్ తమ చివరి మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌ను 7 వికెట్ల తేడాతో చిత్తు చేసింది. ఇప్పుడు అదే జోరును ఈ మ్యాచ్‌లో కూడా కొనసాగించాలని లానింగ్ సేన ఉవ్విళ్లూరుతోంది.

**తుది జట్లు**

యూపీ వారియర్జ్: కిరణ్ నవ్‌గిరే, మెగ్ లానింగ్ (కెప్టెన్), ఫోబ్ లిచ్‌ఫీల్డ్, హర్లీన్ డియోల్, శ్వేతా సెహ్రావత్ (వికెట్ కీపర్), క్లో ట్రయాన్, దీప్తి శర్మ, సోఫీ ఎక్లెస్టోన్, ఆశా శోభనా జాయ్, శిఖా పాండే, క్రాంతి గౌడ్

ముంబై ఇండియన్స్: హేలీ మాథ్యూస్, గుణాలన్ కమలిని(వికెట్ కీపర్), అమేలియా కెర్, నాట్ స్కివర్-బ్రంట్, హర్మన్‌ప్రీత్ కౌర్(కెప్టెన్), అమంజోత్ కౌర్, నికోలా కారీ, సజీవన్ సజన, సంస్కృతి గుప్తా, నల్లా క్రాంతి రెడ్డి, త్రివేణి వశిష్ట

# స్పోర్ట్స్

## కివీస్‌తో మ్యాచ్ వరల్డ్ ఫైనల్ వంటిది: మహ్మద్ సిరాజ్




న్యూజిలాండ్‌తో ఆదివారం ఇండోర్ వేదికగా సిరీస్ డిసైడర్ మూడో వన్డేలో తాడో పేడో తెల్చుకోవడానికి భారత్ సిద్ధమైంది. ఈ మ్యాచ్‌లో ఎలాగైనా గెలిచి సిరీస్‌ను సొంతం చేసుకోవాలని టీమిండియా భావిస్తుంటే.. మరోవైపు కివీస్ కూడా భారత గడ్డపై మరోసారి చరిత్ర సృష్టించాలని పట్టుదలతో ఉంది. ఈ నేపథ్యంలో టీమిండియా స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ఈ సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్‌ను వరల్డ్‌కప్ ఫైనల్‌లా భావిస్తున్నామని సిరాజ్ చెప్పుకొచ్చాడు. కాగా ఈ సిరీస్‌లో రెండు జట్లు సమవుజ్జీలగా ఉన్నాయి. గత పర్యటన మాదిరిగానే భారత జట్టుకు కివీస్ గట్టీ పోటీ ఇస్తుంది. అందుకే సిరాజ్ ఆఖరి వన్డేను ప్రపంచకప్ ఫైనల్‌తో పోల్చాడు. భారత్‌లో మాకు ఇటువంటి పరిస్థితులు చాలా అరుదుగా ఎదురవుతుంటాయి. మొన్న సౌతాఫ్రికా, నేడు న్యూజిలాండ్. చివరి మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను సొంతం చేసుకునేందుకు ప్రయత్నిస్తాము. ఈ మ్యాచ్ మాకు దాదాపు ప్రపంచ కప్ ఫైనల్ లాంటిది. జట్టులోని సీనియర్లు యువ ఆటగాళ్లకు చాలా మద్దతుగా ఉన్నారు. వారు నుంచి మాకు సలహాలు, సూచనలు అందుతున్నాయి. దీంతో డ్రెసింగ్ రూమ్ వాతావరణం చాలా బాగుంది. మేము మొదటి మ్యాచ్ గెలిచాం. దురదృష్టవశాత్తూ రెండో వన్డేలో ఓడిపోయాం. కాబట్టి ఇప్పుడు మాపై కాస్త ఒత్తిడి ఉంది. రాజ్‌కోట్ వన్డేలో డారిల్ మిచెల్ అవుట్ చేసేందుకు అన్ని విధాలంగా ప్రయాత్నించాము. కానీ ఒక క్యాచ్ డ్రాప్ కావడం వల్ల మ్యాచ్ పరిస్థితి మారిపోయింది. అతడు స్పిన్‌ను ఎదుర్కొనే తీరు, సింగిల్స్ తీస్తూ బౌలర్లపై ఒత్తిడి పెంచే విధానం నిజంగా అద్భుతం. మా బౌలింగ్ గురుంచి ఎలాంటి ఆందోళన లేదు. జట్టులో ప్రతీ ఒక్కరు పాజిటివ్ మైండ్‌తో ఉన్నారు. సిరీస్ డిసైడర్‌లో తప్పక గెలుస్తాము“ అని సిరాజ్ ప్రీ మ్యాచ్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పేర్కొన్నాడు. కాగా రెండో వన్డేలో 7 వికెట్ల తేడాతో భారత్ ఓటమి పాలైన సంగతి తెలిసిందే.

ధర్మఘంట

# ప్రేమలో ‘రుక్మిణి వసంత్‘.. అతను ఎవరో తెలుసా? ట్రెండింగ్‌లో ఫోటో



కన్నడ బ్యూటీ రుక్మిణి వసంత్ ప్రేమలో ఉన్నట్లు సోషల్‌మీడియాలో వైరల్ అవుతుంది. ఈమేరకు పలు వెబ్‌సైట్లు కూడా నిజమేనంటూ పలు ఫోటోలను షేర్ చేస్తున్నాయి. అయితే, ఇందులో ఎంతమాత్రం నిజమనేది తెలియాలంటే ఈ బ్యూటీ వివరణ ఇస్తే తేలుతుంది. నెట్టింట ఇలాంటి వార్తలు సహజంగానే కనిపిస్తూ ఉంటాయి. అయితే, ఫైనల్‌గా వాటిలో కొన్ని నిజం అయిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ క్రమంలోనే రుక్మిణి వసంత్ లవ్ ట్రాక్ గురించి ట్రెండ్ అవుతుంది. కాంతార సినిమాతో పాన్ ఇండియా రేంజ్‌కు రుక్మిణి చేరుకుంది. దీంతో యశ్ భారీ బడ్జెట్ మూవీ టాక్సిక్‌లో కూడా ఆమె భాగమైంది. ఆపై ఎన్టీఆర్– ప్రశాంత్ నీల్ మూవీతో పాటు పలు ప్రాజెక్ట్‌లు లైన్‌లో ఉన్నాయి. ఇలాంటి సమయంలో రుక్మిణి తన ప్రాణ స్నేహితుడు సిద్ధాంత్‌తో డేటింగ్ చేస్తోందని సోషల్‌మీడియాలో వైరల్ అవుతుంది. అతనొక పాపులర్ ఫోటోగ్రాఫర్ అని కూడా ప్రచారంలో ఉంది. వారిద్దరి ఫోటోలు ఇంటర్నెట్‌లో వైరల్ అవుతున్నాయి. కానీ, ఈ అంశం గురించి వారిలో ఎవరూ స్పందించలేదు. సోషల్ మీడియాలో ధృవీకరించని ఇలాంటి పుకార్లు వైరల్ అవుతూనే ఉంటాయి. చాలా సార్లు, అవి నిజమవుతున్నాయి. కొన్నిసార్లు, అవి అబద్ధాలుగా మిగిలిపోవచ్చు కూడా.. ప్రస్తుతానికి, కొనసాగుతున్న ఈ రూమర్ నిజమో కాదో స్పష్టత లేదు.

# ఓటీటీలో ‘సుదీప్‘ యాక్షన్ సినిమా.. తెలుగులో స్ట్రీమింగ్



కన్నడ స్టార్ హీరో ‘కిచ్చా‘ సుదీప్ హీరోగా నటించిన యాక్షన్ థ్రిల్లర్ ఫిల్మ్ ‘మార్క్‘. గతేడాదిలో క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న ఈ మూవీ విడుదలైంది. అయితే, తాజాగా ఓటీటీ విడులపై అధికారికంగా ప్రకటించారు. ఇందులో ముఖ్య పాత్రల్లో నటుడు నవీన్ చంద్ర, యోగిబాబు, గురు సోమసుందరం, విక్రాంత్ తదితరులు నటించారు. క్రిస్మస్ సమయంలో తెలుగు సినిమాలు భారీ సంఖ్యలు విడుదలయ్యాయి. దీంతో ఈ మూవీకి తెలుగులో థియేటర్స్ కొరత ఏర్పడింది. దర్శకుడు విజయ్ కార్తికేయ తెరకెక్కించిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద మెప్పించింది. మార్క్ సినిమా జనవరి 23న జియోహాట్‌స్టార్ లో విడుదల కానున్నట్లు మేకర్స్ ప్రకటించారు. తెలుగుతో పాటు కన్నడ, తమిళ్, మలయాళం, హిందీలో స్ట్రీమింగ్ కానుంది. ఈ మూవీలో సుదీప్ స్క్రీన్ ప్రెజెన్స్, స్టైల్, యాక్షన్ సీక్వెన్స్‌లలో తన నటన హైలైట్ అని రివ్యూలు వచ్చాయి. యాక్షన్ సన్నివేశాలు స్టైలిష్‌గా, ఎనర్జిటిక్‌గా ఉన్నాయన్నారు. కథ చాలా బలహీనంగా ఉండటం.. ఆపై ఊహించదగిన ట్విస్టులతో కాస్త నిరాశపరిచిందని విమర్శలు వచ్చాయి. యాక్షన్ సినిమాలు ఇష్టపడేవారిని మాత్రం మ్యాక్స్ ఆకట్టుకుంటాడని చెప్పొచ్చు.

# కామెడీ స్క్రిప్టులు రావడం లేదట.. నిరాశలో శివకార్తికేయన్



తెలుగు, తమిళంతోపాటు పాన్ ఇండియా స్థాయిలో మంచి గుర్తింపు పొందిన యాక్టర్లలో టాప్‌లో ఉంటాడు కోలీవుడ్ స్టార్ యాక్టర్ శివకార్తికేయన్. ఈ టాలెంటెడ్ యాక్టర్ ఇటీవలే పరాశక్తి సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు . సుధా కొంగర డైరెక్ట్ చేసిన ఈ మూవీ ఊహించని విధంగా ఫ్లాప్ టాక్ మూటగట్టుకుంది. సినిమాలో వినోదం మిస్సయిందని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. శివకార్తికేయన్ ఓ విషయంలో చాలా నిరాశ చెందుతున్నట్టు చెప్పాడు. ఓ ఇంటర్వ్యూలో శివకార్తికేయన్ మాట్లాడుతూ.. ఒక్క డైరెక్టర్ కూడా కామెడీ స్క్రిప్టులతో తన దగ్గరకు రావడం లేదన్నాడు. ఈ రోజుల్లో నా దగ్గరకు కామెడీ స్క్రిప్టులు రావడం లేదు. ప్రతీ ఒక్కరూ నన్ను కామెడీ సినిమాలు ఎందుకు చేయడం లేదని అడుగుతున్నారు. కానీ ఒక్క డైరెక్టర్ కూడా సరైన కామెడీ స్క్రిప్ట్‌ను తన వద్దకు తీసుకురావడం లేదని అన్నాడు. దీనికి బడ్జెట్‌తోపాటు చాలా కారణాలు ఉంటాయి. కానీ నెక్ట్స్ సినిమా మాత్రం పక్కా ఎంటర్‌టైనర్‌గా వినోదాన్ని అందిస్తుందన్నాడు శివకార్తికేయన్. పరాశక్తి, అమరన్ నాలోని విభిన్న కోణాలను చూపించాయి. అయినప్పటికీ కామెడీ ఎంటర్‌టైనర్లను చేయడాన్ని మిస్ అవుతున్నా. దురదృష్టవశాత్తు ఎవరూ కూడా నాకు పూర్తిస్థాయి కామెడీ స్క్రిప్ట్‌ను వినిపించలేదని చెప్పుకొచ్చాడు శివకార్తికేయన్. ఓ వైపు కామెడీ కథలు రావడం లేదని చెబుతూనే.. మరోవైపు తాను అభిమానులకు కావాల్సిన వినోదాన్ని అందించేందుకు రెడీగా ఉన్నానని చెప్పకనే చెబుతున్నాడు. ఇప్పుడీ కామెంట్స్ అభిమానులు, మూవీ లవర్స్‌ను ఖుషీ చేస్తున్నాయి.

# ఓటీటీలోకి ధనుష్ ‘తేరే ఇష్క్ మే’.. స్ట్రీమింగ్ ఎక్కడంటే?

కోలీవుడ్ స్టార్ ధనుష్, బాలీవుడ్ బ్యూటీ కృతి సనన్ జంటగా నటించిన మ్యూజికల్ రొమాంటిక్ డ్రామా ‘తేరే ఇష్క్ మే’ ఇప్పుడు డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. గత ఏడాది నవంబర్ 28న థియేటర్లలో విడుదలైన ఈ హిందీ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను సాధించింది. అయితే ఇప్పుడు ఓటీటీ ప్రియులను అలరించేందుకు వచ్చేస్తోంది. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా డిజిటల్ హక్కులను భారీ ధరకు సొంతం చేసుకుంది. ఈ చిత్రం ఈ నెల 23 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో హిందీతో పాటు తమిళం, తెలుగు భాషల్లో అందుబాటులోకి రాబోతుంది. గతంలో ధనుష్‌తో ‘రాంఝనా’, ‘అత్రంగి రే’ వంటి సూపర్ హిట్ చిత్రాలను తెరకెక్కించిన స్టార్ డైరెక్టర్ ఆనంద్ ఎల్. రాయ్ ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో ధనుష్ ఎయిర్‌ఫోర్స్ అధికారిగా నటించగా, ఒక సైకాలజీ స్టూడెంట్‌గా కృతి సనన్ మెప్పించారు. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ ఈ చిత్రానికి అందించిన అద్భుతమైన సంగీతం మరో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. సుమారు 95 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద 150 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి ధనుష్ క్రేజ్‌ను మరోసారి చాటిచెప్పింది.




# వెటకారంతో కూడిన బెస్ట్ ఫ్రెండ్ సునీల్: రవితేజ



సునీల్ కామెడీ అంటే నాకు చాలా ఇష్టం. కానీ ఈ మధ్య కామెడీ వదిలే వేరే జోనర్‌లో వెళ్లాడు. మళ్లీ భర్త మహాశయులు సినిమాతో కామెడీ వైపు వచ్చాడు. సినిమా చూసినవాళ్లు అంతా సునీల్ కామెడీ గురించి మాట్లాడుతున్నారు. దుబాయ్ శ్రీను తర్వాత బాగా ఎంజాయ్ చేసిన సినిమా ఇది. అప్పుడప్పుడైనా సునీల్ కామెడీ సినిమాలు చేయాలని కోరుకుంటున్నా’ అని అన్నారు మాస్ మహారాజా రవితేజ. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం భర్త మహాశయులకు విజ్ఞప్తి. ఈ నెల 13న విడుదలైన ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి టాక్ లభించింది. శనివారం హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ హోటల్‌లో సినిమా సక్సెస్ మీట్‌ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సునీల్‌తో తనకున్న అనుబంధాన్ని రవితేజ పంచుకున్నాడు. ‘సునీల్, నేను మంచి స్నేహితులం. ఓ రకంగా చెప్పాలంటే.. వెతకారంతో కూడిన బెస్ట్ ఫ్రెండ్ నాకు. మా అమ్మ, వాళ్ల అమ్మ మంచి స్నేహితులు. వాళ్ల నుంచే మాకు వెతకారం వచ్చింది(నవ్వుతూ..) ’ అన్నారు. ఇక సునీల్ కూడా రవితేజ గురించి మాట్లాడుతూ.. ‘షూటింగ్ లేకున్నా సరే నేను కలిసే ఏకైక హీరో రవితేజ. చాలా మంచి వ్యక్తి. ఆయన ఎనర్జీ నెక్ట్ లెవల్’ అన్నారు.

Printed, Published, Owned by & Editor: MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, Published From SPOORTHI PUBLICATIONS,
# : 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Telangana - 508001, # : F-7, Cherukuri Mini Towers, Road No.4, Jadges colony, Vanasthalipuram, Hyderabad-500070.
epaper.dharmaganta.com, www.dharmaganta.com, dharmagantasp@gmail.com, +919440994108, +919885826108, +919440828108

# భారతీయ విద్యా వ్యవస్థ ఆధునిక పరిస్థితులు మరియు మార్పులు

భారతదేశ విద్యా వ్యవస్థ గత కొన్ని దశాబ్దాలలో గణనీయమైన మార్పులను చవిచూసింది.2026 లో దేశంలోని 260 మిలియన్లకు పైగా విద్యార్థులను ప్రభావితం చేస్తున్న డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ మరియు నైపుణ్య-కేంద్రీకృత విద్యా విధానాలు ముఖ్యమైనవి కనిపిస్తున్నాయి.జాతీయ విద్యా విధానం (నెప్) 2020 ద్వారా ప్రారంభమైన ఈ మార్పులు, కోవిడ్-19అమహమ్మారి తర్వాత మరింత వేగవంతమయ్యాయి. అయితే,భారతీయ విద్యా వ్యవస్థ యొక్క ప్రస్తుత స్థితి,ఇటీవలి మార్పులు మరియు భవిష్యత్ సవాళ్లను పరిశీలిస్తే...2026లో భారత విద్యా వ్యవస్థ డిజిటల్ ఇంటిగ్రేషన్ మరియు వ్యక్తిగతీకరణపై దృష్టి సారించింది.ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత విద్య వరకు, టెక్నాలజీ-ఆధారిత లెర్నింగ్ మరియు కాంపిటెన్సీ-బేస్డ్ ఎడ్యుకేషన్ ప్రధానమైనవిగా ఉన్నాయి.దీనికి అనుగుణంగా గ్రాస్ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జీఈఆర్) ఉన్నత విద్యలో 28-30% నుండి 50%కి పెంచాలని నెప్ లక్ష్యంగా పెట్టుకుంది.అయితే,ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లోపాలు,టీచర్ ట్రైనింగ్ లోపాలు మరియు డ్రాప్‌ఔట్ రేట్లు వంటి అనేక సవాళ్లతో కూడిన ప్రస్తుత పరిస్థితి ఆందోళనకు గురిచేస్తుంది.వాటిని అధిగమించేందుకు చేపట్టే చర్యలు,భవిష్యత్ పరిణామాల అమలులో మార్పులకు గురయ్యే ఛాన్స్ ఉండొచ్చు.ఇదిలా ఉంటే ప్రాథమిక విద్యలో సర్వ శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ద్వారా 6-14 సంవత్సరాల వయస్సు పిల్లలకు యూనివర్సల్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ సాధించబడింది.రైట్ టు ఎడ్యుకేషన్ (ఆర్టీఈ) యాక్ట్ 2009 ద్వారా ప్రాథమిక స్థాయిలో ఎన్‌రోల్‌మెంట్ 95%కి మించింది. అయినా ఉన్నత విద్యలో ప్రైవేట్ యూనివర్సిటీలు విస్తరణ మరియు డెరెగ్యులేషన్ లో ముఖ్యమైన పాత్రను పోషిస్తున్నాయి.



**ఇటీవలి మార్పులు మరియు సంస్కరణలు**

ఎన్ఈపీ (నెప్)2020 అనేది భారత విద్యా వ్యవస్థలో అతి ముఖ్యమైన సంస్కరణ.ఇది 10+2 నిర్మాణాన్ని 5+3+3+4గా మార్చింది.ఇందులో 3-18 సంవత్సరాల వయస్సు పిల్లలకు ఫౌండేషనల్ స్టేజ్,ప్రిపరేటరీ స్టేజ్, మిడిల్ స్టేజ్ మరియు సెకండరీ స్టేజ్ ఉన్నాయి.2026లో 9-12 గ్రేడ్‌లకు కొత్త టెక్స్ట్‌బుక్‌లు పరిచయం చేయబడతాయి.ఇవి నేషనల్ కరిక్యులమ్ ఫ్రేమ్‌వర్క్‌కు అనుగుణంగా ఉంటాయి. వొకేషనల్ ట్రైనింగ్‌ను 6వ,తరగతి నుండి ప్రారంభించడం,డిజిటల్ ఎడ్యుకేషన్ ప్రోత్సాహం మరియు రీసెర్చ్ యూనివర్సిటీల స్థాపనలు ముఖ్యమైనవిగా చూడాలి. ఉన్నత విద్యలో మల్టీడిసిప్లినరీ యూనివర్సిటీలు,ఆటానమీ మరియు అక్రెడిటేషన్ సంస్కరణలు 2026లో మరింత స్పష్టంగా కనిపిస్తాయి.అదే సమయంలో ఏఐ-ఎనేబుల్డ్ టూల్స్,బ్లెండెడ్ లెర్నింగ్ మరియు ప్రాజెక్ట్-బేస్డ్ అప్రోచ్‌లు మెయిన్‌స్ట్రీమ్ అవుతున్నాయి. అంతర్జాతీయ విద్యార్థులను ఆకర్షించడానికి విశ్వ బంధు స్కాలర్‌షిప్ మరియు ఫెలోషిప్ స్కీమ్‌లు ప్రతిపాదించబడ్డాయి. 2047 నాటికి 1.1 మిలియన్ అంతర్జాతీయ విద్యార్థులను హోస్ట్ చేయాలని లక్ష్యంగా ఈ ప్రోగ్రాం రూపుదిద్దుకుంటుంది.

**ప్రస్తుత సవాళ్లు-భవిష్యత్ అంచనాలు**

అయితే,ఈ మార్పులు ఉన్నప్పటికీ,ఔట్‌డేటెడ్ కరిక్యులమ్,ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లోపాలు మరియు టీచర్ ట్రైనింగ్ సమస్యలు ఇంకా ఉన్నాయి.రోట్ లెర్నింగ్‌ను తగ్గించి,కాన్సెప్ట్యువల్ లెర్నింగ్‌ను ప్రోత్సహించడం వంటి అవసరం తప్పనిసరి అయినా చేంజ్ ఫెటీగ్ మరియు ఇంక్లూజన్ సమస్యలు స్కూల్స్‌ను ప్రభావితం చేస్తున్నాయి.2026 లో విద్యా వ్యవస్థ మరింత పర్సనలైజ్డ్,ఏఐ- ఆధారిత మరియు స్కిల్-బేస్డ్‌గా మారుతుంది.ఫౌండేషనల్ లిటరసీ మరియు న్యూమరసీపై దృష్టి,ఇంక్లూసివ్ ఎడ్యుకేషన్ మరియు గ్లోబల్ కాంపిటెన్సీలు ముఖ్యమైనవిగా చూడాలి.హయ్యర్ ఎడ్యుకేషన్‌లో హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా బిల్ 2025 ద్వారా రెగ్యులేటరీ రిఫార్మ్‌లు జరిగితే, భారతీయ విద్యా వ్యవస్థ ఆధునికీకరణ దిశగా ముందుకు సాగుతోంది.కానీ,సమర్థవంతమైన అమలు మరియు సవాళ్ల పరిష్కారం అవసరం ఎంతైనా ఉంది.నెప్ 2020 ద్వారా ప్రారంభమైన మార్పులు దేశ యువతను సాధికారికంగా మార్చగలవు,భవిష్యత్‌లో భారతదేశాన్ని గ్లోబల్ ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తాయని అంచనాలు ఉన్నాయి.కానీ,సరైన విధానంలో అమలు చేయడంలో చిత్తశుద్ధి విస్మరణకు గురైతే, ప్రస్తుత పరిస్థితిలో పెద్దగా మార్పు ఉండకపోతే,భవిష్యత్ అంచనాలు ప్రభావంతంగా ఉండకపోవచ్చు.

గంట సోమన్న,సీనియర్ జర్నలిస్ట్.

# మున్సిపల్ ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థులను గెలిపించండి

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడేది కమ్యూనిస్టులే

ప్రశ్నించే గొంతులకు పట్టం కట్టండి

కలిసివచ్చే లౌకిక శక్తులతో కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తాం

సిపిఎం సూర్యాపేట జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి



**ధర్మఘంట జనవరి 17 సూర్యాపేట:** రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం సూర్యాపేట జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్ లో జరిగిన సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గం సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న మున్సిపల్ ఎన్నికల్లో నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్వహించే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు.సిపిఎం అభ్యర్థులు గెలిస్తే ప్రజా సమస్యలపై మున్సిపల్ కౌన్సిల్ లో పోరాటం చేస్తారని, వార్డులలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం పాలకవర్గంపై ఒత్తిడి తీసుకువచ్చి వార్డుల అభివృద్ధికి కృషి చేస్తారని అన్నారు.ఎలాంటి అవినీతి లేకుండా సుపరిపాలన కమ్యూనిస్టులు అందిస్తారని అన్నారు.గతంలో సిపిఎం తరపున ఎన్నికైన కౌన్సిలర్ లు నీతిగా,నిజాయితీగా పాలన కొనసాగించారని గుర్తు చేశారు. ఈ ఎన్నికల్లో కలిసివచ్చే లౌకిక పార్టీలను కలుపుకొని 5 మున్సిపాలిటీలలో పోటీ చేస్తామన్నారు.పార్టీ కార్యకర్తలు మున్సిపల్ ఎన్నికలకు సిద్ధం కావాలని కోరారు.సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పారేపల్లి శేఖర్ రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు,కొలిశెట్టి యాదగిరిరావు,సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగారపు పాండు,మట్టిపెల్లి సైదులు,చెరుకు ఏకలక్ష్మి పాల్గొన్నారు.

# జిడికే 2 ఇంక్లైన్ గేట్ మీటింగ్ కి హాజరైన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

## అపూర్వ స్వాగతం పలికిన కార్మిక వర్గం





ధర్మఘంట జనవరి 17 రామగుండం

జీడీకే 2 ఇంక్లైన్ లో రాజ్ ఠాకూర్ టీమ్ శనివారం ఏర్పాటు చేసిన గని కార్మికుల ఆత్మీయ పలకరింపు కార్యక్రమానికి వచ్చిన రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ కు 2ఏ గని కార్మికులు 2ఏ మోరి నుండి బైక్ ర్యాలీతో బాణాసంచా పేలుస్తూ డిజె సౌండ్ కోలాటంతో ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం అర్జీ1 ఏరియా జీఎం.లలిత్ కుమార్ అధికార బృందంతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి అమ్మవారి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతు మీ ప్రేమ ఆప్యాయత మీరు స్వాగతం పలికిన విధానం చూస్తుంటే నాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు.మీరు ఆనాడు నన్ను గెలిపించి ఎమ్మెల్యేగా అసెంబ్లీ పంపితే కార్మికుని రూపంలో వెళ్లి మీ ఋణం తీర్చుకున్నానని,రామగుండం ప్రాంతంను గతంలో బొందల గడ్డ చేసిన ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమని,కానీ,ఈరోజు మీ అందరి సహకారంతో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎంతో అభివృద్ధి చేస్తూ ముందుకు పోతున్నానని చెప్పారు.నేను అసెంబ్లీలో ఇప్పటికి 27సార్లు మాట్లాడే అవకాశం వచ్చిందని,మాట్లాడిన ప్రతిసారి సింగరేణి కార్మిక సమస్యలపై మాట్లాడడం జరిగిందన్నారు.నేను మాట ఇస్తున్న తప్పకుండా డిపెండెంట్ ఉద్యోగాలను కొనసాగిస్తామని, విజిలెన్స్ కేసులు,మారుపేర్ల సమస్యలకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందన్నారు. గతంలో మన సింగరేణి నిధులు సిద్దిపేట,సిరిసిల్ల, గజ్వేల్ లాంటి ప్రాంతాలకు ఖర్చుపెట్టినారని,మీ అందరి సహకారంతో ఆనిధులను ఇక్కడే ఖర్చు పెడుతూ ఈ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేస్తున్నమన్నారు.గుండె సంబంధిత వ్యాధుల కోసం క్యాతలాబ్ 60 రోజుల్లో ఏర్పాటు చేస్తామని,సింగరేణి కార్మికుల ప్రతి సమస్యకు ఇక నుండి మీ గని మీద యూనియన్లకు అతీతంగా రాజ్ ఠాకూర్ టీం పనిచేస్తుందన్నారు.రాజ్ ఠాకూర్ టీం సభ్యులు ప్రతి కార్మికునికి అండగా ఉంటారన్నారు. సింగరేణి కంపెనీని కాపాడవల్సిన బాధ్యత మన అందరి మీద ఉన్నదని,నేను మీకు అండగా ఉంటానని మాట ఇచ్చారు.మీటింగ్ అనంతరం క్యాంటిన్ లో ఉద్యోగులతో కలిసి టిఫిన్ చేస్తూ వారి యోగక్షేమలు తెలుసుకున్నారు.ఈ కార్యక్రమాన్ని రాజ్ ఠాకూర్ టీం సింగరేణి శ్రీనన్న,జనగామ శ్రీనివాస్,అరగంటి క్రిష్ణ,రసమళ్ళ కిరణ్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అధికారులు, యూనియన్ నాయకులు, మహిళా ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరు విజయవంతం చేశారు.

## శ్రీగంగమ్మ-కట్ట మైసమ్మ ఆలయ అభివృద్ధికి పాటుపడతా

**ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ**



ధర్మఘంట జనవరి 17 కరీంనగర్

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అల్గునూర్ గ్రామంలోని శ్రీగంగమ్మ-కట్ట మైసమ్మ ఆలయ అభివృద్ధికి పాటుపడతానని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఎస్డీఎఫ్ కింద 5 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన గంగమ్మ-కట్టమైసమ్మ గుడి ప్రహరీ గోడను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం 8వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తమ్మనవేణి రమేశ్ యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. గ్రామ ప్రజలు కూడా ఆలయ అభివృద్ధికి పాటుపడాలన్నారు. అంతేకాకుండా గ్రామానికి సంబంధించిన సమస్యలు తన దృష్టికి తీసుకు వస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.గ్రామ అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని ఆయన కోరారు.ఈకార్యక్రమంలో గంగమ్మ కట్టమైసమ్మ గుడి చైర్మన్ గోదుమ వెంకన్న,ధర్మకర్తలు పాశం బాలయ్య,వెంకర్ల నగేష్, జి.కుమార్,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్,మాజీ ఎంపీపీ శ్రీగిరి రంగారావు,పార్టీ జిల్లా కార్యాలయ ఇంచార్జి గోపు మల్లారెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు కంది లక్ష్మినారాయణరెడ్డి,కంది అశోక్ రెడ్డి,కాలువ మల్లేశం,కాత కొమురయ్య,చిందం కిష్టయ్య, దాసరి నాగేందర్,ముంజ శ్రీకాంత్, పాశం కిరణ్,ఐతం మహేశ్, నర్సింగాపూర్ సర్పంచ్ పెరుక రవీందర్,మహాత్మానగర్ సర్పంచ్ సంపత్,ఉప సర్పంచ్ ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా మున్సిపాలిటీ వార్డుల రిజర్వేషన్ ప్రక్రియ

**జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**





ధర్మఘంట జనవరి 17 సూర్యాపేట

జిల్లాలోని మున్సిపాలిటీ వార్డుల రిజర్వేషన్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు.జిల్లా సమీకృత కార్యాలయ సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో శనివారం సూర్యాపేట కోదాడ,హుజూర్ నగర్,నేరేడుచర్ల,తిరుమలగిరి మున్సిపాలిటీల పరిధిలోని 141 వార్డులకు కలెక్టర్ రిజర్వేషన్ ప్రక్రియను నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం మహిళలు, ఎస్సీ,ఎస్టీ,బీసీలకు వార్డుల వారీగా రిజర్వేషన్లు కేటాయించామని,గత ఎన్నికల రిజర్వేషన్,ఎస్టీ,ఎస్సీ,బీసీ జనాభా లెక్కలు,రొటేషన్ విధానం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి,ఎలాంటి పొరపాట్లకు అస్కారం లేకుండా రాజకీయ పార్టీ ప్రతినిధుల మధ్య రిజర్వేషన్లను పారదర్శకంగా ప్రకటించటం జరిగిందన్నారు.ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ కె.సీతారామారావు,మున్సిపల్ కమిషనర్లు హన్మంతరెడ్డి, రమాదేవి,శ్రీనివాస్ రెడ్డి,ఆశోక్ రెడ్డి,మున్వర్ పాషా,రాజకీయ పార్టీ ప్రతినిధులు,అధికారులు, సిబ్బంది హాజరయ్యారు.

## గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి

**మోత్కూర్ ఎంపీడీవో బాలాజీ**



ధర్మఘంట జనవరి 17 మోత్కూరు

గ్రామాల్లోని యువత క్రీడల్లో పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలని ఎంపీడీవో బాలాజీ అన్నారు.శనివారం యాదాద్రి జిల్లా మోత్కూర్ పట్టణంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సీఎం కప్ క్రీడోత్సవాల సందర్భంగా కాగడా ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 17 నుంచి 22 వరకు గ్రామపంచాయతీ స్థాయిలో వివిధ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మండల స్థాయి పోటీలకు ఎంపిక చేసి,జనవరి 28 నుంచి 31 వరకు నిర్వహించే మండల స్థాయి క్రీడోత్సవాల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తామని చెప్పారు.ఈ క్రీడా పోటీల నిర్వహణ బాధ్యతలను ఆయా పాఠశాలల పీడీలకు, పీఈటీలకు అప్పగించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పి.జ్యోతి,ఎంఈఓ సత్యనారాయణ,పీడీ రమణ, హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా

**బరాఖత్ గూడెం గ్రామ సర్పంచ్ చల్ల గురవయ్య**





ధర్మఘంట జనవరి 17 మునగాల

గ్రామాభివృద్ధి చేయటమే నా ధ్యేయమని బరాఖత్ గూడెం గ్రామ సర్పంచ్ చల్ల గురవయ్య అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా మునగాల మండలం బరాఖత్ గూడెం గ్రామ పంచాయితీ పరిధిలోని శ్రీనివాస నగర్ ఇందిరమ్మ కాలనీ వీధులలో పేరుకుపోయిన చెత్తను,కంప చెట్లను జెసిబి సహాయంతో శుభ్రం చేయించారు. త్వరలో ఈ కాలనీలోని వీధుల్లో మట్టి తొలించి,సీసీ రోడ్లు,డ్రైనేజీ పనులకు శ్రీకారం చుట్టడమే నా కర్తవ్యమని అన్నారు.అనేక సంవత్సరాలనుండి అభివృద్ధికి నోచుకోని కాలనీని అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు.ఈకార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి దేవరం శ్వేత,నాయకులు రాయిరాల సుమన్,బానోతు సురేష్,అంగోతు మోహన్ రాము, వట్టే నాగయ్య,గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్యాస్ ఏజెన్సీ రద్దుకు ఒక్క ఫిర్యాదు చాలు

**పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ డిటీ మాచన రఘునందన్**

ధర్మఘంట జనవరి 17 నల్లగొండ



గ్యాస్ సిలిండర్ సరఫరాలో అక్రమాలు ఉపేక్షించే ప్రసక్తే లేదని,గ్యాస్ డెలివరీ బాయ్ లపై క్రిమినల్ కేసులు నమోదు చేయడానికి కూడా వెనుకాడబోమని పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ డిటీ మాచన రఘునందన్ హెచ్చరించారు. గ్యాస్ సిలిండర్లకు అధిక వసూళ్లపై కొందరు వినియోగదారులు ఫిర్యాదు చేయగా శనివారం గ్యాస్ సరఫరా చేసే బండ్లను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్ల డోర్ డెలివరీకి అక్రమంగా అధికంగా వసూలు చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తానని హెచ్చరించారు.గ్యాస్ బండల సరఫరాలో కొందరు డెలివరీ బాయ్ లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు.అక్రమ వసూళ్లకు పాల్పడే వారిపై ఒక్కరు ఫిర్యాదు చేసినా చాలన్నారు.గ్యాస్ కు రశీదు కూడా ఇవ్వటం లేదన్న ఫిర్యాదులు అధికంగా ఉన్నాయని ఆక్షేపించారు.గ్యాస్ ఏజెన్సీ అనుమతి రద్దుకు ఒక్క ఫిర్యాదు చాలని హెచ్చరించారు. వినియోగదారులను విఐపిలుగా పరిగణించాలని సూచించారు.

## లాటరీ పద్ధతి ద్వారా మహిళా రిజర్వేషన్ వార్డులు ఖరారు

**కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి**






ధర్మఘంట జనవరి 17 కరీంనగర్

లాటరీ పద్ధతి ద్వారా జిల్లాలోని 3 మున్సిపాలిటీలు, కరీంనగర్ కార్పొరేషన్ కు మహిళా రిజర్వేషన్ వార్డులు ఖరారు చేసినట్లు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు మున్సిపల్ వార్డులలో మహిళ రిజర్వేషన్ ఖరారు చేసే ప్రక్రియను శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు మున్సిపల్ వార్డులలో మహిళలకు రిజర్వేషన్ కేటాయింపు ప్రక్రియ పారదర్శకంగా,లాటరీ పద్ధతి ద్వారా పూర్తి చేయడం జరిగిందన్నారు.ప్రతి మున్సిపాలిటీకి సంబంధించి వార్డుల వారీగా రిజర్వేషన్ స్థితిగతులను తెలుపుతూ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో చొప్పదండి, హుజురాబాద్,జమ్మికుంట మున్సిపాలిటీలలో,కరీంనగర్ కార్పొరేషన్ లో వార్డుల వారిగా కేటాయించిన రిజర్వేషన్ వివరాలను తెలుపుతూ లాటరీ పద్ధతి ద్వారా ఎస్టీ,ఎస్సీ,బీసీ, జనరల్ వారీగా మహిళలకు కేటాయించే వార్డులను లాటరీ పద్ధతిలో ఎంపిక చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రపోల్ దేశాయ్,రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి కవలలుగా ప్రజల కష్టాన్ని దోచుకున్న బీజేపీ బిఆర్ఎస్

**బీజేపీ,బీఆర్ఎస్ అవినీతి చేసింది**

**మేము అభివృద్ధి చేస్తాము ఒక్క అవకాశం ఇవ్వండి**

**డిసిసి అధ్యక్షుడు,చొప్పదండి మాజీ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

ధర్మఘంట జనవరి 17 కరీంనగర్:



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో త్వరలో జరగబోయే రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీ మరియు కార్పొరేషన్ ఎన్నికల్లో 90 శాతం పైగా కాంగ్రెస్ గెలుచుకోబోతున్నామని కరీంనగర్ డిసిసి అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మాజీ మేడిపల్లి సత్యం ధీమా వ్యక్తం చేశారు.శనివారం కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ వెలిచాల రాజేందర్ రావు, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలతో కలిసి నగరంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో పత్రికా విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో జరుగనున్న మున్సిపల్ మరియు కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించి చైర్మన్,మేయర్ స్థానాలకు రిజర్వేషన్ స్థానాలను ప్రకటించడం జరిగిందన్నారు.
గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు పార్టీ సింబల్ లేనప్పటికీ కూడా గ్రామాల్లో 70 శాతానికి పైగా ప్రజల తీర్పు కాంగ్రెస్ పార్టీ వైపు ఉందని గుర్తు చేశారు.రేపు జరుగబోయే మున్సిపల్ ఎన్నికల్లో కూడా 90 శాతానికి తగ్గకుండా మెజార్టీ మున్సిపాలిటీలు కార్పొరేషన్లను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోబోతుందన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ను దెబ్బతీయడానికి బీజేపీ,బీఆర్ఎస్ పార్టీల మధ్య ఒక రహస్య ఒప్పందం ఉందని,
గత ఎన్నికల్లో బీజేపీ,బీఆర్ఎస్ పార్టీ ప్రత్యక్షంగా పొత్తు పెట్టుకున్నా,పరోక్షంగా పొత్తు పెట్టుకున్నా 30 శాతానికి దాటలేదన్నారు.ఈ ఎన్నికల్లో కూడా ఏ విధమైన పొత్తు పెట్టుకున్నప్పటికీ పది శాతానికే పరిమితం అవుతారని జోస్యం చెప్పారు.దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం గురించి అందరికీ తెలుసునని,రెండు లక్షల రుణమాఫీ,రైతు భరోసా, మహిళల ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం,ప్రతి పేదోడికి 200 యూనిట్ల లోపం ఉచిత కరెంటు,నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనతో ప్రజా సంక్షేమంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు.గత పది సంవత్సరాల్లో బీఆర్ఎస్ చేయలేని పనులు చేశామని,ఏ గ్రామంలో ఏ ఒక్క పేదోడికి ఇవ్వని రేషన్ కార్డులు మా ప్రభుత్వం వచ్చిన సంవత్సర కాలంలోనే అర్హులైన వారందరికీ రేషన్ కార్డు ఇవ్వడంతో పాటు రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికి సన్నబియ్యం ఇచ్చి వాళ్ళ కడుపు నింపుతుందన్నారు.తెలంగాణ ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారని, వాళ్ళకి ఎప్పుడు ఏం చేయాలో తెలుసునని,సరైన సందర్భం వచ్చినప్పుడు కర్రు కాల్చి వాత పెట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.ఎన్నికల్లో ఒక గ్లోబల్ ప్రచారంతో ఏదో జరగబోతుందని,ఏదో చేయబోతున్నామని,నకిలీ సర్వేలు,సోషల్ మీడియాలో అబద్ధాలు ప్రచారం చేసినా కూడా ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు చాలా స్పష్టమైన తీర్పు ఇచ్చారని, గ్రామపంచాయతీ ఎన్నికల్లో కూడా 70 శాతానికి పైగా సీట్లు ఇవ్వడంతో కాంగ్రెస్ పార్టీ వైపు మేమున్నామని,అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యమవుతుందని,తెలంగాణ ప్రజలు ఒక కృతనిశ్చయంతో కాంగ్రెస్ పార్టీ వైపు ఉన్నారన్నారు. ఈ ఒత్తిడిలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఆ నలుగురు కుటుంబ సభ్యులు మరియు బీజేపీ పార్టీలో కొందరు నేతలు వాళ్ళ అధికార దాహంతో ఏదో జరగబోతుందని అపోహ పడుతున్నారని,వారు పూర్తిగా అపోహలకే పరిమితమవుతారని ఎద్దేవా చేశారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పూర్తి ఫ్రస్టేషన్లో ఉండి,మొన్నటి వరకు మా తండ్రి ముఖ్యమంత్రిగా ఉన్నారని,మాకు చాలా సంపద ఉందని విర్రవీగుతూ, ఆగమాగంగా రోజుకో జిల్లా పర్యటన చేస్తూ,ప్రజల్ని గందరగోళానికి గురిచేస్తున్నారన్నారు.కేటీఆర్ తీరుతో బీఆర్ఎస్ నేతలే గందరగోళంలో ఉన్నారు తప్ప, ప్రజలు చాలా స్పష్టంగా ఉన్నారన్నారు.ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారని, సంతోషంగా లేనిది కేసీఆర్ కుటుంబ సభ్యులు మాత్రమేనని, పదేళ్ల అధికారాన్ని అడ్డుపెట్టుకొని రాష్ట్ర సంపదను లక్షల కోట్ల దోపిడీ చేసి ఏ విధంగా దోచుకొని,ఏ విధంగా విలాస జీవితాన్ని అనుభవించారో తెలంగాణ రాష్ట్ర ప్రజలకు తెలుసన్నారు.తెలంగాణ ప్రజలు మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పూర్తి సంతోషంగా ఉన్నారన్నారు.ముఖ్యంగా కరీంనగర్ నగరాన్ని తీసుకుంటే అటు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ,ఇటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పదేళ్ల పాటు అవినీతి కవలుగా మారి,అభివృద్ధి చేయకుండా నగర ప్రజల కష్టార్జితాన్ని దోచుకున్నారని ఆరోపించారు. ఇద్దరూ కలిసి కరీంనగర్ నగరాన్ని ధ్వంసం చేసింద్రని,అవినీతికి అడ్డగా మార్చింద్రని,కరీంనగర్ కార్పొరేషన్లో పర్సంటేజీ కల్చర్ తో ఏ విధంగా దోచుకున్నది కరీంనగర్ ప్రజలందరికీ తెలుసన్నారు.కాంగ్రెస్ పార్టీ పక్షాన కరీంనగర్ నగర ప్రజలకు ఒకే ఒక విజ్ఞప్తి చేస్తున్నాను, ఇక్కడ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీకి అవకాశం ఇచ్చారు.ఈ కరీంనగర్ పట్టణానికి చెందిన నాయకున్ని కరీంనగర్ ఎంపీగా గెలిపించి కేంద్రమంత్రిని చేశారు.నగరాన్ని అభివృద్ధి చేయడానికి ఒక్క అవకాశం కాంగ్రెస్ పార్టీకి ఇవ్వండన్నారు.ఎందుకంటే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఉంది,రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి ఏ విధంగా జరుగుతుందో మీరందరూ చూస్తున్నారు.మన కరీంనగర్ కూడా హైదరాబాదు లాగా అభివృద్ధి కావాలంటే నగర ప్రజలు ఈసారి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు.బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు రెండుసార్లు అవకాశం ఇస్తే ఏ విధంగా దోచుకున్నారో మీరంతా చూశారని,స్మార్ట్ సిటీ పనులలో గాని,కేబుల్ బ్రిడ్జి నిర్మాణంలో గాని ఏ విధంగా అవినీతి జరిగిందో చూశారని,జేబులు నింపుకోవడానికి మాత్రమే వారు పని చేశారని,ఇంటింటికి తాగునీరు ఇస్తామని చెప్పారని, కానీ,ఎక్కడ కూడా పూర్తిస్థాయిలో తాగునీరు ఇవ్వడం లేదని,ఎక్కడ చూసినా అవినీతి రాజ్యమేలుతుందని, బీఆర్ఎస్ పార్టీకి చెందిన కార్పొరేటర్ల భూకబ్జాలు కానీ, అవినీతి కానీ,ఏ విధంగా తారస్థాయికి చేరిందో మనం చూసామని,గతంలో సిపి అభిషేక్ మహంతి ఉన్నన్ని రోజులు బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు కాలు అడుగు బయట పెట్టడానికి భయపడ్డారని,ఈరోజు అలాంటి నాయకులే మళ్లీ మరో అవతారంతో బీజేపీ లోకి వెళ్తున్నారని,అవినీతి రూపం మారుతుంది తప్ప అవినీతి మారడం లేదన్నారు.కరీంనగర్ పట్టణ ప్రజలుకు గాని,బిఆర్ఎస్ పార్టీకి గాని,మరొకసారి ఓటు వేస్తే అవినీతికి పట్టం కట్టినట్లు అవుతుందన్నారు.కరీంనగర్ లో ఉన్నటువంటి విజ్ఞులైన ప్రజలు, జర్నలిస్టులు,మేధావులు కరీంనగర్ అభివృద్ధి కోసం ఒకసారి కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వాలని కోరారు.గత పదేళ్లలో ఖాళీ జాగా కనబడితే దాన్ని కబ్జా చేసే పరిస్థితి కనపడిందని,స్మార్ట్ సిటీ సేఫ్ సిటీగా ఉండాలంటే ప్రజలంతా కాంగ్రెస్ పార్టీకి ఒకసారి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.ఈ రాష్ట్రంలో ఏ ఎన్నిక వచ్చినా ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపే చూస్తున్నారని, కంటోన్మెంటు,జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో,మొన్న జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో అదే కాంగ్రెస్ కు పట్టం కట్టారని,భవిష్యత్తు ఎన్నికలలో కూడా ఇదే పునరావృతం అవుతుందని,ఈ సారి కాకుండా మరో ఐదు సంవత్సరాలు కూడా ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే ఉంటుందని,రేవంత్ రెడ్డి గతంలో ఆరు సీట్లు ఉన్న కాంగ్రెస్ పార్టీని 66 సీట్లకు తీసుకువచ్చిన నాయకత్వం గల వ్యక్తి అని,రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో 100 సీట్లకు పైగా గెలిచి మరొకసారి ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టబోతుందన్నారు.బీఆర్ఎస్ బీజేపీ నేతలకు అబద్ధాలు ఆడడం అలవాటుగా మారిందని, నాసిరకం పనులతో కేబుల్ బ్రిడ్జి నిర్మాణంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని,విజిలెన్స్ ఎంక్వయిరీ నడుస్తుందని,ఎన్నికల తర్వాత దానిని పూర్తిగా ప్రక్షాళన చేస్తామని,లోటుపాట్లు ఎక్కడ ఉన్నాయో తెలుసుకొని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని,డంపింగ్ యార్డ్ సమస్య కూడా పరిష్కరిస్తామని, కాంగ్రెస్ పార్టీకి ఒక ప్రత్యేక కార్యచరణ ప్రణాళిక ఉందని, దానిని బహిర్గతం చేయకుండా సమయం సందర్భం వచ్చినప్పుడు ఆచరణలోకి తీసుకు వెళ్తామన్నారు.రేపటి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను గెలుచుకొని కార్పొరేషన్ పై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేస్తామన్నారు.ఈ సమావేశంలో నాయకులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి,మేనేని రాజనర్సింగారావు,ముద్దం తిరుపతి,ముద్దసాని రంగన్న, బానోతు శ్రవణ్ నాయక్,కొర్వి అరుణ్ కుమార్,రామిడి రాజిరెడ్డి, సురేందర్ రెడ్డి,లింగంపల్లి బాబు, ముద్దం తిరుపతి,కుంభాల రాజ్ కుమార్,సత్తినేని శ్రీకాంత్,దుబాసి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 50 టిఎంసిల నీటితో మున్నేరు-పాలేరు గ్రావిటీ లింక్ నిర్మాణం

**దీని కోసం 162.57 కోట్ల కేటాయింపు**

**ఖమ్మం,సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలో 1.38 లక్షల ఎకరాలకు నీటి స్థిరీకరణ**

**పాలేరు రిజర్వార్ ఎగువ భాగంలో 40 వేల ఎకరాల ఎన్ఎస్పి ఆయకట్టుకు భరోసా**

**శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ స్టేజ్ -2 ఆయాకట్టుకు అదనపు ప్రయోజనం**

**భక్త రామదాసు ఎత్తిపోతల పథకం డిబిఎం-60 ద్వారా 76,308 ఎకరాలకు అదనపు నీరు**

**సూర్యాపేట జిల్లా మోతె ఎత్తిపోతల పథకం కింద 46,712 ఏకరాలకు సమృద్ధిగా నీరు**

**ప్రాజెక్టు పూర్తి అయితే సాలీనా ప్రభుత్వానికి 120 కోట్ల విద్యుత్ ఖర్చులు ఆదా**


**అదనపు నీటితో పాలేరు రిజర్వాయర్ హైడల్ ప్లాంట్ లో 2 మెఘావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఆస్కారం**

**ఆకస్మిక వరదలతో జరిగే నష్టాలకు చెక్.. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



ధర్మఘంట జనవరి 17 హైదరాబాద్:

సహజవనరులను వినియోగించడం ద్వారా వరద ప్రమాదాలను నివారించడంతో పాటు ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు సమృద్ధిగా సాగునీరు అందించేందుకే రాష్ట్ర ప్రభుత్వం మున్నేరు-పాలేరు లింక్ పథకం నిర్మాణం చేపట్టిందని రాష్ట్ర నీటిపారుదల,పౌరసరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. అందుకోసం రాష్ట్రప్రభుత్వం 162.57 కోట్లు కేటాయించిందని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న మున్నేరు-పాలేరు లింక్ కాలువ పొడుగు 9.6 కిలోమీటర్లు కాగా,ఇది సెకనుకు 4,500 క్యూసెక్కుల నీటి ప్రవాహాన్ని తట్టుకునేల రూపొందించినట్లు ఈ మేరకు శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు.ప్రాజెక్టు పూర్తి అయితే ఖమ్మం,సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలో 1.38 లక్షల ఎకరాలకు నీటి స్థిరీకరణతో పాటు పాలేరు రిజర్వాయర్ ఎగువ భాగంలోని 40 ఎకరాల ఎన్ఎస్పి ఆయకట్టుకు నీటి భద్రత లభిస్తుందని వెల్లడించారు. మున్నేరు నది నుంచి ప్రతి సంవత్సరం వచ్చే వరద నీటిని సద్వినియోగం చేసుకోవడంతో పాటు వృధాగా పోతున్న సుమారు 50 టిఎంసిల నీటితో ఈ ప్రాజెక్టు నిర్మణానికి రాష్ట్ర ప్రభుత్వం అంకురార్పణ చుట్టిందన్నారు.ఇప్పటి వరకు ఈ నీరు వృధాగా సముద్రంలో కలుస్తుందని,ఆ వృధాను అరికట్టడంతో




పాటు ఆ నీటిని సద్వినియోగం చేసుకోవడమే ప్రభుత్వ సంకల్పమన్నారు.దానికి తోడు ఖమ్మం జిల్లాలో మున్నేరు నుండి వస్తున్న నీటితో సంభవిస్తున్న నష్టాన్ని నివరించేందుకు ప్రభుత్వ నిర్ణయం దోహద పడుతుందన్నారు.మున్నేరు నది వరద జలాలతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాలు సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం ముల్కనూర్ గ్రామంలోని చెక్ డ్యామ్ ద్వారా నీరు మళ్లించి నిర్మించే మున్నేరు-పాలేరు లింక్ పథకంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ స్టేజ్-2 ను బలోపేతం చేయడంతో పాటు పాలేరు రిజర్వాయర్ ద్వారా భక్త రామదాసు ఎత్తిపోతల పథకం కింద ఉన్న డిబిఎం 60 ద్వారా ఖరీఫ్ సాగుకు 70,308 ఎకరాల ఆయకట్టుకు అదనపు నీటి లభ్యత చేకూరుతుందని తెలిపారు.అదే విదంగా సూర్యాపేట జిల్లాలోని మోతె ఎత్తిపోతల పథకం ద్వారా డిబిఎం -71 కింద ఉన్న 46,712 ఎకరాల భూమికి నిరంతరం సాగునీటిని అందించవచ్చున్నారు.ఈ ప్రాజెక్టుతో కేవలం సాగునీరు మాత్రమే కాకుండా ఖమ్మం, మహబూబాబాద్,సూర్యాపేట జిల్లాలో తాగు నీటి అవసరాల కోసం మిషన్ భగీరథ పథకానికి 4.70 నీటిని కేటాయిస్తున్నట్లు వివరించారు.అన్నింటికీ మించి ఈ ప్రాజెక్ట్ నిర్మాణం ద్వారా సీతారామ ప్రాజెక్ట్ కు వినియోగించేందుకు వినియోగిస్తున్న విద్యుత్ చార్జీలకై రాష్ట్ర ప్రభుత్వం సాలీనా చెల్లుస్తున్న విద్యుత్ చార్జీల భారం నుండి తప్పించుకోవడంతో పాటు అదనపు నీటితో పాలేరు రిజర్వాయర్ దిగువన ఉన్న హైడల్ ప్లాంట్ లో 2 మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తికి ఆస్కారం ఏర్పడుతుందన్నారు.మొత్తంగా ఈ ప్రాజెక్టు నిర్మాణం ద్వారా మున్నేరు ఉగ్రరూపం దాల్చిన ప్రతి సమయంలో అతలాకుతలం అయ్యే ప్రాంతాల ప్రజలకు ఇకపై ఎటువంటి ఇబ్బంది కలగదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# విమర్శలకు అభివృద్ధితోనే సమాధానం చెప్తాము

**రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్**
**రామగుండం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులు**

ధర్మఘంట జనవరి 17 రామగుండం

విమర్శలకు అభివృద్ధితోనే సమాధానం చెప్తామని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు.శనివారం రామగుండం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు.ఇందులో భాగంగా ఎయిట్ ఇంక్ లైన్ కాలనీలో రూ.30 లక్షలతో డైలీ మార్కెట్ అభివృద్ధి పనులు, గోదావరిఖని చౌరస్తాలో రూ.50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన వీధుల పేర్ల సూచిక బోర్డులను ప్రారంభించారు. అనంతరం రామగుండంలో రూ.20 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేశారు. ఈ సంధర్భంగా రామగుండం మజీద్ కార్నర్ వద్ద నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ అక్కడ గడిపిన రోజులు,తన బాల్య స్మృతులను గుర్తు చేసుకున్నారు.హైదరాబాద్ లో ఉన్నప్పటికీ స్థానికులతో సంబంధాలు కొనసాగిస్తూ రాజకీయాలకు అతీతంగా సహాయం చేశానన్నారు.నాటి పాలకుల నిర్లక్ష్యానికి గురై ప్రాభవం కోల్పోతున్న ఈ ప్రాంతానికి పునర్వైభవం తీసుకురావాలనే సంకల్పంతో పట్టు వదలకుండా పోరాటం చేసి ఎమ్మెల్యేగా ఎన్నికైనానన్నారు. తనపై విశ్వాసంతో,అభిమానంతో నాపై నమ్మకంతో గెలిపించిన నా ప్రాంత ప్రజలకు కృతజ్ఞతగా ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుండి రోజుకు 18 గంటలు పని చేస్తూ నగర అభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు.రామగుండం పట్టణం




నుండి నలువైపులా లింగాపూర్,అంతర్గాం కుందనపల్లి,గోదావరిఖని వైపు ప్రధాన రహదారులన్నీ వెడల్పు చేసి ఒక ముఖ్య కేంద్రంగా రూపు దిద్దుతున్నామన్నారు.ఉత్తర తెలంగాణలో పెద్ద నగరాలైన వరంగల్,కరీంనగర్ వంటి పట్టణాలకు ధీటుగా రామగుండం నగరాన్ని తీర్చి దిద్దాలన్నదే తన ధ్యేయమన్నారు.రామగుండం నగరాన్ని విద్య,వైద్య,పారిశ్రామిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి,జిల్లా మంత్రుల సహకారంతో వేలాది కోట్ల రూపాయల విలువైన నిధులు, ప్రాజెక్ట్ లు మంజూరవుతున్నాయన్నారు.సింగరేణి,ఎన్టిపిసి,ఆర్ఎఫ్సిఎల్ తదితర పరిశ్రమల సిఎస్ఆర్ నిధులతో స్థానికంగా పలు అభివృద్ధి పనులు నిర్వహించడం జరుగుతుందన్నారు.సుమారు రూ.16 వేల కోట్ల అంచనా వ్యయంతో విద్యుత్ ప్రాజెక్ట్ లు మంజూరు చేయించడం జరిగిందన్నారు.తద్వారా రామగుండం నగరంలో ఉపాధి ఉద్యోగావకాశాలు పెరుగుతాయన్నారు.సుమారు రూ.150 కోట్లతో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మిస్తున్నామన్నారు. గుండె పోటు వస్తే హైదరాబాద్ వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లవల్సిన అవసరం లేకుండా క్యాత్ లాబ్ సదుపాయం రామగుండంలోనే అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. రూ.230 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రామగుండం నగరంలో సాంకేతిక కళాశాలలతో పాటు ఎయిర్ పోర్ట్ ఏర్పాటుకు కూడా ప్రయత్నం చేస్తున్నానన్నారు.ఈ రెండేళ్ల స్వల్ప కాలంలోనే నగరంలో ఇంత మార్పు పస్ఫుటంగా కనిపిస్తుంటే విమర్శలు చేయడం సరికాదన్నారు.ఈ కార్యక్రమాల్లో నగర పాలక సంస్థ ఎస్ఇ గురువీర ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పివి రామన్,సెక్రెటరీ ఉమామహేశ్వర్ తో పాటు నాయకులు మనాలి రాజ్ ఠాకూర్,మహంకాళి స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీలను అణచివేసేందుకు వ్యక్తులు వ్యవస్థలు కుమ్మక్కు?

**మాధాపూర్ అయ్యప్ప సొసైటీలో 1000 గజాల భూమి వివాదం**
**పోలీసు-రెవెన్యూ పక్షపాతంతో నలుగుతున్న ఎస్సీ కుటుంబాలు**
**న్యాయం కోసం కలెక్టర్,డీజీపీ,సీఎం,ఏఐసీసీ పెద్దల గడప తొక్కుతున్న బాధితులు**

ధర్మఘంట జనవరి 17 హైదరాబాద్:

శేరిలింగంపల్లి మండలం మాధాపూర్ పరిధిలోని అయ్యప్ప సొసైటీలో ఉన్న 1000 చదరపు గజాల భూమి విషయంలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన కుటుంబాలు తీవ్ర అన్యాయం,అణచివేతకు గురవుతున్నాయని ఆరోపిస్తూ న్యాయం కోసం ఉన్నతాధికారుల గడప తొక్కుతున్నాయంటే రాష్ట్రంలో ఎస్సీ కులాలను అణచివేసేందుకు వ్యక్తులు, వ్యవస్థలు ఒక్కటిగా మారాయనిపిస్తుంది.వివాదానికి కారణమైన సర్వే నెం.11/6 లోని ఈ భూమిని ఎస్సీ బాధితులు 2003 నుంచే చట్టబద్ధంగా తమ ఆధీనంలో ఉంచుకొని నివసిస్తున్నామని చెబుతుండగా, సర్వే నెం.11/7పై చింతలపాని కవితా రెడ్డి తాను 2014 నుంచి హక్కుదారినని చెబుతూ వివాదం సృష్టిస్తున్నారని బాధితులు పేర్కొంటున్నారు.బాధితుల కథనం ప్రకారం...చింతలపాని కవితా రెడ్డి 2014లో 5 ఎకరాల భూమిని కొనుగోలు చేసినట్లు నకిలీ పత్రాలు సృష్టించారు. అయితే,1982 లోనే గురుకుల్ ట్రస్ట్ ద్వారా అయ్యప్ప సొసైటీ గజాల ప్రాతిపదికన లేఅవుట్గా మారిన విషయం అందరికీ తెలిసినదేనని స్థానికులు చెబుతున్నారు.అటువంటి పరిస్థితిలో "2014లో మళ్లీ ఎకరాలుగా కొనుగోలు చేశామని చెప్పడం ఎలా సాధ్యం? అక్కడ 5 ఎకరాల భూమే లేదు,ఉన్నది కేవలం 1000 గజాలే" అని చుట్టుపక్కల నివాసితులు ప్రశ్నిస్తున్నారు.

**పోలీసు,రెవెన్యూ అధికారుల పక్షపాతం**

ఈ భూమి వివాదానికి సంబంధించి మాధాపూర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ అభ్యర్థన మేరకు తహసీల్దార్ స్థాయిలో రెవెన్యూ నివేదిక సిద్ధమవుతున్నప్పటికీ,ఈ మొత్తం ప్రక్రియ ఎస్సీ బాధితులకు వ్యతిరేకంగా,ఒక పక్షానికి అనుకూలంగా సాగుతోందన్న తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఎస్‌హెచ్‌ఓ అత్యుత్సాహంతో "ఈభూమి ఒక పోలీసు అధికారి మేనత్త గారిదే" అంటూ కవితా రెడ్డి తరఫున ఫేవరబుల్‌గా నివేదిక ఇవ్వాలని రెవెన్యూ






అధికారులపై ఒత్తిడి తెచ్చినట్టు బాధితుల నుండి అందుతున్న సమాచారం. అయితే,ఈ మాటలకు ఎలాంటి ఆధారాలు లేవని,ఇది పోలీసులే సృష్టించిన కట్టుకథ మాత్రమే అని బాధితులు స్పష్టం చేస్తున్నారు. అంతేకాకుండా,కోర్టు ఆదేశాలు, జాతీయ ఎస్సీ కమిషన్ ఇచ్చిన స్పష్టమైన ఆదేశాలను కూడా లెక్కచేయకుండా,మాధాపూర్ పోలీసులు గతంలో ఎస్సీ బాధితులను పీడీ యాక్ట్ పెడతామని బెదిరించి,కొన్ని గంటల పాటు స్టేషన్‌లో కూర్చోబెట్టారని,బాధితులకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే బాధితులను భయపెట్టాలని చూస్తున్నారని వాపోతున్నారు.

**దాడులు,బెదిరింపులు**

గతంలో కవితా రెడ్డి అనుచరులు సుమారు 40 మంది కలిసి ఎస్సీ బాధితులపై దాడి చేసి రక్తం వచ్చేలా కొట్టారని,సీసీ కెమెరాలను ధ్వంసం చేశారని, అత్యవసర సమయంలో 100కు పలుమార్లు కాల్ చేసినా పోలీసులు కావాలనే స్పందించలేదని బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇంత జరిగినా,కవితా రెడ్డిపై హత్యాయత్నం,ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు అయినప్పటికీ,ఆమెను అరెస్ట్ చేయకుండా,ముందస్తు బెయిల్ వచ్చేవరకు పోలీసులే సహకరించారన్న ఆరోపణలు వెలుగులోకి వస్తున్నాయి. ఇటీవలి రెండు వారాల క్రితం కూడా కవితా రెడ్డి మరియు ఆమె సహచరుడు శ్రీనివాస రెడ్డి రౌడీలను పెట్టి,ఎస్సీ కుటుంబాలు నిర్మించుకుంటున్న ఇళ్లను కూల్చివేశారని,పోలీసులను ఆశ్రయించినా కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదని, దానికి బదులుగా బాధితులనే బెదిరించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.తప్పుడు ప్రచారం,ఒత్తిడి విశ్వసనీయ సమాచారం ప్రకారం,ఆ పోలీసు అధికారికి కవితా రెడ్డికి ఎలాంటి బంధుత్వం లేదని,ఈ బంధుత్వ కథనమంతా ఎస్‌హెచ్‌ఓ సృష్టించిన అబద్ధ ప్రచారమేనని తెలుస్తోంది.ఈ తప్పుడు ప్రచారం ద్వారా అధికారులను ప్రభావితం చేసి ఎస్సీ బాధితులను భూముల నుంచి తరిమేయాలన్న ప్రయత్నం జరుగుతోందని వారు ఆరోపిస్తున్నారు.ఇక మరోవైపు, ఎస్సీ బాధితులు సమర్పించిన పక్కా డాక్యుమెంట్లను పూర్తిగా పక్కనపెట్టడం,భూమిపై ప్రత్యక్ష ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్ చేయకుండానే, కేవలం ఫైళ్ల ఆధారంగా నివేదిక సిద్ధం చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.రాజ్యాంగ హక్కుల ఉల్లంఘనగా ఈ పరిస్థితి కొనసాగితే,అది రెవెన్యూ వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని పూర్తిగా ధ్వంసం చేయడమే కాకుండా,రాజ్యాంగం ఎస్సీ వర్గాలకు హామీగా కల్పించిన సమానత్వం,జీవన హక్కు, సామాజిక న్యాయాన్ని కాలరాయడమే అవుతుందని బాధితులు హెచ్చరిస్తున్నారు.ఈ నేపథ్యంలో న్యాయం కోసం ఎస్సీ బాధితులు జిల్లా కలెక్టర్,డీజీపీ, ముఖ్యమంత్రి,అలాగే ఏఐసీసీ పెద్దలు మరియు ప్రజాప్రతినిధులను ఆశ్రయిస్తూ తమ గోడును వినిపిస్తున్నారు.

**ఈ వ్యవహారంలో బాధితుల డిమాండ్లు**

పక్షపాతం లేని స్వతంత్ర విచారణ,జాయింట్ ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్,బాధితులు సమర్పించిన అన్ని డాక్యుమెంట్ల సమగ్ర పరిశీలన,చట్టబద్ధమైన, తటస్థ రెవెన్యూ నివేదిక ఎస్సీలపై దాడులు,బెదిరింపులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.ఈ వ్యవహారంలో ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకోకపోతే,ఇది ఎస్సీ వర్గాలపై కొనసాగుతున్న వ్యవస్థాగత అణచివేతకు మరో ఉదాహరణగా నిలుస్తుందని, న్యాయం జరిగితేనే సహజ న్యాయం,రాజ్యాంగ సమానత్వం, పాలనపై ప్రజల విశ్వాసం కోల్పోయెందుకు నిదర్శనంగా నిలుస్తుందని బాధితులు స్పష్టం చేస్తున్నారు.

# క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతి ప్రదానం

ధర్మఘంట జనవరి 17 సూర్యాపేట:

క్రీడలు మానసిక ఉల్లాసానికి శారీరక వికాసానికి ఉపయోగపడతాయని,యువకులంతా సెల్ ఫోన్ వదిలి క్రీడల వైపు రావాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి,డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని భగత్ సింగ్ నగర్ లో మొరిగాల భిక్షం గౌడ్,సత్తెమ్మల జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు వారు బహుమతులను అందజేశారు. ముందుగా మొరిగాల భిక్షం గౌడ్, సత్తెమ్మల జ్ఞాపకార్థం కాంగ్రెస్ పార్టీ నాయకులు మొరిగాల ఉపేందర్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రోడ్ నెంబర్ తెలిపే బోర్డులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మొరిగాల ఉపేందర్ గౌడ్ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం బోర్డుల ఏర్పాటు, జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ను నిర్వహించటం అభినందనీయమన్నారు.యువత క్రీడలకు దగ్గరై,చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు.విద్యార్థులు, యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి మంచి



పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని,ఓటమిని స్ఫూర్తిగా తీసుకొని గెలుపు సాధనకై ముందుకు సాగాలన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండీ అంజద్ అలీ,శ్రీ దండు మైసమ్మ దేవస్థానం కమిటీ చైర్మన్ తంగెళ్ల కరుణాకర్ రెడ్డి,మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎండి ఫసియోద్దీన్ (ముక్రం),జిల్లా యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు,మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బైరు శైలేందేర్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాడుగుల నవీన్,మాజీ కౌన్సిలర్లు అనంతల యాదగిరి, రాపర్తి శ్రీనివాస్,19వ వార్డు అధ్యక్షుడు గౌస్,జిల్లా కాంగ్రెస్ నాయకులు పందిరి మల్లేష్ గౌడ్,తన్వీర్ హుస్సేన్,కొడకండ్ల ఉపేందర్ రెడ్డి,గడ్డం వెంకన్న, మద్దెబోయిన శ్రీనివాస్,చిరువెళ్ల శబరి,పంతంగి దశరథ,కొత్తపల్లి వెంకన్న,నబీ ఖాన్,జావేద్, వినయ్,వార్డు నాయకులు వెంకన్న,పృధ్వీ,క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాలానికి నర్సరీలను సిద్ధం చేయాలి డిఆర్డీఓ నాగిరెడ్డి



ధర్మఘంట జనవరి 17 మోత్కూరు

రానున్న వర్షాకాలంలో డిమాండ్ మేరకు నర్సరీలలో మొక్కలను సంసిద్ధం చేయాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి టీ.నాగిరెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని భుజిలాపురం శివారులో నెలకొల్పబడనున్న సోలార్ పవర్ కేంద్రం పనులను ఆయన పరిశీలించారు.అక్కడ జరుగుతున్న బుష్ క్లియరెన్స్ పనులను పరిశీలించి అధికారులతో సమీక్షించారు. అనంతరం అనాజపురం, పొడిచెడు గ్రామాల్లో నర్సరీలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చక్కని మట్టి,ఎరువు మిశ్రమంతో కవర్లు నింపి విత్తనాలు ఆరోగ్యంగా మొలకెత్తేలా చర్యలు తీసుకోవాలన్నారు.గ్రామస్తుల అవసరాల మేరకు మొక్కలు అందుబాటులో ఉంచాలని తెలిపారు.రోడ్డుకు ఇరువైపులా నాటే మొక్కలు ఎప్పటికప్పుడు నీరందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీఓ పైళ్ల జనార్దన్ రెడ్డి,అనాజపురం సర్పంచ్ బీసు వెంకటయ్య, పొడిచేడు సర్పంచ్ జిట్టా సైదులు,ఎపిఓఎస్ కరుణాకర్, టిఎఎస్ యాదగిరి,జాఫర్,శోభన్, రమేష్,అంజలి,వీరస్వామి,జిపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గెలుపు కోసం ఐక్యంగా కృషి చేయాలి

**పార్టీ క్యాడర్ కు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి పిలుపు**



ధర్మఘంట జనవరి 17 మానకొండూర్:

త్వరలో జరగనున్న కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం పార్టీ కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేయాలని మానకొండూర్ ఎమ్మెల్యే,పీసీసీ ఎస్సీ విభాగం చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు.శనివారం ఎల్ఎండీ కాలనీలోని అరుంధతీ ఫంక్షన్ హాల్ లో 8వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మనవేణి రమేశ్ అధ్యక్షతన జరిగిన ఆ డివిజన్ పరిధిలోని అల్గునూర్ పార్టీ నాయకులు,కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కార్పొరేషన్ ఎన్నికల్లో 8వ, డివిజన్ రిజర్వేషన్ ఎలా ఉన్నప్పటికీ ఎన్నికలకు అందరూ సన్నద్ధంగా ఉండాలన్నారు.పార్టీ ఎంపిక చేసిన అభ్యర్థి విజయం కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని,అభ్యర్థి గెలుపే మనందరి లక్ష్యం కావాలన్నారు. ప్రతి గ్రామంలో చిన్న చిన్న సమస్యలు,అభిప్రాయ బేధాలు ఉంటడం సహజమేనని ఆయన పేర్కొన్నారు.ఎన్నికల వేళ వాటన్నింటిని పక్కన పెట్టి పార్టీ గెలుపు కోసం మనమంతా ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నారెడ్డి,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్,మానకొండూర్ మండల పార్టీ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి,పార్టీ నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు, ముంజ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

## పోతుగంటి వీరాచారికి అత్యంత ప్రతిష్టాత్మకమైన జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపిక

ధర్మ ఘంట జనవరి 17,సూర్యాపేట జిల్లా ప్రతినిధి



జనవరి 21 బుధవారం రోజు ఆంధ్రప్రదేశ్ విజయవాడలోని చాంబర్ ఆఫ్ కామర్స్ ఆడిటోరియంలో.. ఐ ఎస్ ఓ గుర్తింపు పొందిన ప్రపంచంలోనే అతి పెద్ద అంతర్జాతీయ సాహిత్య, సంస్కృతిక,సామాజిక సేవా సంస్థ శ్రీ శ్రీ కళా వేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సారధ్యంలోమరియు గోదావరి సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ మరియు తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో సాహితీ సంస్కృతిక పట్టాభిషేక మహోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ శ్రీ కళా వేదిక తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు,సూర్యాపేట జిల్లా అధ్యక్షులు,కవి,రచయిత, సామాజిక కార్యకర్త. పోతుగంటి వీరాచారి, తెలుగు భాషా,సంస్కృతి,సాంప్రదాయాల,అభివృద్ధికి సాహిత్యం ద్వారా కృషి , అక్షర సేవలను,సాహిత్య,సంస్కృతిక తపనను సృజనాత్మక ప్రతిభను గుర్తించి అభినందిస్తూ సాహితీ సంస్కృతిక పట్టాభిషేక మహోత్సవంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపిక చేసినట్లు శ్రీశ్రీ కళావేదిక జాతీయఅధ్యక్షురాలు ఈశ్వరి భూషణం ఆహ్వానశీ పంపినట్లు, పోతుగంటి వీరాచారి తెలియజేశారు. వీరాచారి ఇప్పటివరకు రెండు సంకలనాలు, శతాధిక సన్మానాలు, 15 పైగా బిరుదులు 15 జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అందుకున్నారు. వీరాచారి పలు జాతీయ,అంతర్జాతీయ,రాష్ట్రస్థాయి, సాహితి వేదికలపై కవిత గానం చేశారు. జనవరి 21వ తేదీన బుధవారం ప్రతిభా పురస్కారం అందుకుంటున్న నేపథ్యంలో వీరాచారిని పలువురు సాహిత్య వేత్తలు, సాహితీ అభిమానులు అభినందించారు.

## మోత్కూరును నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటు చేయాలి

**బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్**




ధర్మఘంట జనవరి 17 మోత్కూరు

యాదాద్రి భువనగిరి జిల్లాలోని మోత్కూరు మండలాన్ని నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటు చేయాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అడ్మిటేషన్ అధికారి (ఏవో) జగన్మోహన్ ప్రసాద్‌కు ప్రజల నుంచి సేకరించిన భారీ సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో, ప్రస్తుత యాదాద్రి భువనగిరి జిల్లాలో అత్యంత వెనుకబడిన మండలాల్లో మోత్కూరు ఒకటిగా ఉందని, గతంలో తాలూకా కేంద్రంగా మంచి గుర్తింపు ఉన్న మోత్కూరు, ప్రస్తుతం తుంగతుర్తి నియోజకవర్గంలో కీలకమైన, పెద్ద మండలంగా ఉన్నప్పటికీ అభివృద్ధిలో అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న అసెంబ్లీ నియోజకవర్గ పునర్వ్యవస్థీకరణలో మోత్కూరు నియోజకవర్గం ఏర్పాటు కావడానికి పూర్తి అర్హతలు ఉన్నాయన్నారు. మోత్కూరును నియోజకవర్గ కేంద్రంగా చేస్తే గుండాల, ఆత్మకూరు(ఎం), అడ్డగూడూరు, మోటకొండూర్ మండలాల ప్రజలకు పరిపాలన సౌకర్యాలు మెరుగుపడతాయన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఈ ఐదు మండలాల్లో మొత్తం 68 రెవెన్యూ గ్రామాలు, 90 గ్రామపంచాయతీలు, 1,70,391 జనాభా ఉందని, 2026 నాటికి ఈ సంఖ్య మరో 50,000 పెరిగే అవకాశం ఉందని వివరించారు. ఈ విషయంలో ఏవో జగన్మోహన్ ప్రసాద్ సానుకూలంగా స్పందించి, మోత్కూరు నియోజకవర్గ కేంద్రం ఏర్పాటుపై ఉన్న డిమాండ్‌ను పరిశీలించి, సంబంధిత ఉన్నత స్థాయికి నివేదిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల నేతలు అంబాల విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగట్టు జాతర పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే



ధర్మఘంట జనవరి17 మానకొండూర్

కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలోని శ్రీ మత్స్యగిరీంద్రస్వామి జాతర పోస్టర్ ను శనివారం ఆలయ సన్నిధిలో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఆలయ చైర్మన్ కోరం రాజిరెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఏ.సుధాకర్, ఆలయ అర్చకులు శేషం మురళీధరస్వామి, ధర్మకర్తలు రామగిరి తిరుమల, ఎం.లక్ష్మణరావు, మీస రవీందర్, తాడిచెర్ల తిరుపతి, కె.రత్నం, ఎడ్ల తిరుపతి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోపగోని బస్వాగౌడ్, హుజూరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, పార్టీ నాయకులు తాడిచర్ల తిరుపతి, కవ్వ పద్మ, గట్టు తిరుపతి, గొట్టె మధు తదితరులు పాల్గొన్నారు.

## జిహెచ్ఎంసి ఎన్నికల్లో గిరిజనులకు అన్యాయం

**న్యాయమైన రిజర్వేషన్లు కేటాయించాలని ఏకలవ్య జేఏసీగిరిజన సంఘాల డిమాండ్**

ధర్మఘంట, జనవరి 17, హైదరాబాద్




జిహెచ్ఎంసి ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రిజర్వేషన్ కేటాయింపుల్లో గిరిజనులకు తగిన ప్రాతినిధ్యం లభించలేదని ఆరోపిస్తూ, ఏకలవ్య జాయింట్ యాక్షన్ కమిటీ (ఈజేఏసీ) మరియు వివిధ గిరిజన సంఘాలు నేడు హైదరాబాద్‌లో భారీ నిరసనల కార్యక్రమం నిర్వహించాయి. ట్యాంక్ బండ్ సమీపంలోని డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద గిరిజన సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేసి, అనంతరం ర్యాలీగా జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయానికి చేరుకొని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిహెచ్ఎంసి కమిషనర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కండెల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, 2011 జనాభా గణాంకాల ప్రకారం గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ వర్తిస్తుందని పేర్కొన్నారు. ఆ ప్రాతిపదికన 300 డివిజన్లలో కనీసం 30 డివిజన్లను గిరిజనులకు కేటాయించాల్సి ఉండగా, కేవలం 5 డివిజన్లను మాత్రమే కేటాయించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. అగ్రవర్ణాలకు ఈడబ్ల్యూఎస్ కింద 10 శాతం రిజర్వేషన్ అమలు చేస్తూ, వారి జనాభా శాతం 0.5 మాత్రమే ఉన్నప్పటికీ పెద్ద సంఖ్యలో సీట్లు కేటాయించడాన్ని ప్రశ్నించారు. గిరిజనులకు న్యాయమైన ప్రాతినిధ్యం కల్పించాలంటే 300 డివిజన్లలో 30 సీట్లు కేటాయించడంతో పాటు, ఆరు జోనల్ కార్పొరేషన్లలో కనీసం ఒక జోనుకు ఎస్టీ మేయర్‌ను ప్రకటించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల పంపిణీలో జరిగిన లోపాలను తక్షణమే సరిచేయాలని, లేనిపక్షంలో గిరిజన ప్రజలను ఏకం చేస్తూ న్యాయపరమైన మరియు ప్రజాస్వామ్య పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏకలవ్య జేఏసీ కన్వీనర్ కుతాడి ముఖేష్, కోకన్వీనర్లు కండెల వెంకటేశ్వర్లు, చిట్టిబాబు, బదనాపురం రఘు, కండల వెంకటేష్, వనం గంగయ్య, పిట్టల లింగయ్య, సమ్మయ్య, రాజేష్, కార్తీక్, శ్రీకాంత్, బేగంపేట్ విజయ్, అలాగే జిటిఎస్5 రాష్ట్ర అధ్యక్షుడు ధర్మానాయక్, బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి మద్దతు తెలిపిన ఎరుకల సంఘాల కార్యకర్తలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.


# రేపు దావోస్‌కు సీఎం చంద్రబాబు

**అమరావతి**

వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబా బు, మంత్రులు, అధికారుల బందం ఆదివారం దావోస్ బయల్దేరి వెళ్లనుంది. 4 రోజుల పాటు దావోస్‌లో ముఖ్యమంత్రి పర్యటించనున్నారు. 19వ తేదీ నుంచి 22వ తేదీ వరకూ దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సులో వివిధ పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి ముఖాముఖి భేటీలు, కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఆదివారం రాత్రి 8.35 గంటలకు విజయవాడ విమానాశ్రయం నుంచి బయల్దేరి ఢిల్లీ వెళ్లనున్న సీఎం..అక్కడి నుంచి జ్యూరిచ్‌కు వెళ్తారు. ఢిల్లీలో 19 తేదీన రాత్రి 01.45 గంటలకు బయల్దేరి ఉదయం జ్యూరిచ్ విమానాశ్రయానికి చేరుకుంటారు. జ్యూరిచ్‌లోని హిల్టన్ హోటల్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబుతో స్విట్జర్లాండ్ భారతీయ రాయబారి మదుల్ కుమార్ మర్యాదపూర్వకంగా భేటీ అవుతారు. అనంతరం ఎరోస్ ఇన్నోవేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ కిషోర్ లుల్లా, సహ అధ్యక్షులు రిధిమా లుల్లా, స్వనీత్ సింగ్‌లు కూడా ముఖ్యమంత్రితో సమావేశం అవుతారు. అనంతరం భారత ఎంబసీ ఆధ్వర్యంలో జ్యూరిచ్‌లోని హిల్టన్ హోటల్‌లో ఏర్పాటు చేసిన తెలుగు డయాస్పోరా కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరుకానున్నారు. మొత్తం 20 దేశాల నుంచి వచ్చే ఎన్ఆర్‌టీలతో నిర్వహించే తెలుగు డయాస్పోరా కార్యక్రమంలో పాల్గొని తెలుగు ప్రజలను ఉద్దేశించి ఆయన ప్రసంగించనున్నారు. అనంతరం సీఎం చంద్రబాబు జ్యూరిచ్ నుంచి రోడ్డు మార్గాన దావోస్ వెళ్తారు. దావోస్‌లో తొలిరోజు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఆర్థిక, పర్యాటక విభాగాల మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రితో వివిధ దేశాల మధ్య జరిగే సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. అనంతరం టాటాసన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌తో కలిసి ముఖ్యమంత్రితో భేటీ కానున్నారు. సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ కూడా దావోస్ వేదికగా సీఎంతో సమావేశం అవుతారు. విదేశీ మీడియా సంస్థ పొలిటికోకు ముఖ్యమంత్రి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇవ్వనున్నారు. దావోస్ రెండో రోజు పర్యటనలో భాగంగా హోటల్ మోరోసాని ప్రోమెనేడ్‌లో ఇండియా ఎట్ సెంటర్ జియోగ్రఫీ గ్రోత్ ఏపీ అడ్వాంటేజ్ పేరిట సీఐఐ నిర్వహిస్తున్న బ్రేక్ ఫాస్ట్ సెషన్‌లో ముఖ్యమంత్రి పాల్గొననున్నారు. అనంతరం భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇండియా లాంజ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరవుతారు. అనంతరం దిగ్గజ ఐటీ సంస్థ ఐబీఎం ఛైర్మన్ సీఈఓ అరవింద్ కృష్ణతో ముఖ్యమంత్రి భేటీ అవుతారు. మూడో రోజు వరల్డ్ ఎకనామిక్ ఫోరం కాంగ్రెస్ సెంటర్‌లో జరిగే పారిశ్రామిక పురోగతి అంశంపై నిర్వహించే సెషన్‌లో ముఖ్యమంత్రి పాల్గొంటారు. హొరైసిస్ ఛైర్మన్ ఫ్రాంక్ రిచర్ తో భేటీ కానున్నారు. తమారా హాస్పిటాలిటీ సంస్థ ఫౌండర్ సృష్టి శిబులాల్, ఆ సంస్థ సీఓఓ కుష్బు అవస్థి, కాలిబో ఏఐ అకాడెమీ సీఈఓ రాజ్ వట్టికుట్టి, స్కాట్ శాండ్స్లెఫర్ లు సమావేశం ముఖ్యమంత్రితో చర్చలు జరుపుతారు. అనంతరం ఏపీ సీఎన్ఎఫ్ నిర్వహించే హీలింగ్ ప్లానెట్ త్రో రీజెనరేటివ్ ఫుడ్ సిస్టమ్స్ పేరిట జరిగే చర్చా కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరుకానున్నారు. ఆ తర్వాత ట్రిలియన్ డాలర్ పైవోట్ రీరైటింగ్ మార్కెట్ సిగ్నల్స్ ఫర్ నేచర్ పాజిటివ్ గ్రోత్ అనే అంశంపై చర్చా కార్యక్రమంలోనూ సీఎం పాల్గొంటారు.

# ఏపీలో నీళ్ల రాజకీయం...

**విజయవాడ :** తెలుగు రాష్ట్రాల్లో ప్రతిపక్షాలు నీళ్ల రాజకీయాన్ని నమ్ముకున్నాయి. అయితే రెండు రాష్ట్రాల్లో చంద్రబాబును సాకుగా చూపి ఉద్యమాలకు శ్రీకారం చుదుతున్నాయి. చంద్రబాబుతో రాజీ పడి తెలంగాణ ప్రయోజనాలను గాలికి వదిలేసారని రేవంత్ పై మండిపడుతున్నారు గులాబీ పార్టీ నేతలు. తెలంగాణ సీఎం రేవంత్ తో రహస్య ఒప్పందం చేసుకొని ఏపీ ప్రయోజనాలను చంద్రబాబు దెబ్బతీస్తున్నారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ఏపీ సీఎం చంద్రబాబుతో మాట్లాడించి ఆపించానని తెలంగాణ అసెంబ్లీలో సీఎం రేవంత్ చెప్పుకొచ్చారు. అప్పటి నుంచి రచ్చ ప్రారంభం అయ్యింది. అయితే అది ముందుగానే నిలిచిపోయిందని.. రేవంత్ చెప్పిన దాంట్లో ఎంత మాత్రం నిజం లేదని గులాబీ పార్టీ నేతలు చెబుతున్నారు. తద్వారా జగన్మోహన్ రెడ్డి హయాంలో తామే ఆ పనులు ఆపించామని వారు చెప్పుకొస్తున్నారు. అయితే ఏపీలో వైసీపీ నేతలు మాత్రం తెలంగాణతో రాజీపడి రాయలసీమకు చంద్రబాబు ద్రోహం చేస్తున్నారని ఉద్యమ బాట పట్టేందుకు సిద్ధపడుతున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించాలని జగన్ ఆలోచన చేశారు. తన పార్టీకి ఆయువుపట్టుగా భావించే రాయలసీమకు ప్రయోజనం కల్పించాలన్నది జగన్ టార్గెట్. కృష్ణా నదిపై ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి రాయలసీమతో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు సాగునీరు అందించాలన్నది లక్ష్యం. అయితే సరిహద్దు జలాలకు సంబంధించిన నీటి వినియోగం కాబట్టి కచ్చితంగా అనుమతులు తీసుకోవాలి. అలా అనుమతులు తీసుకున్న తర్వాత ఈ భారీ ప్రాజెక్టు పనులు ప్రారంభించాలి. కానీ జగన్మోహన్ రెడ్డి ఆ పని చేయలేదు. తద్వారా ప్రాజెక్టు పై ఆయనకు ఉన్న చిత్తశుద్ధి అర్థం అవుతోంది. అయితే అప్పటికే తెలంగాణలో కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. కొన్ని రకాల అభ్యంతరాలు తెలంగాణ నుంచి వచ్చాయి. ఈ నేపథ్యంలో కేంద్రం అనుమతులు ఇవ్వకపోవడంతో ఈ ప్రాజెక్టు నిలిచిపోయింది 2020లో. కేవలం ఈ ప్రాంత సెంటిమెంట్తో కూడుకున్న పని కావడంతో జగన్మోహన్ రెడ్డి ఆ ప్రాజెక్టును తెరపైకి తెచ్చారు. అనుమతులు లేకుండా ప్రాజెక్టు కట్టడం సులువు కాదు. ఆ విషయం తెలిసి కూడా జగన్మోహన్ రెడ్డి ఆ ప్రయత్నం చేశారు అంటే దాని వెనుక ఉన్న పరమార్థం ఇట్టే తెలిసిపోతోంది. మొన్నటికి మొన్న బనకచర్ల ప్రాజెక్ట కోసం ఆలోచన చేశారు చంద్రబాబు. రాయలసీమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని భావించారు. కేవలం సముద్రంలో కలిసిపోతున్న నదీ జలాలను తరలించడం ద్వారా రాయలసీమలో సాగునీటి కొరత లేకుండా చేయవచ్చని భావించారు. అయితే దీనికి తెలంగాణ సమాజం నుంచి అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. అదే సమయంలో ఏపీలోని మిగతా రాజకీయ పక్షాల సహకారం కూటమి ప్రభుత్వానికి కరువైంది. కనీసం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నోరు తెరవలేదు. కానీ బనకచర్ల ప్రాజెక్టు విషయంలో తెలంగాణలోని కాంగ్రెస్తో పాటు గులాబీ పార్టీ నేతలు సైతం విమర్శలు చేశారు. కానీ ఏపీకి మద్దతుగా ఈ ప్రాజెక్టు కావాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కనీసం కోరలేదు. అప్పట్లో కూడా రాయలసీమ ఎత్తిపోతల పథకం విషయంలో కనీస ప్రస్తావన లేదు. ఎప్పుడైతే తెలంగాణ సీఎం రేవంత్ చంద్రబాబు తో మాట్లాడి ఎత్తిపోతల పథకాన్ని ఆపించానని చెప్పడంతో.. దీనిని ఒక రాజకీయ అంశంగా మార్చేసింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. మాజీమంత్రి కీలక ప్రకటన.. రాయలసీమ జల ప్రయోజనాల కోసం ఇప్పుడు వైసీపీ ఉద్యమ బాట పట్టాలని నిర్ణయించింది. అవసరం అనుకుంటే పాదయాత్ర చేస్తామని మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి ప్రకటన చేశారు అంటే.. ఈ అంశాన్ని రాజకీయంగా వాడుకోవాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. తాము ప్రారంభించిన ప్రాజెక్టు నిలిచిపోవడం నిజం. వాటి అనుమతుల విషయంలో నిబంధనలు పాటించకపోవడం వాస్తవం. కానీ ఈ ప్రాజెక్టు చంద్రబాబు వల్లే నిలిచిపోయిందని చెబుతూ ఇప్పుడు వైసిపి నీళ్ల రాజకీయాలకు శ్రీకారం చుడుతుండడం మాత్రం గమనార్హం. అయితే మరోసారి ప్రజలకు ఈ విషయంలో వాస్తవాలు తెలిస్తే మాత్రం ఆ పార్టీకి ఇబ్బందికరమే.



# సచివాలయ ఉద్యోగులకు ఫేషియల్ అటెండన్స్

**విజయవాడ:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రామ , వార్డు సచివాలయ వ్యవస్థను మరింత జవాబుదారీగా మార్చేందుకు సరికొత్త సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఇకపై సచివాలయ సిబ్బంది అందరికీ ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ విధానాన్ని తప్పనిసరి చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగుల సమయపాలనపై వస్తున్న ఫిర్యాదులను తీవ్రంగా పరిగణించిన సర్కార్, టెక్నాలజీ సాయంతో పనితీరును మెరుగుపరచాలని భావిస్తోంది. ఈ మేరకు సంబంధిత శాఖాధికారులు ఇప్పటికే ప్రాథమిక ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త నిబంధనల ప్రకారం, సచివాలయ ఉద్యోగులు ఉదయం నిర్ణీత సమయానికే విధులకు హాజరు కావాల్సి ఉంటుంది. ఒకవేళ ఎవరైనా ఆలస్యంగా వస్తే, ఆ సమాచారం నేరుగా సెంట్రల్ సర్వర్‌కు చేరుతుంది. నిర్దేశించిన సమయం కంటే ఎక్కువ సార్లు ఆలస్యంగా వస్తే, ఆ రోజు వేతనంలో కోత విధించేలా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేస్తున్నారు. బయోమెట్రిక్ విధానంలో ఉన్న లోపాలను అరికట్టేందుకు, ఒకరి బదులు మరొకరు హాజరు వేసే అవకాశం లేకుండా ఈ ఫేషియల్ అటెండెన్స్‌ను ప్రవేశపెడుతున్నారుసచివాలయ వ్యవస్థ ఉద్దేశమే ప్రజల చెంతకు పాలనను చేర్చడం. అయితే, క్షేత్రస్థాయిలో కొందరు ఉద్యోగులు విధులకు సక్రమంగా హాజరు కాకపోవడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం గుర్తించింది. ఈ ఫేషియల్




అటెండెన్స్ వల్ల ఉద్యోగులు కచ్చితంగా కార్యాలయాల్లో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. తద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు నిర్ణీత సమయంలో అందుతాయని, వ్యవస్థ మరింత పటిష్టమవుతుందని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది. ప్రభుత్వ నిర్ణయంపై సచివాలయ ఉద్యోగ సంఘాల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లే సమయంలో ఈ హాజరు విధానం ఇబ్బందికరంగా మారుతుందని కొందరు ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సాంకేతిక సర్దుబాట్లు చేయాలని కోరుతున్నారు. అయితే, ప్రభుత్వం మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గేది లేదని, పారదర్శకమైన పాలన కోసం ఇలాంటి కఠిన నిర్ణయాలు తప్పవని స్పష్టం చేస్తోంది. రాబోయే కొద్ది రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా అన్ని సచివాలయాల్లో ఈ విధానం పూర్తిస్థాయిలో అమలులోకి రానుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సేవలను ప్రజల ఇంటి వద్దకే చేరవేసే లక్ష్యంతో 2019లో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ఏర్పాటైంది. ప్రతి 2,000 మంది జనాభాకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసి, అక్కడ వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన సుమారు 10 నుండి 11 మంది ఉద్యోగులను నియమించారు. కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల నుండి సంక్షేమ పథకాల లబ్ధి వరకు దాదాపు 500కు పైగా సేవలను స్థానికంగానే అందించడం ఈ వ్యవస్థ ప్రత్యేకత. సచివాలయ సిబ్బందికి తోడుగా గ్రామాల్లో ఉండే వాలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తారు. పరిపాలనను వికేంద్రీకరించి, అవినీతికి తావులేకుండా పారదర్శకమైన సేవలు అందించడమే ఈ వ్యవస్థ ప్రధాన ఉద్దేశం. ప్రభుత్వం మారిన తర్వాత వాలంటీర్లను కొనసాగించలేదు. ఎక్కువ సేవలు వాట్సాప్ ద్వారానే అందిస్తున్నారు. దీంతో ఉద్యోగులకు పనిలేకుండా పోయిందన్న అభిప్రాయం వినిపిస్తోంది.